ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 08.10.2026 | సంపుటి :13 సంచిక : 79 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ఎంపీలతో పోలీసుల దురుసు ప్రవర్తనను ఖండిస్తూ నేలపై పడుకుని నిరసన వ్యక్తం చేస్తున్న ప్రియాంక గాంధీ

# జ్ఞానేశ్ గద్దెదిగు..

## ఢిల్లీలో మహానిరసన.. రాహుల్,ప్రియాంక అరెస్టు..

## అగ్రనేతలను బలవంతంగా ఈడ్చుకెళ్లడంపై కాంగ్రెస్ నిరసన

మంగళవారం ఈసీని కలుద్దామని 300 మంది ఎంపీలం వెళ్లాం. లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు ఈసీని కలవాలనుకున్నాం. కానీ వారు మమ్మల్ని కలవడానికి నిరాకరించారు. ఢిల్లీ పోలీసులు మమ్మల్ని అడ్డుకుని అక్కడ నిరసన తెలపడానికి వీల్లేదని చెప్పారు. సీఈసీకి పదవిలో కొనసాగే అర్హత లేదు. మా దృష్టిలో ఆయన ఈ దేశానికి చట్టబద్ధమైన ఎన్నికల కమిషనర్ కాదు. మోదీ, అమిత్ షా, మోహన్ భాగవత్, జ్ఞానేష్ కుమార్ కలిసి ఈ దేశ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేశారు. దీనికి బాధ్యులైన వారంతా దేశద్రోహులు. వారిపై మేము చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. జ్ఞానేష్ కుమార్ కచ్చితంగా రాజీనామా చేయాల్సిందే. - రాహుల్

“ఎంపీలతో ప్రవర్తించే తీరు ఇదేనా? ఎంపీలను కొడతారా? ఈడ్చి పడేస్తారా? ఎంపీలు ఏం అడుగుతున్నారు? ఈసీని కలుద్దామని ఎంపీలు అడగడం నేరమా?” - ప్రియాంక

- విపక్ష కూటమి ఎంపీల ఆందోళనలో తీవ్ర ఉద్రిక్తత
- నేలపై పడుకొని నిరసన తెలిపిన ప్రియాంక గాంధీ
- పోలీసులు తనను గాయపరిచి కింద పడేశారని ఆగ్రహం
- ఎన్ని కేసులు పెట్టినా పోరాటం ఆగదు: మల్లికార్జున ఖర్గే



జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపేందుకు వెళ్తున్న రాహుల్ అడ్డుకుని అరెస్టు చేస్తున్న పోలీసులు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, సర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ సహా విపక్ష పార్టీల నేతలు చేపట్టిన ఆందోళనలతో ఢిల్లీ మరోసారి అట్టుడికింది. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలు సహా విపక్ష ఎంపీలు తన నిరసన తెలిపేందుకు జంతర్ మంతర్‌కు వెళ్లేందుకు ప్రయత్నించడంతో అక్కడ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఆంక్షల నేపథ్యంలో వీరందర్నీ పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ప్రియాంకా గాంధీ సహా పలువురు మహిళా నేతలు, కార్యకర్తలు నేలపైనే మిగతా 2లో..

### రాహుల్, ప్రియాంకపై ఎఫ్ఐఆర్

2లో..

- పలువురు విపక్ష ఎంపీలపై కూడా..
- ప్రతీ ఎఫ్ఐఆర్ ఒక మెడల్..
- వంద నా టార్గెట్: రాహుల్ గాంధీ

జ్ఞానేశ్ రాజీనామా చేసే వరకు

### పోరు ఆగదు

- అక్టోబర్ 10న జంతర్ మంతర్ వద్ద నిరసన
- సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ ప్రకటన

2లో..

### ఓటు విలువను కాపాడే రాహుల్ పోరాటాన్ని బారికేడ్లు ఆపలేవు

- ఓటు చోరీ ఆరోపణలకు ఎన్నికల సంఘం బహిరంగ సమాధానాలు ఇవ్వాలి
- ప్రజాప్రతినిధులను అదుపులోకి తీసుకున్నంత మాత్రాన వారి ప్రశ్నలను అణచలేరు
- ఎన్నికల పారదర్శకతపై దేశవ్యాప్త చర్చకు దారితీసిన రాహుల్ గాంధీకి అభినందనలు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



సీఈసీ రాజీనామా చేసేవరకు

### పోరాడతాం



- ‘సర్’ను తక్షణమే నిలిపివేయాలి
- ప్రజల ఓటు హక్కును ఈసీ హరిస్తోంది
- ప్రజాస్వామ్యయుతంగా చేపట్టిన ఆందోళనను అడ్డుకోవడం మోదీ, అమిత్ షా నిరంకుశత్వానికి నిదర్శనం : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
దేశ ప్రజల ఓటు హక్కును హరించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. దేశంలో ఓటు హక్కు ఉన్నవారు, లేనివారు అంటూ రెండు వర్గాలను సృష్టించే ప్రయత్నం జరుగుతోందని వాపోయారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశాల మేరకే ఎన్నికల సంఘం ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ అగ్రనేత, మిగతా 2లో..

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు

## రెండు డీఏలు

మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం రెండు డీఏలు మంజూరు చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. జనవరి, జులై డీఏలను ప్రభుత్వం విడుదల చేసింది. రెండు డీఏలు కలిపి 6.27 శాతం పెరుగుదల ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అక్టోబర్ వేతనంతో కలిపి పెరిగిన డీ ఏలను చెల్లించనున్నారు. డీఏ బకాయిలు జీపీఎఫ్ ఖాతాలో జమ వుతాయి. సీపీ ఎస్ ఉద్యోగులకు మొదటి డీఏ 33, రెండో డీఏ 27 వాయిదాలలో చెల్లించనున్నారు.



డిస్కమ్‌లు, ట్రాన్స్‌కో, జెన్‌కోను

## ప్రైవేటీకరించం

ఆ ఆలోచనే లేదు: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్(జనంసాక్షి):**
తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే విద్యుత్ డిమాండ్ అత్యధిక స్థాయికి చేరిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 19,892 మెగావాట్లకు చేరిందని తెలిపారు. “20 వేల మెగావాట్ల డిమాండ్ ఉన్నా విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేస్తున్నాం. కొందరు నేతలు తప్పుడు ప్రచారంతో ప్రజలను గందరగోళపరుస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా.. అవసరాలకు తగ్గట్టు విద్యుత్ సరఫరా చేస్తున్నాం. డిస్కమ్‌లు, ట్రాన్స్‌కో, జెన్‌కోను ప్రైవేటీకరించే ఆలోచనే లేదు. విద్యుత్ సంస్థలను లిస్టెడ్ కంపెనీలుగా మార్చే ప్రతిపాదన లేదు. పదేళ్లు మంత్రిగా ఉన్న హరీశ్‌రావు అలా మాట్లాడటం సరికాదు. విద్యుత్ సిబ్బందిని కించపరిచే విధంగా రాజకీయ నేతలు విమర్శలు చేస్తున్నారు. ఊహించుకుని మాట్లాడటం వల్ల రాష్ట్రానికే నష్టం. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం వల్ల భారీగా విద్యుత్ డిమాండ్ పెరిగింది. యాదాద్రి పవర్ ప్లాంట్ పాపం ఎవరిది? ఒక పవర్ ప్లాంట్ మిగతా 2లో..

తెలంగాణలో ‘సర్’ చివరిదశకు

### కొలిక్కి వస్తున్న ప్రక్రియ



**హైదరాబాద్(జనంసాక్షి):**
తెలంగాణలో సర్ ప్రక్రియ కొలిక్కి వస్తోంది. రాష్ట్రంలో ఎస్ఐఆర్ నోటీసుల జాబితాలోని 76 శాతం ఓటర్లు తుది జాబితాకు అర్హత పొంది ఊపిరి పీల్చుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం వరకు 91,92,625 మందికి నోటీసులు ఇవ్వగా.. వారిలో 71,23,526 మంది సరైన ధ్రువపత్రాలు సమర్పించి తుది జాబితాకు అర్హత పొందినట్లు సీఈవో కార్యాలయం ప్రకటించింది. మిగతా సుమారు 20 లక్షల మంది ఓటర్ల విచారణ జరగాల్సి ఉంది. ఇంకా 95,555 మంది ఓటర్లకు నోటీసులు ఇవ్వాల్సి ఉంది. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం కాకముందు రాష్ట్రంలో 3,38,26,448 ఓటర్లు ఉండగా.. అందులో 2,43,23,162 ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారాలు నింపి ఇచ్చారు. దీంతో ఎన్యుమరేషన్ దశలోనే 73,39,000 ఓట్లు పోయాయి. మరో 92,88,181 మందికి నోటీసులు జనరేట్ చేశారు. నవంబరు 5 వరకు నోటీసులు జారీ, విచారణ ప్రక్రియ కొనసాగనుంది. ఇవాళ్టి వరకు రాష్ట్రవ్యాప్తంగా 2,43,23,162 మంది ఓటర్లు తుది జాబితాకు అర్హత సాధించారు.

### దసరా పండుగకు 7వేల ప్రత్యేక బస్సులు: టీజీఎస్ ఆర్టీసీ

2లో..

## తెలంగాణ బలం.. యువత నైపుణ్యమే

ప్రపంచ సంస్థలకు హైదరాబాద్ గమ్యస్థానం: మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్(జనంసాక్షి):**
తెలంగాణకు ఉన్న అతిపెద్ద బలం యువతలోని నైపుణ్యం, ప్రతిభ, ప్రపంచ స్థాయి పోటీతత్వమేనని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఈ ప్రతిభ కారణంగానే హైదరాబాద్ సాంకేతిక, ఆవిష్కరణ, ఆర్థిక సేవలు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు (జీసీసీ) దేశంలోనే ప్రముఖ గమ్యస్థానంగా ఎదుగుతోందని వెల్లడించారు. జూబ్లీహిల్స్‌లో బుధవారం నాడు జరిగిన డిఇ షా షా ఇండియా 30వ వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్‌లో డీఈ షా మూడు దశాబ్దాల ప్రస్థానం నగరంపై, తెలంగాణలోని ప్రతిభావంతులైన మానవ వనరులపై ఆ సంస్థకు ఉన్న దీర్ఘకాలిక విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా డిఇ షా గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్లు ఎడ్డీ ఫిష్‌మన్, అనూప్ ప్రసాద్, నీల్ కాట్జ్‌కు మంత్రి అభినందనలు తెలిపారు. సంస్థ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్లు చైతన్య గొర్రెపాటి, లక్ష్మీ ప్రసాద్ కోనేటితో పాటు సంస్థలోని మొత్తం బృందానికి శుభాకాంక్షలు చెప్పారు. హైదరాబాద్ సామర్థ్యాన్ని తొలినాళ్లలోనే గుర్తించిన ప్రపంచస్థాయి ఆర్థిక, సాంకేతిక సంస్థల్లో డిఇ షా ఒకటని శ్రీధర్‌బాబు అన్నారు. 1996లో హైదరాబాద్‌లో తొలి భారత కార్యాలయాన్ని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు.“ సుమారు 20 మందితో ప్రారంభమైన డిఇ షా ఇండియా ప్రస్థానం ఇవ్వాళ హైదరాబాద్, బెంగళూరు, గురుగ్రామ్‌లలో 2,000 మందికి పైగా ఉద్యోగులతో విస్తరించింది. సాంకేతికత, ఆర్థిక పరిశోధన, ఫైనాన్షియల్ ఆపరేషన్స్, కార్పొరేట్ విభాగాల్లోని సంస్థ బృందాలు ప్రపంచవ్యాప్తంగా సేవలందిస్తున్నాయి” అని మంత్రి తెలిపారు. మూడు దశాబ్దాలుగా డీఈ షా సాధించిన మిగతా 2లో..

ఎండీఆర్ వల్ల యూపీఐ లావాదేవీలపై

## ప్రభావం ఉండదు



ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

**ముంబయి(జనంసాక్షి):** యూపీఐపై విధించిన చిన్నపాటి ఎండీఆర్ ఛార్జీల వల్ల లావాదేవీలపై పెద్దగా ప్రభావం ఉండబోదని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ప్రస్తుతానికి లావాదేవీల్లో ఎలాంటి తగ్గుదలా లేదని చెప్పారు. వ్యక్తిగతంగానూ ప్రభావం ఉంటుందని తాను అనుకోవడం లేదన్నారు. రూ.2 వేలు దాటిన నిర్దిష్ట యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేటు విధిస్తూ గత నెల కేంద్రం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఎంపీసీ భేటీ నిర్ణయాలు వెల్లడించేందుకు నిర్వహించిన విలేకరుల సమావేశంలో దీనిపై ఆర్‌బీఐ గవర్నర్ దీనిపై మాట్లాడారు. సమీప భవిష్యత్తులో రేట్ల తగ్గింపు ఉండబోదని ఈ సందర్భంగా గవర్నర్ మిగతా 2లో..

మూసీ ఒడ్డున ఓంకారేశ్వర ఆలయ అభివృద్ధికి

### రూ.1108 కోట్లు

2లో..

ఎన్నికల కమిషనర్ల నియామకాల తీర్పు రికాల్‌పై

## సుప్రీంలో పిటిషన్

విచారణకు స్వీకరించిన ధర్మాసనం



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఎన్నికల కమిషనర్ల నియామక చట్టంపై సుప్రీంకోర్టులో మరో కీలక మలుపు తిరిగింది. నాటి తీర్పును వెనక్కి తీసుకోవాలంటూ పిటిషన్ దాఖలైంది. పిటిషన్‌ను పరిశీలిస్తామమని ప్రధాన న్యాయమూర్తి వెల్లడిప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ల (ఈసీ) నియామకానికి సంబంధించిన 2023 చట్టంపై దాఖలైన పిటిషన్ల విషయంలో సుప్రీంకోర్టులో కీలక పరిణామం జరిగింది. ఈ అంశంపై సెప్టెంబర్ 23న వెలువడిన భిన్నమైన తీర్పును వెనక్కి తీసుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను పరిశీలించేందుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. ప్రధాని, లోక్‌సభ విపక్ష నేత, సీజేఐలతో కూడిన కమిటీ చేసే సిఫార్సుపై సీఈసీ, ఈసీల నియామకాలను రాష్ట్రపతి చేస్తారని 2023 మార్చి 2న ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. సీజేఐ బదులు కేంద్ర మంత్రికి అవకాశమిస్తూ ఆ ఏడాది డిసెంబరులో పార్లమెంటులో చట్టాన్ని రూపొందించడంతో దాని రాజ్యాంగబద్ధ చెల్లుబాటును పలువురు సవాల్ చేశారు. ఈ పిటిషన్లను విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి అప్ప గించాలా? అనే అంశంపై సెప్టెంబర్ 23న జస్టిస్ దీపాంకర్ దత్తా, మిగతా 2లో..

నిరసనలు తెలిపినంత మాత్రాన

### విద్యార్థులు సంఘవిద్రోహులు కాదు

బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు

2లో..



ఢిల్లీలో కుప్పకూలిన

### మరో భవనం..

శిథిలాల కింద పలువురు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
దేశ రాజధాని ఢిల్లీలో మరో భవనం కుప్పకూలింది. సీమాపురి ప్రాంతంలో నాలుగు అంతస్తుల భవనం కూలిన ఘటనలో.. శిథిలాల కింద పలువురు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. మిగతా 2లో..

రసాయన శాస్త్రంలో పరిశోధనలకు

## ఇద్దరికి నోబెల్





ఫ్రాన్స్‌కు చెందిన హెన్రీ కగాన్, జపాన్‌కు చెందిన కెన్సో సావాయ్‌లకు పురస్కారం

**స్వీడన్(జనంసాక్షి):**రసాయన శాస్త్రంలో విశేష పరిశోధనలు జరిపిన ఇద్దరు శాస్త్రవేత్తలు ఈ ఏడాది నోబెల్ బహుమతి కి ఎంపికయ్యారు. ఫ్రాన్స్‌కు చెందిన హెన్రీ కగాన్, జపాన్‌కు చెందిన కెన్సో సావాయ్‌లు ఈ మిగతా 2లో..




హెచ్1బీ నిబంధనలు ఉల్లంఘిస్తే

### భారీ జరిమానా

- నిషేధానికి ప్రతిపాదన
- ప్రతినిధుల సభలో రిపబ్లికన్ పార్టీకి చెందిన సభ్యుల బిల్లు

**వాషింగ్టన్(జనంసాక్షి):**హెచ్1బీ వీసాల నిబంధనలను ఉల్లంఘించే సంస్థలకు భారీ జరిమానా విధించాలని రిపబ్లికన్ పార్టీకి చెందిన సభ్యులు అమెరికా మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
08.10.2026

## రాహుల్, ప్రియాంకపై ఎఫ్ఐఆర్

న్యూఢిల్లీ(జనంసాక్షి):కాంగ్రెస్ అగ్రనాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీపై బుధవారం ఎఫ్ఐఆర్ నమోదైంది. ఆ ఎఫ్ఐఆర్‌లో పలువురు ఎంపీల పేర్లు కూడా ఉన్నాయి. అనుమతి లేకుండా ఆకాశవాణి కార్యాలయంలోకి బలవంతంగా ప్రవేశించారన్న ఆరోపణలపై అందిన ఫిర్యాదు ఆధారంగా దిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా డిమాండ్‌తో ఎన్నికల సంఘం కార్యాలయానికి విపక్షాలు మంగళవారం చేపట్టిన ర్యాలీలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ నిరసన ప్రదర్శనకు ఇండియా కూటమి నేతలు దిల్లీ పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోలేదు. దాంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఆ తర్వాత రాహుల్ ప్రియాంక ఇతర నేతలు అనూహ్యంగా ఆకాశవాణి భవన్ వద్దకు వెళ్లారు. అక్కడ కొన్ని గంటల పాటు ధర్నా చేశారు.

**ప్రతి ఎఫ్ఐఆర్ ఒక మెడల్..:రాహుల్ గాంధీ**

విపక్ష ఎంపీల సమావేశం ముగిసిన అనంతరం దిల్లీలో మరోసారి ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. మరోసారి ఈసీ కార్యాలయానికి వెళ్లడానికి ప్రతిపక్ష ఎంపీలు సిద్ధమయ్యారు. దీంతో ఎన్నికల కమిషన్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున పోలీసులను మోహరించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. మోదీ, అమిత్‌షాలు జ్ఞానేశ్ ద్వారా ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడితే తనపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. వాటిని పతకాలుగానే భావిస్తానన్నారు. ఇప్పటి వరకు తనపై 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయని.. వంద సాధించడమే తన లక్ష్యమని అన్నారు. 'లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు ఈసీని కలవాలనుకున్నాం. అందుకే మంగళవారం ఈసీని కలుద్దామని 300మంది ఎంపీలం వెళ్లాం. మాకు అనుమతి నిరాకరించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు పదవిలో కొనసాగే అర్హత లేదు. మా దృష్టిలో ఆయన చట్టబద్ధమైన అధికారి కాదు. అందుకే పదవి దిగిపోవాలని కోరుతున్నాం. దేశ ద్రోహులపై చర్యలు తీసుకునే వరకు మా పోరాటం ఆగదు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేపడతాం' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. సీఈసీకి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టడానికి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సహా విపక్ష ఎంపీలు జంతర్‌మంతర్ వద్దకు బస్సుల్లో బయల్దేరారు. వారిని అడ్డుకోవడానికి జంతర్‌మంతర్ వద్ద వందల సంఖ్యలో పోలీసులు, భద్రతా బలగాలు మోహరించారు.

# జ్ఞానేశ్ గద్దెదిగు

పడుకొని నిరసన తెలిపారు. దీంతో జంతర్‌మంతర్ సమీపంలో కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రాహుల్ గాంధీ సహా పలువురు ఎంపీలను అదుపులోకి తీసుకున్న పోలీసులు బరఖాంబ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. నిరసన ప్రదేశం నుంచి రాహుల్‌ను బలవంతంగా తీసుకెళ్లి పోలీసులు బస్సులో ఎక్కించారు. ప్రియాంకా గాంధీని ఛత్రసాల పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంలో దిల్లీ పోలీసుల తీరుపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఎంపీలతో ప్రవర్తించే తీరు ఇదేనా? ఎంపీలను కొడతారా? ఈడ్చి పడేస్తారా?" అని ప్రశ్నించారు. మరోవైపు రాహుల్ గాంధీకి సంఘీభావం తెలిపేందుకు బరఖాంబ పీఎస్ వద్దకు వెళ్లిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కేరళం ముఖ్యమంత్రి సతీశన్‌లను పోలీసులు అడ్డుకున్నారు. అక్కడికి కాంగ్రెస్ నేతలు భారీగా చేరుకొని ఆందోళన చేపట్టగా వారిని పోలీసులు నిలువరించారు. దాదాపు రెండు గంటలపాటు రాహుల్‌ను పీఎస్‌లో ఉంచిన అనంతరం విడుదల చేశారు.

**రోడ్డుపై పడుకొని ప్రియాంక గాంధీ నిరసన**

దిల్లీ: సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో విపక్ష ఇండియా కూటమి ఎంపీల నిరసనలతో జంతర్ మంతర్ వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంకా గాంధీ రహదారిపై పడుకొని నిరసన తెలిపారు. దిల్లీ పోలీసుల తీరుపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఎంపీలతో ప్రవర్తించే తీరు ఇదేనా? ఎంపీలను కొడతారా? ఈడ్చి పడేస్తారా? ఎంపీలు ఏం అడుగుతున్నారు? ఈసీని కలుద్దామని ఎంపీలు అడగడం నేరమా?" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీని పోలీసులు నిరసన ప్రదేశం నుంచి బలవంతంగా తరలించారు. విపక్షాల నిరసనలతో దిల్లీ మరోసారి దద్దరిల్లింది. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో 'ఇండియా' కూటమి ఎంపీలు బుధవారం చేపట్టిన నిరసన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. జంతర్‌మంతర్ వద్దకు వెళ్లేందుకు ఎంపీలు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ప్రియాంకా గాంధీ రోడ్డుపైనే పడుకొని నిరసన తెలిపారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీతో పాటు పలువురు ఎంపీలను నిరసన ప్రదేశం నుంచి తరలించేందుకు పోలీసులు ప్రయత్నించగా కార్యకర్తలు అడ్డుకొనే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్తత నెలకొంది.రాహుల్ గాంధీని బలవంతంగా తీసుకెళ్లి పోలీసులు బస్సు ఎక్కించగా.. ఆ బస్సు టైరును కాంగ్రెస్ శ్రేణులు పంక్చర్ చేశాయి. దీంతో ఆయన్ను మరో బారాఖంబా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే, ప్రియాంకా గాంధీ ఇతర నేతలను మరో బస్సులో స్టేడియానికి తరలించారు. అయితే, రాహుల్ గాంధీని పోలీసులు విడుదల చేయడంతో ఆయన ఇంటికి చేరుకున్నట్లు సమాచారం. మంగళవారం ఆకాశవాణి భవన్ ప్రాంగణంలోకి అనుమతి లేకుండానే ప్రవేశించారనే ఆరోపణలపై రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర ఎంపీలపై దిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీనిపై స్పందించిన కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ్య ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కేంద్రంపై తీవ్ర విమర్శలు చేశారు. తమపై ఎన్ని కేసులు పెట్టినా తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు.

## సీఈసీ రాజీనామా చేసే వరకు పోరాడతాం

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేస్తే.. ఆయనపై చర్యలు తీసుకోవడం దారుణమని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలను అరెస్టు చేసిందని మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని అన్నారు.

**'సైమన్ గో బ్యాక్' తరహాలో 'జీకే గో బ్యాక్'**

గతంలో 'సైమన్ గో బ్యాక్' ఉద్యమం దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిందని సీఎం గుర్తుచేశారు. ఇప్పుడు దేశంలో 'సర్ గో బ్యాక్', 'జీకే గో బ్యాక్' ఉద్యమం కొనసాగుతోందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. గతంలో రైతుల ఉద్యమం సందర్భంగా మోడీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించినా... చివరకు ప్రజల ఒత్తిడికి తలొగ్గి చట్టాలను వెనక్కి తీసుకోవాల్సి వచ్చిందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఇప్పుడు కూడా ఎంత మొండిగా వ్యవహరించినా జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాల్సిందేనని పేర్కొన్నారు. అవసరమైతే ఈ వ్యవహారం మరింత ముందుకు వెళ్లి ప్రధాని రాజీనామా చేయాల్సిన పరిస్థితి కూడా వస్తుందని అన్నారు.

**కాంగ్రెస్ ఉద్యమం కాదు ఇది...**

ప్రజల ఉద్యమందేశంలోని ప్రజలు జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రజల హక్కులను కాలరాసిన వారికి చరిత్రలో ఎవరూ తప్పించుకోలేదని, చివరకు ప్రజల కోర్టులోనే తీర్పు ఎదుర్కోవాల్సి వచ్చిందని చెప్పారు. ఇప్పటికైనా ప్రతిపక్షాల డిమాండ్‌ను అంగీకరించి జ్ఞానేశ్ రాజీనామా చేయించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. రాజ్యాంగాన్ని కాపాడేందుకు వీధుల నుంచి పార్లమెంట్ వరకు పోరాటం కొనసాగుతుందని సీఎం స్పష్టం చేశారు. ఇది కాంగ్రెస్ పార్టీకి మాత్రమే పరిమితమైన ఉద్యమం కాదని, ఇండియా కూటమి, ప్రజల ఉద్యమమని అన్నారు. ప్రజలు ఒక్కటై గొంతెత్తితే ప్రభుత్వం తప్పనిసరిగా వినాల్సిందేనని, లేకపోతే ప్రజలే తగిన సమాధానం చెబుతారని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.

## జ్ఞానేశ్ రాజీనామా చేసే వరకు పోరాటం ఆగదు: సీజేపీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటం ఆగదని 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్?, ఎన్నికల ప్రక్రియలో జరిగిన అవకతవకల విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం వైఖరిని నిరసిస్తూ అక్టోబర్ 10న దిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో దిల్లీ పోలీసులకు రాతపూర్వకంగా సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. సీజేపీ తలపెట్టనున్న నిరసన ప్రదర్శనకు దేశవ్యాప్తంగా ఉన్న యువత, ముఖ్యంగా 'జెన్ జీ' భారీగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అవకతవకలు, ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలు వంటి ఆరోపణలపై తీవ్ర దుమారం రేగుతోంది. మరోవైపు సీఈసీ రాజీనామా చేయాలని విపక్షాలు స్థాయిలో డిమాండ్? చేస్తున్నాయి. ఇదే సమయంలో సీజేపీ సైతం ఆందోళనకు దిగడం ఈ ఉద్రిక్తతలను మరింత పెంచుతోంది.ఎన్నికల సంఘం తీరుపై దేశవ్యాప్తంగా ఉన్న యువత, ప్రత్యేకించి 'జెన్ జీ' తరం తీవ్ర ఆగ్రహంతో ఉందని సౌరవ్ దాస్ వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు సహకరించాలని, నిరసనకారుల రాకను దృష్టిలో ట్రాఫిక్ ఏర్పాట్లు చేయాలని తాము కోరినట్లు ఆయన వివరించారు. ప్రజాస్వామ్యయుతంగా జరిగే ఈ శాంతియుత నిరసనకు దిల్లీ పోలీసులు పూర్తి స్థాయిలో సహకరిస్తారని తాము ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ఓటు విలువను కాపాడే రాహుల్ పోరాటాన్ని బారికేడ్లు ఆపలేవు

హైదరాబాద్(జనంసాక్షి): "ప్రజల ఓటు విలువను కాపాడాలంటూ రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటాన్ని పోలీసు బారికేడ్లతో ఆపలేరు. ప్రజాప్రతినిధులను అదుపులోకి తీసుకున్నంత మాత్రాన వారు లేవనెత్తిన ప్రశ్నలు మాయమైపోవు. సమాధానం కోసం నిలబడిన గొంతును అడ్డుకుంటే, ఆ ప్రశ్న మరింత బలంగా దేశమంతటా ప్రతిధ్వనిస్తుంది," అని నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖల మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఎన్నికల పారదర్శకత కోసం దృఢంగా నిలబడి, ప్రతిపక్ష నిరసనకు నాయకత్వం వహించిన రాహుల్ గాంధీకి ఆయన అభినందనలు తెలిపారు.ఢిల్లీలో ఎన్నికల సంఘం వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించిన రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకోవడం, అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య జవాబుదారీతనంపై మరింత చర్చకు దారితీసిందని ఉత్తమ్ పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల సవరణ, ఎన్నికల ప్రక్రియ నిష్పాక్షికతపై వివరణ కోరుతున్న నాయకులను అడ్డుకున్న దృశ్యాలు ప్రజల దృష్టిని ఆకర్షించాయని అన్నారు. "బారికేడ్ల ఎత్తుతో ప్రజాస్వామ్య బలాన్ని కొలవలేరు. ప్రజల సందేహాలకు ఇచ్చే సమాధానాల స్పష్టతలోనే వ్యవస్థల బలం కనిపిస్తుంది," అని వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం తన రాజ్యాంగబద్ధమైన బాధ్యతలకు అనుగుణంగా పూర్తి నిష్పాక్షికతతో వ్యవహరించాలని మంత్రి స్పష్టం చేశారు. "రాజ్యాంగ సంస్థల ప్రతిష్ఠను నిలబెట్టేది అధికార దర్పం కాదు; ప్రజల విశ్వాసం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే నిర్ణయాల్లో పారదర్శకత, అభ్యంతరాల పరిశీలనలో నిజాయితీ, సమాధానాల్లో స్పష్టత ఉండాలి. సంస్థను ప్రశ్నించడం దాని ప్రతిష్ఠను దెబ్బతీయడమంటూ భావించే ధోరణి ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం," అని అన్నారు.ఓటర్ల జాబితాలపై వచ్చిన అభ్యంతరాలను రాజకీయ విమర్శలంటూ కొట్టిపారేయడం సరికాదని ఉత్తమ్ పేర్కొన్నారు. "అర్హుడైన ఒక్క పౌరుడి పేరు అన్యాయంగా తొలగినా, అది ఆ వ్యక్తి హక్కుకు జరిగిన నష్టం. అలాంటి అభ్యంతరాన్ని చిన్న విషయంగా తీసుకునే అవకాశం ఎవరికీ లేదు. జాబితాల సవరణకు అనుసరించిన ప్రమాణాలు, పేర్ల తొలగింపునకు కారణాలు, అభ్యంతరాల పరిష్కార విధానం ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలి. ఆధారాలతో లేవనెత్తిన ఆరోపణలను నిష్పాక్షికంగా పరిశీలించి, ఆ పరిశీలన ఫలితాలను బహిరంగంగా వెల్లడించాలి," అని డిమాండ్ చేశారు.ఓటు చోరీ ఆరోపణలను దేశవ్యాప్త చర్చలోకి తీసుకురావడంలో రాహుల్ గాంధీ కీలక పాత్ర పోషించారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. "సామాన్యుడి చేతిలోని ఓటు అతడి ఆత్మగౌరవానికి ముద్ర. పాలకులను ఎన్నుకునే అతడి స్వేచ్ఛకు ఆయుధం. ఆ ఓటుపై అనుమానపు నీడ పడితే ప్రజాస్వామ్య పునాదులే దెబ్బతింటాయి." ప్రతి ఓటుకూ విలువ ఉండాలని, ప్రతి అర్హుడూ తన ఓటు హక్కును వినియోగించుకోవాలని రాహుల్ గాంధీ పట్టుబడుతున్నారని పేర్కొన్నారు. ఈ లక్ష్యంతో ఆయన చేస్తున్న పోరాటం దేశ ప్రజలందరికీ సంబంధించినదని స్పష్టం చేశారు.అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించే హక్కు ప్రజలకు, ప్రజాప్రతినిధులకు ఉందని ఉత్తమ్ అన్నారు. "ప్రతిపక్షం లేవనెత్తిన అం శాలకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత నుంచి పాలకులు తప్పించుకోలేరన్నారు.

## రసాయన శాస్త్రంలో పరిశోధనలకు ఇద్దరికి నోబెల్

పురస్కారం అందుకోనున్నారు. అసిమెట్రిక్ ఆర్గానిక్ సింథసిస్‌లో నాన్‌లీనియర్ ప్రభావాలు, ఆటోకాటలిసిస్ ఆవిష్కరణలకు గాను నోబెల్‌కు వీరిని ఎంపిక చేసినట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ వెల్లడించింది. మెటల్–ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్ అభివృద్ధి చేసినందుకు గతేడాది ముగ్గురు శాస్త్రవేత్తలు ఈ పురస్కారం అందుకున్న విషయం తెలిసిందే. రసాయన శాస్త్రంలో 1901 నుంచి 2025 వరకు 117 సార్లు నోబెల్‌ను ప్రకటించగా.. 198 మంది దీనిని అందుకున్నారు. 35 ఏళ్ల వయసులో నోబెల్ అందుకున్న ఫ్రెడెరిక్ జొలియట్ అతిపిన్న వయస్కుడిగా నిలవగా.. జాన్.బి గూడ్‌ఎనఫ్ 97 ఏళ్ల వయసులో కెమిస్ట్రీలో పురస్కారం అందుకున్న వ్యక్తిగా నిలిచారు. ఇక ఫ్రెడెరిక్ సాంగెర్, బ్యారీ షార్ప్‌లెస్‌లు రసాయన శాస్త్రంలో రెండుసార్లు నోబెల్ అందుకున్న శాస్త్రవేత్తలుగా ఘనత సాధించారు.

## హెచ్1బీ నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానా..

ప్రతినిధుల సభలో ఓ బిల్లును ప్రవేశపెట్టారు. తీవ్రమైన ఉల్లంఘనలకు పాల్పడిన సంస్థలకు గరిష్ఠంగా 2.5 లక్షల డాలర్ల (రూ.2.42 కోట్లు) జరిమానాతోపాటు, పదేళ్ల పాటు నిషేధం విధించాలని బిల్లులో ప్రతిపాదించారు. ఇమ్మిగ్రేషన్‌కి సంబంధించి నకిలీ పత్రాలను సృష్టించేవారిపైనా చర్యలు తీసుకోవాలని ఆ బిల్లులో పేర్కొన్నారు.

## ఎండీఆర్ వల్ల యూపీఐ లావాదేవీలపై ప్రభావం ఉండదు

స్పష్టంచేశారు. అలాగే బ్యాంకుల రుణ వృద్ధి పటిష్ఠంగా కొనసాగుతుందని, దేశ ఆర్థిక కార్యకలాపాలకు దోహదపడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మార్కెట్‌లో నిధుల లభ్యత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల ఆస్తుల నాణ్యతపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం పట్ల ఆర్‌బీఐ అప్రమత్తంగా ఉందని, అలాంటి తీవ్ర పరిస్థితులు తలెత్తబోవని ఆయన స్పష్టంచేశారు. అయినా కొన్ని వారాలుగా కనిపిస్తున్న అధిక లిక్విడిటీ ఎక్కువ కాలం కొనసాగదని పేర్కొన్నారు. ప్రవాస భారతీయుల నుంచి బ్యాంకులు దాదాపు 133 బిలియన్ డాలర్ల ఎఫ్‌సీఎన్ఆర్(బి) డిపాజిట్లను సమీకరించడం దేశ స్థూల ఆర్థిక మూలాలు బలంగా ఉన్నాయనడానికి నిదర్శనమని చెప్పారు. ఈ నిధులను బ్యాంకులు బాధ్యతా యుతంగా వినియోగిస్తాయన్న నమ్మకం తనకు ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టాటా సన్స్ వ్యవహారం ప్రస్తావనకు రాగా.. స్పందించేందుకు ఆర్‌బీఐ గవర్నర్ నిరాకరించారు. టాటా సన్స్ తన ఎన్‌బీఎఫ్‌సీ లైసెన్స్‌ను సరెండర్‌కు నిరాకరించడం, స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ కావాలని ఆదేశించడంపై విలేకరుల నుంచి వచ్చిన ప్రశ్నలకు సమాధానాలను దాటవేయడం గమనార్హం.

## ఢిల్లీలో కుప్పకూలిన మరో భవనం

ఈమేరకు సమాచారం అందుకున్న వెంటనే అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని.. సహాయక చర్యలు ప్రారంభించారు. పక్కనే ఉన్న రెండు మూడు ఇళ్లపైనా భవన శిథిలాలు పడినట్లు తెలిపారు. పలువురిని రక్షించి ఆసుపత్రులకు తరలించామని.. మరో ఇద్దరు, ముగ్గురు శిథిలాల కింద చిక్కుకుని ఉంటారని భావిస్తున్నట్లు డీసీపీ రాజేంద్ర ప్రసాద్ మీనా తెలిపారు. దిల్లీ–ఎన్‌సీఆర్ పరిధిలో మంగళవారం రాత్రి భూప్రకంపనలు నమోదయ్యాయని, వాటి కారణంగా భవనానికి పగుళ్లు వచ్చాయని తెలుస్తోంది. అయితే, భవనం కూలిపోవడానికి గల అసలు కారణాలను విచారణ తర్వాత నిర్ధారిస్తామని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. నెల క్రితం దిల్లీలోని సత్యనికేతన్ ప్రాంతంలో ఓ భవనం కూలిన ఘటనలో ఏడుగురు మృతి చెందిన విషయం తెలిసిందే.

## మూసీ ఒడ్డున ఓంకారేశ్వర ఆలయ అభివృద్ధికి రూ.1,108 కోట్లు

హైదరాబాద్(జనంసాక్షి): మంచిరేవులలోని మూసీ నది ఒడ్డునున్న ఓంకారేశ్వర ఆలయ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రూ.1,108 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నిధులను ఆలయ అభివృద్ధి, ఆరు వరుసల రహదారి నిర్మాణానికి వినియోగించనున్నారు. మరోవైపు ఓంకారేశ్వర ఆలయానికి సాంకేతిక కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీకి ఛైర్మన్‌గా ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ చీఫ్, కమిటీ కోఛైర్మన్‌గా పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ చీఫ్ వ్యవహరించనున్నారు.



## ఎన్నికల కమిషనర్ల నియామకాల తీర్పు రికాల్‌పై సుప్రీంలో పిటిషన్

జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే ఈ అంశంపై ఇద్దరు న్యాయమూర్తులు ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. ఫలితంగా భిన్నమైన తీర్పులు వెలువడ్డాయి.

**భిన్న తీర్పులు**

ఈ కేసును మరింత విస్తృతమైన రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేయాలని కేంద్రం కోరింది. అయితే జస్టిస్ దీపాంకర్ దత్తా ఈ అభ్యర్థనను తిరస్కరించారు. ఎంపిక కమిటీలో ఒక క్యాబినెట్ మంత్రిని చేర్చడం వల్ల దాని తటస్థ స్వరూపం పోతుంది. 2023 చట్టం కార్యనిర్వాహక వర్గానికి ఎక్కువ అధికారాన్ని కట్టబెడుతుందని అభిప్రాయపడ్డారు. విపక్ష నేత ఉనికి నామమాత్రం అవుతుందని, కమిటీలో ఆయనను చేర్చిన ఉద్దేశం అలంకారప్రాయంగా మిగిలిపోతుందని పేర్కొన్నారు. కానీ, జస్టిస్ దత్తా వ్యాఖ్యను వ్యతిరేకిస్తూ, కేంద్ర వాదనను జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ మాత్రం ఏకీభవించారు. ఆర్టికల్ 145(3) ప్రకారం ఈ అంశాన్ని రాజ్యాంగ ధర్మాసనం అధికారికంగా నిర్ణయించాల్సి ఉంటుందని తెలిపారు. దీనిపై విస్తృత ధర్మాసనం పరిశీలించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీంతో తదుపరి చర్యల కోసం ఈ అంశాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వద్దకు పరిపాలనా పరంగా పంపాలని ద్విసభ్య ధర్మాసనం నిర్ణయించింది. తగిన సంఖ్యలో న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటు చేసి, అంశంపై సమర్థవంతమైన, తుది నిర్ణయం తీసుకునేలా చేయాలని సూచించింది.

## తెలంగాణ బలం.. యువత నైపుణ్యమే




వృద్ధి హైదరాబాద్ ఎదుగుదలతో ముడిపడి ఉందన్నారు. నగరం ఇప్పుడు ప్రపంచస్థాయి సాంకేతిక, ఆర్థిక సేవల సంస్థలకు కేంద్రంగా మారిందని చెప్పారు."హైదరాబాద్ గత మూడు దశాబ్దాల్లో ఎంతో మారింది. సాంకేతికత, ఆవిష్కరణలు, ఆర్థిక సేవలు, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు దేశంలోనే ప్రముఖ కేంద్రంగా ఎదిగింది. యువతలోని నైపుణ్యం, ప్రతిభే మన ప్రధాన బలం" అని శ్రీధర్‌బాబు అన్నారు.ప్రపంచ సంస్థలు కేవలం తమ కార్యకలాపాలను నిర్వహించే ప్రదేశంగా కాకుండా.. కొత్త ఆవిష్కరణలు, అత్యున్నత విలువ కలిగిన కార్యకలాపాలు, భవిష్యత్ సాంకేతికతల అభివృద్ధికి తెలంగాణను కేంద్రంగా ఎంచుకునేలా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు."ప్రపంచ సంస్థలు ఇక్కడ విస్తరించాలి. ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి. అత్యున్నత నైపుణ్యంతో కూడిన ఉద్యోగాలను సృష్టించాలి. ఇందుకు అవసరమైన అనుకూల వాతావరణాన్ని తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తోంది" అని చెప్పారు.డిఇ షా నియోపొలిస్‌లో ఏర్పాటు చేస్తున్న కొత్త కార్యాలయాన్ని మంత్రి స్వాగతించారు. హైదరాబాద్‌పై సంస్థకు ఉన్న దీర్ఘకాలిక నమ్మకానికి ఇది మరో నిదర్శనమన్నారు."నియోపొలిస్‌లో డిఇ షా ఏర్పాటు చేస్తున్న కొత్త కార్యాలయం కేవలం మరో కార్యాలయం కాదు. హైదరాబాద్ భవిష్యత్తుపై, తెలంగాణ వృద్ధి ప్రయాణంపై ఆ సంస్థకు ఉన్న విశ్వాసానికి ఇది బలమైన సంకేతం" అని శ్రీధర్‌బాబు అన్నారు.కొత్త కార్యాలయం ద్వారా హైదరాబాద్‌లో డీఈ షా కార్యకలాపాలు మరింత విస్తరించేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు."ఈ విస్తరణను తెలంగాణ స్వాగతిస్తోంది. రానున్న రోజుల్లో డీఈ షా రాష్ట్రంలో మరింతగా విస్తరిస్తుందని ఆశిస్తున్నాం" అని మంత్రి చెప్పారు.ప్రపంచస్థాయి సంస్థల విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి స్పష్టం చేశారు."డిఇ షా నాయకత్వానికి నేను హామీ ఇస్తున్నాను. మీ వృద్ధి, విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుంది. మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి, వ్యాపార నిర్వహణలో సౌలభ్యం, ఆవిష్కరణలకు మరింత ప్రాధాన్యం ఇస్తాం" అని శ్రీధర్‌బాబు అన్నారు.ప్రపంచ సాంకేతిక, ఆర్థిక సేవల సంస్థలకు తెలంగాణను మరింత ఆకర్షణీయ గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

## ప్రపంచం భారత్ వైపే చూస్తోంది

### నా భవిష్యత్తు గురించి నేను ఎప్పుడూ ఆలోచించలేదు: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):ముఖ్యమంత్రిగా, ప్రధానిగా 25 ఏళ్ల అధికార ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న నరేంద్రమోదీ.. భాజపా శ్రేణుల్లో కొత్త ఉత్తేజం నింపే ప్రయత్నం చేశారు. దేశీయంగా, అంతర్జాతీయంగా సవాళ్లు ఎదురవుతోన్న తరుణంలో 'మనం చేయగలం' అనే కొత్త నినాదాన్ని ఇచ్చారు (ఖతీతిఎవ ఓతినితిబబివతీ ఔజీతీవనిటతీజీ ఓనీటతి). దిల్లీలో ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన వికసిత్ భారత్ సంకల్ప్ సభలో ఈ మేరకు మాట్లాడారు. అలాగే తన భవిష్యత్తు గురించి ఎప్పుడూ ఆలోచించలేదని వ్యాఖ్యానించారు. "ప్రజల ఆశీర్వాద బలమే నన్ను ఇంతకాలం నడిపించింది. గుజరాత్ సీఎంగా ప్రమాణం చేసినప్పుడు ఇంతగా ఆలోచించలేదు. 25 ఏళ్లుగా నిరంతర ప్రజాసేవ అందిస్తానని నాడు ఊహించలేదు. ఆశీస్సులు అందించిన దేశ ప్రజలందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. నన్ను ఇంతగా ఆదరిస్తోన్న ప్రజలను ఎన్నటికీ మర్చిపోలేను.



ప్రజాసేవ చేసేందుకు నాకు భగవంతుడు శక్తినిచ్చాడు. ప్రజలు, భగవంతుడి ఆశీస్సులతో దేశానికి మరింత సేవ చేస్తా. ప్రజా సేవలో ఏనాడూ వెనుదిరగను. ప్రజలే నా దృష్టిలో దేవుడి స్వరూపం. వారు నాపై ఎంతో విశ్వాసం ఉంచారు.. దానిని ఎప్పటికీ వమ్ము చేయను. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎంతోమంది మద్దతుగా నిలిచారు. ప్రజా సేవలో ఉన్నప్పుడు విమర్శలు వస్తూనే ఉంటాయి. వాటిని పట్టించుకుంటే.. ముందుకు వెళ్లలేం. వ్యక్తిగతంగా నన్ను విమర్శిస్తే అది వారి విజ్ఞతకే వదిలేస్తాను. నన్ను రాజకీయంగా బలోపేతం చేసేది నా ప్రత్యర్థులే. వారు ఎంతగా విమర్శిస్తే.. నేను అంతగా ఆలోచిస్తాను. నేను నిరంతర విద్యార్థిని" అని మోదీ మాట్లాడారు. అలాగే వికసిత్ భారత్ గురించి మోదీ ప్రస్తావించారు. "2047 నాటికి వికసిత్ భారత్‌ను సాధించి తీరుతాం. ఆత్మనిర్భర్ భారత్, గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ సాధ్యమే. అంతరిక్షంలో అడుగుపెట్టడం, ఒలింపిక్స్ నిర్వహణ.. ఇలాంటివన్నీ సాధ్యమే. ప్రపంచమంతా ఇప్పుడు భారత్ వైపు చూస్తోంది. దేశాభివృద్ధికి ఇదే మంచి సమయం. నూతన చరిత్ర లిఖించే సమయం ఆసన్నమైంది. అన్ని రంగాల్లో నూతన ఆవిష్కరణలకు ఇదే సమయం. సమస్యలు ఉంటే.. పరిష్కారం కూడా దాని వెంటే ఉంటుంది. సంకల్ప బలం ఉంటే దేనినైనా సాధించవచ్చు. 25 ఏళ్లు అంటే ఒక విజయంగానే కాదు.. సేవగానూ భావిస్తాను. ఒక లక్ష్యం కోసం పనిచేస్తున్నప్పుడు ఎప్పటికీ అలసిపోను. భారత్ అభివృద్ధే నా జీవిత ఆశయం. దేశ అభివృద్ధి కోసం.. ఎన్ని అడ్డంకులు వచ్చినా ఎదుర్కొంటా. అడవుల్లో గిరిజన సమాజాలకు సేవ చేయడంలో నా సమయాన్ని గడిపా. నా భవిష్యత్తు ఏమిటో కూడా నేనెప్పుడూ ఆలోచించలేదు" అని వ్యాఖ్యలు చేశారు. "ఇప్పుడు ప్రపంచమంతా మన దేశ పైలట్ స్మిత్ మచ్చర్‌పైనే చర్చ జరుగుతోంది. భారతీయ పైలట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఒక రోజు భారత్‌లో తయారైన విమానం గురించి భారత్ మాట్లాడుతుంది. దేశ శక్తి సామర్థ్యాలు ప్రపంచానికి తెలియజెప్పే సమయం ఎంతో దూరంలో లేదు. దేశం అభివృద్ధి దిశలో పరుగులు పెడుతోంది. దానిని ఎవరూ ఆపలేరు. ఒకప్పుడు ఉగ్రవాదం పెనుముప్పుగా పరిణమించింది. ప్రజలు ఆందోళనతో జీవనం సాగించారు. గత ప్రభుత్వాలు ఉగ్రవాదంపై మెతకవైఖరి ప్రదర్శించాయి. దేశ భద్రతకు ముప్పు వస్తే.. ప్రతిఘటన ఎలా ఉంటుందో మేం చూపించాం" అని దేశ సైనిక సామర్థ్యాలను కొనియాడారు.

## దసరా పండుగకు 7వేల ప్రత్యేక బస్సులు

హైదరాబాద్(జనంసాక్షి): దసరా పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఉఊఖీఅ) పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. పండుగ సందర్భంగా 7వేల ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించింది. ఆయా రోజుల్లో రద్దీ మేరకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచేలా టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం ప్లాన్ చేసింది.కరీంనగర్ జోన్ నుంచి మొత్తం 3533 బస్సులు.. (రీజియన్ల వారీగా ఆదిలాబాద్ 431, నిజామాబాద్ 719, కరీంనగర్ 1175, వరంగల్ 530, ఖమ్మం 678) హైదరాబాద్ జోన్ నుంచి 2,155 బస్సులు.. (మహబూబ్ నగర్ 645, మెదక్ 255 , నల్గొండ 815, రంగారెడ్డి 440) గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1,312 ప్రత్యేక సర్వీసులను నడపాలని టీజీఎస్ ఆర్టీసీ నిర్ణయించింది. ప్రధానంగా ఈ నెల 9, 10, 16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం. ఈ నెల 25, 26 తేదీల్లో తిరుగు ప్రయాణ రద్దీకి సంబంధించి తగిన ఏర్పాట్లు దసరా పండుగకు నడిపే ప్రత్యేక బస్సులకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం టికెట్ ధరలను సవరించిన టీజీఎస్ఆర్టీసీ ప్రకటించింది

## డిస్కమ్‌లు, ట్రాన్స్‌కో, జెన్‌కోను ప్రైవేటీకరించే ఆలోచనే లేదు: భట్టి

పెట్టేముందు.. అవసరమైన కోల్ చూసుకుని పెడతారు. సింగరేణి నుంచి యాదాద్రికి గ్రేడ్ 9 కోల్ సప్లయ్ చేస్తామని చెప్పారు. బొగ్గు సరఫరాకు ఒప్పందం చేసుకుని సప్లయ్ చేయలేదు. మొదటి నుంచి కోల్ అలాట్‌మెంట్ లేకుండానే యాదాద్రి పవర్ ప్లాంట్ కట్టారు" అని భట్టి విక్రమార్క తెలిపారు.

## నిరసనలు తెలిపినంత మాత్రాన విద్యార్థులు సంఘవిద్రోహులేమీకాదు

**ముంబై(జనంసాక్షి):**

మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై నిరసన తెలుపుతున్న విద్యార్థులు సంఘవిద్రోహ శక్తులేమీ కాదని బాంబే హైకోర్టు వ్యాఖ్యానించింది. ఉద్యోగ నియామక పరీక్షలు నిష్పక్షపాతంగా నిర్వహించేలా చూడటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేసింది. పరీక్షలపై ప్రజల్లో, ముఖ్యంగా విద్యార్థుల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించింది.ఎంపీఎస్సీ పరీక్షల్లో అవకతవకలపై పుణెలో విద్యార్థులు చేపట్టిన నిరసనలకు వ్యతిరేకంగా స్థానికులు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. "పరీక్షల నిర్వహణలో అక్రమాలు జరిగాయని విద్యార్థులు భావిస్తే.. వారికి ఆందోళన చేసే హక్కు ఉంటుంది. ఎందుకంటే వారు సన్నద్ధత కోసం ఎంతో సమయం వెచ్చించి ఉంటారు" అని సీజే జస్టిస్ మహేశ్‌చంద్ర త్రిపాఠి, జస్టిస్ అద్వైత్ సేథ్నా ధర్మాసనం పేర్కొంది.రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఆందోళనలపై అధికారులు సంయమనం పాటిస్తున్నారని, నిరసనకారులపై ఎటువంటి కేసులూ నమోదు చేయలేదని తెలిపారు.

# సాయి ప్రసాద్‌ను అరెస్టు చేయండి

- పద్మిని ఆరోపణలపై సిట్ వేయండి
- బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్




**హైదరాబాద్, అక్టోబర్ 7 (జనంసాక్షి) :** బీజేపీ యువ మోర్చా మాజీ జాతీయ కోశాధికారి సాయి ప్రసాద్‌ను అరెస్టు చేయాలని, పద్మిని ఆరోపణలపై వెంటనే ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి, సుప్రీంకోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బీజేపీ ఎస్సీ మోర్చా సోషల్ మీడియా కన్వీనర్‌గా పనిచేస్తున్న పద్మిని ఒక వ్యక్తిపై ఫిర్యాదు చేశారని తెలిపారు. బీజేపీ యువ మోర్చా మాజీ జాతీయ కోశాధికారి సాయి ప్రసాద్ 2024 డిసెంబర్ 24న పద్మినిని బెడ్‌రూమ్‌లోకి రమ్మని వేధించారని, 2025లోనూ ఇదే రకంగా వేధించారని ఆరోపించారు. పద్మినిని కులం పేరుతో దూషించారని, కృత్రిమ మేధ ద్వారా భయపెట్టే ప్రయత్నం చేశారని, రాత్రి సమయాల్లో ఫోన్ కాల్స్ చేసి ఇబ్బందులకు గురిచేశారని అన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పోలీసు మాన్యువల్ నడుస్తోందని, రేవంత్‌రెడ్డి చెబితేనే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నారని ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్‌లో ఏం జరుగుతోందని ప్రశ్నించారు. సాయి ప్రసాద్‌పై 14 కేసులు ఉన్నాయని, ఆయనపై కచ్చితంగా రౌడీషీట్ ఉండాలని అన్నారు. సాయి ప్రసాద్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సాయి ప్రసాద్‌కు ఉన్న ఐదు కంపెనీల్లో రెండు సంస్థలకు పొంగులేటి హర్షారెడ్డి కో–డైరెక్టర్‌గా ఉన్నారని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై ఈడీ రైడ్ జరిగినా ఇప్పటి వరకు ఏం జరిగిందో చెప్పలేదన్నారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి మధ్యవర్తిగా ఢిల్లీలో సాయి ప్రసాద్ డీల్ మాట్లాడారని ఆరోపించారు. దీనిపై అమిత్‌షా, నితిన్ నబీన్ స్పందించాలని డిమాండ్ చేశారు. కామాంధులకు బీజేపీ జాతీయ స్థాయిలో పదవులు ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు. బీజేపీలో ఉన్న మహిళా నేతలు డీకే అరుణ, మాధవీలత, రాణి రుద్రమ సమాధానం చెప్పాలని అన్నారు. బీజేపీలో 30 ఏళ్ల నుంచి రాష్ట్ర స్థాయి నాయకులు కాలేకపోయారని, సాయి ప్రసాద్ ఆరు సంవత్సరాల్లో బీజేవైఎం జాతీయ కోశాధికారి అయ్యారని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో యాదయ్య గౌడ్, లక్ష్మీనరసింహారెడ్డి పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో సారస్ మేళా ప్రారంభం

- పల్లె ఉత్పత్తులకు పట్టం కట్టిన సారస్
- పల్లె ఉత్పత్తులకు నగర మార్కెట్‌తో అనుసంధానం
- 20కి పైగా రాష్ట్రాల నుంచి 200కు పైగా స్టాళ్లు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలో గ్రామీణ భారతదేశపు కళలు, చేనేతలు, సంప్రదాయ రుచులు, మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులతో సారస్ మేళా బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఒకవైపు హస్త కళలు చేతివృత్తులు, మరోవైపు తెలంగాణ సంప్రదాయ వంటకాలు, తిరునల్వేలి హల్వా, ఈశాన్య రాష్ట్రాల మోమోలు, ఇతర రాష్ట్రాల రుచులు, పేరిని నృత్యం, శివతాండవం వంటి తెలంగాణ నృత్యాలు, పల్లె పదాలు, జానపద పాటల మధ్య సారస్ అట్టహాసంగా మొదలైంది. సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ స్టాల్స్‌ను సందర్శించి నిర్వాహకుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఐమాక్స్ థియేటర్ పక్కన ఉన్న హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో అక్టోబర్ 7 నుంచి 18వ తేదీ వరకు జరిగే ఈ మేళాను తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సెర్ప్ నిర్వహిస్తోంది. దేశంలోని వివిధ ప్రాంతాల గ్రామీణ మహిళలు, కళాకారులు, స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులకు నగర మార్కెట్‌కు అందుబాటులోకి తెచ్చే విధంగా సారస్ ఫెయిర్ కొనసాగుతోంది. ఈసారి 200కు పైగా స్టాళ్లలో చేనేతలు, హస్తకళలు, ఆహార ఉత్పత్తులు, హెర్బల్ ఉత్పత్తులు, గ్రామీణ తయారీ వస్తువులు, లైవ్ ఫుడ్ అందుబాటులో ఉన్నాయి. తెలంగాణ నుంచి 95 స్టాళ్లు ఏర్పాటు కాగా, ఇతర రాష్ట్రాల నుంచి 100కు పైగా స్టాళ్లు పాల్గొంటున్నాయి. వివిధ ప్రభుత్వ, అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో మరో 43 స్టాళ్లు ఏర్పాటు చేశారు. పోచంపల్లి, గద్వాల, నారాయణపేట చేనేతలతో పాటు చెక్క బొమ్మలు, జూట్, లెదర్ బ్యాగులు, మట్టి వస్తువులు, బంజారా కళాకృతులు, ఎంబ్రాయిడరీ, పచ్చళ్లు, పిండి వంటలు, మిల్లెట్ ఆధారిత ఆహార ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. వివిధ రాష్ట్రాల ప్రత్యేక ఉత్పత్తులు కూడా ఒకే వేదికపై అందుబాటులో ఉన్నాయి.

సారస్ మేళా కేవలం కొనుగోలు, విక్రయాలకు పరిమితం కాకుండా గ్రామీణ మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యక్ష మార్కెట్ అనుభవాన్ని అందించే వేదికగా నిలుస్తోంది. వినియోగదారుల అభిరుచులు, ధరలు, ప్యాకేజింగ్, ఉత్పత్తుల నాణ్యతపై నేరుగా స్పందన తెలుసుకునే అవకాశం లభిస్తోంది. తద్వారా భవిష్యత్‌లో బల్క్ ఆర్డర్లు, మార్కెట్ లింకేజీలు, వ్యాపార అవకాశాలకు మార్గం ఏర్పడనుంది. మేళాలో ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మొదటిరోజు శివతాండవం పేరిని నృత్యం హైలెట్ గా నిలిచాయి. అక్టోబర్ 12న బతుకమ్మ వేడుకలను ప్రత్యేకంగా నిర్వహించనున్నారు. మంత్రి సీతక్కతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, ప్రముఖులు ఈ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. పల్లె ఉత్పత్తులు, మహిళల శ్రమ, దేశీయ కళలు, తెలంగాణ సంస్కృతిని హైదరాబాద్ నగర ప్రజలకు చేరువ చేస్తున్న సారస్ మేళా ఈ నెల 18 వరకు కొనసాగనుంది.

### గిరిజన ఆభరణాలతో సారిక ప్రత్యేక ఆకర్షణ

సారిక ముడావత్ (35) గిరిజన ఆభరణాల తయారీతో కనుమరుగవుతున్న కళారూపానికి జీవం పోస్తున్నారు. సరస్ మేళాలో ప్రతి ఏడాది కనీసం రూ.లక్ష ఆదాయం ఆర్జిస్తున్నానని ఆమె తెలిపారు. గత నాలుగేళ్లుగా సరస్ మేళాలో పాల్గొంటున్న సారిక, పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినప్పటికీ ప్రస్తుతం పూర్తిస్థాయిలో గిరిజన ఆభరణాల తయారీ, విక్రయాలపై దృష్టి సారించారు. ప్రభుత్వం కల్పిస్తున్న మార్కెటింగ్ అవకాశాలను వినియోగించుకుంటున్నారు. నల్గొండ జిల్లా దేవరకొండకు చెందిన స్వయం సహాయక సంఘం సభ్యురాలైన సారిక, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, పంచాయతీరాజ్ మంత్రి దనసరి అనసూయ సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు.

### చెరియాల్ మాస్కులతో సంప్రదాయ కళకు ఆధునిక హంగులు

మంగా పసుల (40) చెరియాల్ మాస్కులు, వాల్ డెకార్ తయారు చేస్తున్నారు. కలప, చింతగింజల మిశ్రమంతో రూపొందించే ఈ కళాఖండాలు జానపద నాటక సంప్రదాయాలను ఆధునిక ఇంటీరియర్లకు చేరువ చేస్తున్నాయి. చెరియాల్ చిత్రకళా సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా ప్రకాశవంతమైన రంగులు, కథనాత్మక రూపాలు, భావోద్వేగాలను పలికించే ముఖ కవళికలతో వీటిని తీర్చిదిద్దుతున్నారు. గిఫ్ట్‌గా ఇచ్చేందుకు అనువుగా చిన్న సైజు ఫ్రేమ్‌లను కూడా తయారు చేస్తున్నామని మంగా తెలిపారు.

### గుజరాత్ నుంచి వచ్చి ఖద్దీ ఉత్పత్తుల విక్రయం

గుజరాత్‌కు చెందిన రంజన్ పర్మార్ (45) సరస్ మేళాలో చేతితో తయారు చేసిన ఖద్దీ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. కుషన్ కవర్లు, బ్యాగులు, దుస్తులు తదితర అనేక రకాల ఉత్పత్తులు ఆమె స్టాల్‌లో అందుబాటులో ఉన్నాయి. సరస్ మేళాలో స్టాల్ ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి అని రంజన్ తెలిపారు. మేళా ద్వారా మంచి అమ్మకాలు సాధించి, జ్ఞాపకాలతో పాటు ఆదాయంతో స్వస్థలానికి తిరిగి వెళ్తామనే ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు.

### తెలంగాణ ఇకత్‌కు దేశవ్యాప్తంగా మార్కెట్

జనగామకు చెందిన రామలక్ష్మి మసురం (35) చేతితో తయారు చేసిన ఇకత్ వస్త్రాలను సరస్ మేళాలో ప్రదర్శిస్తున్నారు. భర్త సహకారంతో దేశవ్యాప్తంగా జరిగే ఎక్స్‌పోల్లో పాల్గొంటూ తెలంగాణకు చెందిన హస్తకళా, చేనేత ఉత్పత్తులను వివిధ ప్రాంతాలకు పరిచయం చేస్తున్నారు. స్వచ్ఛమైన కాటన్ హ్యాండ్‌లూమ్, కొత్త డిజైన్లతో కూడిన సరసమైన ధరల ఉత్పత్తులు, ప్రింటెడ్ చీరలు, ప్రింటెడ్ తెల్ల చీరలు, బెడ్‌షీట్లు, టవల్స్, చీరలు, డ్రెస్ మెటీరియల్స్, బ్లౌజులు తదితర ఉత్పత్తులను విక్రయిస్తున్నారు.

# దసరాకు 7వేల ప్రత్యేక బస్సులు

- టీజీఎస్ఆర్టీసీ నిర్ణయం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** దసరా పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్ఆర్టీసీ) పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. ఈ పండుగకు 7వేల ప్రత్యేక బస్సులను నడపాలని యాజమాన్యం నిర్ణయించింది. ఇందులో భాగంగా కరీంనగర్ జోన్ నుంచి మొత్తం 3533 బస్సులు నడుపుతోంది... రీజియన్ల వారిగా ఆదిలాబాద్ 431, నిజామాబాద్ 719, కరీంనగర్ 1175, వరంగల్ 530, ఖమ్మం 678, హైదరాబాద్ జోన్ నుంచి 2155 బస్సులు నడుపుతుండగా రీజియన్ల వారీగా మహబూబ్ నగర్ 645, మెదక్ 255 , నల్గొండ 815, రంగారెడ్డి 440. అలాగే గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1312 దసరా పండగ కు ప్రత్యేక సర్వీసు లను నడపాలని టీజీఎస్ ఆర్టీసీ నిర్ణయించింది. ప్రధానంగా ఈ నెల 9,10,16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఆయా రోజుల్లో రద్దీ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచేలా టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం ప్లాన్ చేసింది. అలాగే, ఈ నెల 25, 26 తేదీల్లో తిరుగు ప్రయాణ రద్దీకి సంబంధించి తగిన ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్ లో రద్దీ ప్రాంతాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ (నల్ల చెరువు) , ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్బీ, బోయిన్పల్లి, గచ్చిబౌలి తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడుపుతోంది. ఈ దసరా పండుగకు నడిపే ప్రత్యేక బస్సులకు రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం 1.5 వరకు టికెట్ ధరలను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం సవరించింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు తిరిగే స్పెషల్ బస్సులకు మాత్రమే సవరించిన చార్జీలు వర్తిస్తాయి. ఈ నెల 9, 10,16,17 తేదీలతో పాటు తిరుగు ప్రయాణ రద్దీ ఎక్కువగా ఉండే 25,26 తేదీల్లో మాత్రమే సవరించిన చార్జీలు అమల్లో ఉంటాయి. స్పెషల్ బస్సులు మినహా రెగ్యులర్ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వ మహాలక్ష్మి పథకంలో భాగంగా దసరా కు నడిపే పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్ ప్రెస్ రెగ్యులర్ , స్పెషల్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం యథావిధిగా అమల్లో ఉంటుందని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి స్పష్టం చేశారు. టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్‌ను wwwtgsrtcbus.in వెబ్ సైట్ లో బుక్ చేసుకోవాలని యాజమాన్యం తెలిపింది. దసరా కు స్వంత ఊర్లకు వెళ్లే ప్రయాణీకులు ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 లలో సంప్రదించాలని యాజమాన్యం సూచించింది.

# కోమటిరెడ్డి వెంకటరెడ్డి మానవతా సాయం

**మూగ, చెవిటి దంపతుల బిడ్డకు వైద్య చికిత్స కోసం రూ.2 లక్షలు అందజేత**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గారు మరోసారి తన మానవతా హృదయాన్ని చాటుకున్నారు. కష్టాల్లో ఉన్న ఓ కుటుంబానికి అండగా నిలిచి, అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారికి వైద్య చికిత్స అందించేందుకు ఆర్థిక సహాయం చేయడంతో పాటు, ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన పనిగిరి గ్రామ నివాసులు జంపాల మహేష్ కుమార్, రజిత దంపతులు ఇద్దరూ మూగ, చెవిటి వారు. వారికి జన్మించిన బిడ్డ కూడా మూగ, చెవిటి తనంతో పుట్టడంతో ఆ తల్లిదండ్రుల జీవితాల్లో తీవ్ర విషాదం నెలకొంది. తమ బిడ్డకు సరైన వైద్యం అందిస్తే మాట్లాడే అవకాశం ఉందని వైద్యులు చెప్పడంతో ఆ కుటుంబంలో కొంత ఆశ చిగురించింది. అయితే, ఇందుకు లక్షల్లో ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ దంపతులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఆశ్రయించారు. వారి పరిస్థితిని తెలుసుకున్న మంత్రి ఎంతో ఆప్యాయతతో స్పందించారు. చిన్నారిని స్వయంగా ఎత్తుకుని అక్కున చేర్చుకుని, తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. చిన్నారి వైద్య చికిత్స కోసం రూ.2 లక్షల తక్షణ ఆర్థిక సహాయాన్ని అందించారు. అంతేకాకుండా, చిన్నారికి మెరుగైన వైద్యం అందించే విషయంలో వైద్యులతో స్వయంగా మాట్లాడుతానని మంత్రి హామీ ఇచ్చారు. "మీ బిడ్డ విషయంలో ఆందోళన చెందవద్దు. ఏ సహాయం కావాలన్నా నేను అండగా ఉంటాను" అంటూ ఆ దంపతులకు భరోసా కల్పించారు.

# ఈవీ వాహనాల అమ్మకాల జోరు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 07 (జనంసాక్షి) :** భారత ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) మార్కెట్ సరికొత్త శిఖరాలకు చేరింది. సెప్టెంబర్ నెలలో ఈవీ రిటైల్ విక్రయాలు ఆల్ టైమ్ రికార్డును సృష్టించాయి. ఈ ఒక్క నెలలోనే దేశవ్యాప్తంగా 3,33,634 ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడవడం గమనార్హం. గతేడాది సెప్టెంబర్‌తో పోలిస్తే ఇది 74 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఈ గణాంకాలను ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ సమాఖ్య (ఫాడా) బుధవారం విడుదల చేసింది. ఈ గణాంకాలపై ఫాడా అధ్యక్షుడు సాయి గిరిధర్ స్పందిస్తూ, ఇది కేవలం గతేడాదితో పోల్చిన వృద్ధి మాత్రమే కాదని, ఒక సరికొత్త రికార్డు అని పేర్కొన్నారు. పండగ సీజన్ డిమాండ్, పెట్రోల్ ధరలతో పోలిస్తే తక్కువగా ఉన్న నిర్వహణ ఖర్చులు, మార్కెట్లోకి వస్తున్న కొత్త మోడళ్లు, పీఎం ఈ–డ్రైవ్ వంటి ప్రభుత్వ పథకాల ప్రోత్సాహం ఈ వృద్ధికి ప్రధాన కారణాలని ఆయన వివరించారు. ప్రస్తుతం ఈవీ మార్కెట్ కేవలం సబ్సిడీలపైనే కాకుండా, వినియోగదారుల డిమాండ్ ఆధారంగా పుంజుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. విభాగాల వారీగా పరిశీలిస్తే, ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల విక్రయాలు 88.67 శాతం వృద్ధితో 2,07,314 యూనిట్లకు చేరాయి.

# టీడబ్ల్యూయూ కూటమికి కాంగ్రెస్ పూర్తి మద్దతు



- టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్
- సెంట్రల్ బస్ స్టేషన్ వద్ద భారీ సభ..

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలలో టీడబ్ల్యూయూ కూటమి ప్రచారంలో భాగంగా హైదరాబాద్‌లోని గౌలిగూడా సెంట్రల్ బస్ స్టేషన్ నిర్వహించిన గేట్ మీటింగ్ భారీ బహిరంగ సభలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సంజీవ రెడ్డితో పాటు పలువురు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం టీడబ్ల్యూయూ కూటమికి కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో బాణం గుర్తు అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కార్మికులకు పిలుపు నిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మికుల పక్షపాతి అని, ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. ఆర్టీసీ విలీన ప్రక్రియ శాస్త్రీయంగా, ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడే విధంగా జరగాలని కాంగ్రెస్ పార్టీ కోరుకుంటోందన్నారు. కార్మికులను మోసం చేసిన శక్తులకు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు. రాజిరెడ్డి, అశ్వత్థామ రెడ్డి తదితర టీడబ్ల్యూయూ కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల గొంతుక బలంగా వినిపించాలంటే ఐఖ్య కూటమి అభ్యర్థుల విజయం అవసరమన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో కార్మికులు, కార్మిక సంఘాల ప్రతినిధులు హాజరై టీడబ్ల్యూయూ కూటమికి తమ మద్దతును ప్రకటించారు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఐక్యంగా పనిచేయాలని నేతలు పిలుపునిచ్చారు.

# కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి

- తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు



**సూర్యాపేట (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకోని రావాలని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు అన్నారు. సూర్యాపేట బుల్లెట్ ట్రైన్ సాధన అఖిలపక్ష పోరాట కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో 55వ రోజు సూర్యాపేట జిల్లా బిజెపి అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి నాయకులు దీక్ష శిబిరం లో రిలే నిరాహార దీక్ష లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు, తెలంగాణ యువజన సంఘము రాష్ట్ర అధికార ప్రతినిధి ఎనిగా సంతోష్ రెడ్డి, సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ సురేష్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు ధరవాత్ శివ నాయక్ హాజరై, బీజేపీ నాయకుల దీక్షకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. అనంతుల మధు మాట్లాడుతూ సుమారు 80 రోజులుగా పాత అలైన్ మెంట్ కొనసాగించాలని, సూర్యాపేట ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేర్చలని అఖిల పక్షం ఆధ్వర్యంలో వివిధ పోరాట పద్ధతుల లో ఆందోళన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించక పోవడం శోచనీయం అని అన్నారు.

తెలంగాణ ఉద్యమానికి సహకారం అందించినట్లే, సూర్యాపేట బుల్లెట్ ట్రైన్ పోరాటానికి కూడా బీజేపీ సహకరించాలని, బీజేపీ అధిష్టానాన్ని ఒప్పించి, రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకోని వచ్చి సూర్యాపేట ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేర్చేందుకు కృషి చేయాలనీ అన్నారు. మొదటి అలైన్ మెంట్ మార్చడం అంటే, సూర్యాపేట ప్రాంత అభివృద్ధి ని అడ్డుకోవడమే అని, కాంగ్రెస్ అధిష్టానం సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ కారిడర్, స్టేషన్ ఏర్పాటు పై స్పష్టమైన వైఖరి ప్రకటించాలని అన్నారు. బీజేపీ రిలే నిరాహార దీక్ష లో సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి, జిల్లా కన్వీనర్ తుక్కని మన్మధ రెడ్డి, రాష్ట్రనాయకులు కడియం రామచంద్రయ్య,నాయకులు పాండురంగచారి, కందుల రమేష్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు దాసరి వెంకన్న, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు రవి నాయక్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు పరుశరామ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు పృథ్వి గౌడ్, నరేందర్ రెడ్డి, తికుల్లా సాయి రెడ్డి, డాక్టర్ మురళిధర్ రెడ్డి, రంగనేని రుక్మ రావు, వంగూరు రమేష్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షులు సీత నాయక్,జనరల్ సెక్రటరీ రమణ, చక్ర నాయక్, రావినాయక్, యాదగిరి, ఓబీసీ జిల్లా నాగేంద్ర చారి, కోదాడ అసెంబ్లీ ఎన్నికల కన్వీనర్ విద్యాసాగర్, జిల్లా జనరల్ సెక్రటరీ వంగవీటి శ్రీనివాస్ రావు, పిట్టల వెంకన్న, మమత, జానికి రాములు, బాలాజీ నాయక్, పోరాట కమిటీ అఖిల పక్ష నాయకులు పాల్గొన్నారు.

# ఎన్నికల అక్రమాలపై విచారణ జరపాలి

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి
- ఎమ్మెల్యేలు ప్రకాష్ రెడ్డి, నాగరాజు, యశస్విని రెడ్డి
- కుడా చైర్పర్సన్ గుండు సుధారాణి తదితరులు
- వరంగల్లో జనసంద్రంగా మారిన ప్రజాస్వామ్య పరిరక్షణ యాత్ర...




**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 07 (జనం సాక్షి) :** ఎన్నికల అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని ఎమ్మెల్యేలు ప్రకాష్ రెడ్డి, నాగరాజు, యశ్వసిని, రెడ్డి, గుండు సుధారాణి, ఝాన్సీ రెడ్డి, అఖిపక్ష నాయకులు శ్రీనివాస రావు, బస్మియా, సాగర్, సత్యనారాయణ, నవీద్ జిల్లా అధ్యక్షుడు అయూబ్ డిమాండ్ చేశారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ గారి ఆధ్వర్యంలో, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల సహకారంతో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బుధవారం వరంగల్‌లో భారీ అఖిలపక్ష పాదయాత్ర నిర్వహించారు. వరంగల్ పోచమ్మైదాన్ సెంటర్ నుంచి కాశీబుగ్గ అంబేద్కర్ సెంటర్ వరకు సాగిన ఈ పాదయాత్రలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీ రెడ్డి, కుడా చైర్మన్ గుండు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత కోసం నినాదాలు చేస్తూ నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాదయాత్రలో పాల్గొన్నారు.పాదయాత్ర అనంతరం కాశీబుగ్గ అంబేద్కర్ సెంటర్‌లోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని, ప్రతి ఓటు ప్రజల హక్కుకు ప్రతీక అని అన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. ఓటు చోరీ, ఎన్నికల అక్రమాలకు సంబంధించిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ వ్యవహారశైలిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.అలాగే కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టు కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి పరాకాష్ట అని నాయకులు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం ప్రశ్నించే గొంతులను అణచివేయడం సరికాదని, కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యేలు, అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ కోసం రాజకీయాలకు అతీతంగా ప్రజలందరూ ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు సీపీఐ రాష్ట్ర నాయకులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, బస్మియా, అడ్డుల సత్యనారాయణ, అల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ నాయకులు నవీద్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొరివి పరమేష్, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్, ఎస్టీ సెల్ చైర్మన్ రవీందర్ నాయక్, బీసీ సెల్ చైర్మన్ ఓర్సు తిరుపతి, జిల్లా మహిళా అధ్యక్షురాలు కరుణాటి పార్వతమ్మ, పీఏసీఎస్ చైర్మన్లు అబ్బిడి రాజిరెడ్డి, పిన్నింటి అనిల్ రావు, అత్తి కుమారస్వామి, మండల అధ్యక్షులు ఇస్లావత్ సావిత్రి, పోశాల వెంకన్న, దాడి శివ, రవికుమార్, టౌన్ అధ్యక్షుడు ఈగ దామోదర్, డివిజన్ అధ్యక్షులు జన్ను అరుణకర్, సయ్యద్ ఇంతియాజ్, అశోక్, మొహమ్మద్ జానీ, పసునూరి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
8 అక్టోబర్ 2026

సంపాదకీయం

## సీటు పట్టుకొని వేలాడడం దేనికి?

# జ్ఞానేష్ గద్దె దిగు

ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థపై ప్రజల్లోనే కాదు.. ప్రతిపక్షాల్లోనూ అనుమానాలు వ్యక్తమవుతున్నప్పుడు ఆ సంస్థ అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం ఇది. పదవి అంటే కుర్చీని పట్టుకుని ఎంతకాలమైనా కూర్చోవడం కాదు. పదవికి ఉన్న గౌరవాన్ని, ఆ పదవిపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని కాపాడటం. ఆ విశ్వాసమే దెబ్బతింటే పదవిలో కొనసాగడానికి నైతిక హక్కు ఏమిటన్నదే అసలు ప్రశ్న.

ఎన్నికల సంఘం స్వతంత్ర రాజ్యాంగ సంస్థ. దాని నిర్ణయాలపై ఎవరికీ అనుమానం కలగకూడదు. అధికార పక్షానికి ఒక న్యాయం, ప్రతిపక్షానికి మరో న్యాయం జరుగుతోందన్న భావన ఒక్కసారి ప్రజల్లో బలపడితే ఎన్నికల ప్రక్రియ మొత్తం విశ్వసనీయతను కోల్పోయే ప్రమాదం ఉంటుంది. అందుకే ఎన్నికల సంఘం నిర్ణయాలు మాత్రమే కాదు.. ఆ నిర్ణయాలు తీసుకునే విధానం కూడా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా కనిపించాలి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వ్యవహారశైలిపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన కీలక నిర్ణయాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సుప్రీంకోర్టులోనూ ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై ప్రశ్నలు, అభ్యంతరాలు చర్చకు వస్తున్న పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి సమయంలో పదవిలో కొనసాగడమే పట్టుదలగా భావించడం సరికాదు. తనపై విశ్వాసం లేదని ఒక వర్గం కాదు.. ప్రజాస్వామ్యంలోని కీలక భాగమైన ప్రతిపక్షాలు పదేపదే చెబుతున్నప్పుడు, ఆ ఆరోపణలను కొట్టిపారేయడం కంటే వాటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత పదవిలో ఉన్న వ్యక్తిపైనే ఉంటుంది.

న్యాయవ్యవస్థలో ఒక న్యాయమూర్తిపై ఏదైనా పక్షం విశ్వాసం లేదని తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసిన సందర్భాల్లో, సంబంధిత న్యాయమూర్తి స్వయంగా ఆ కేసు విచారణ నుంచి తప్పుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అది బలహీనత కాదు. న్యాయవ్యవస్థపై విశ్వాసాన్ని కాపాడేందుకు తీసుకునే ఉన్నతమైన నైతిక నిర్ణయం. తాను తప్పు చేయకపోయినా, తన వల్ల వ్యవస్థపై అనుమానం ఏర్పడుతుందనే పరిస్థితి ఉంటే పక్కకు తప్పుకోవడం కూడా రాజ్యాంగ సంస్థల గౌరవాన్ని కాపాడే మార్గమే.

అదే ప్రమాణం ఎన్నికల సంఘానికీ వర్తించాలి. తనపై విశ్వాసం లేదని దేశంలోని రాజకీయ పక్షాలు, ప్రజాస్వామ్యవాదులు ప్రశ్నిస్తున్నప్పుడు.. 'నేను తప్పు చేయలేదు కాబట్టి ఎందుకు దిగాలి?' అనే మొండితనం ప్రజాస్వామ్యానికి ఉపయోగపడదు. నిష్పక్షపాతంగా కనిపించడం కూడా నిష్పక్షపాతంగా వ్యవహరించడంతే ముఖ్యం. ఎన్నికల సంఘం తీరుపై అనుమానం మిగిలితే ఎన్నికల ఫలితాలపైనా అనుమానాలు మిగిలే ప్రమాదం ఉంటుంది.

అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ముద్ర ఏ రాజ్యాంగ సంస్థకైనా అత్యంత ప్రమాదకరం. ఆ ముద్రను తొలగించాల్సిన బాధ్యత పదవిలో ఉన్న వ్యక్తిదే. ఆరోపణలు అసత్యమైతే పారదర్శకంగా సమాధానం చెప్పాలి. నిర్ణయాలు న్యాయబద్ధమైనవైతే వాటి వెనుక ఉన్న కారణాలను ప్రజలకు వివరించాలి. అయినా విశ్వాస సంక్షోభం తొలగకపోతే పదవికి రాజీనామా చేయడాన్ని కూడా ఒక ప్రజాస్వామ్య విలువగా చూడాలి.

ప్రజాస్వామ్యంలో పదవులు శాశ్వతం కావు. రాజ్యాంగ సంస్థల ప్రతిష్ఠే శాశ్వతం. ఒక వ్యక్తి కుర్చీలో కొనసాగడం కంటే ఆ సంస్థపై ప్రజలకు ఉన్న నమ్మకం నిలబడటం ముఖ్యం. అందుకే ప్రశ్న సూటిగా ఉంది.. మీపై విశ్వాసం లేదని దేశంలోని రాజకీయ పక్షాలు, ప్రజాస్వామ్య వర్గాలు ప్రశ్నిస్తున్నప్పుడు ఇంకా ఆ కుర్చీని పట్టుకొని వేలాడడం దేనికి? జ్ఞానేష్ కుమార్ గద్దె దిగితే అది ఓటమి కాదు.. ఎన్నికల సంఘం గౌరవాన్ని కాపాడే బాధ్యతాయుత నిర్ణయం.

# దళిత, గిరిజనులకు న్యాయం కావాలి!

*దళితులు, గిరిజనులు రాజ్యాంగం కల్పించిన సమాన హక్కులు కలిగిన పౌరులు. అంటరానితనం నిషేధించబడింది. కుల వివక్షకు వ్యతిరేకంగా రాజ్యాంగం స్పష్టమైన హామీ ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీలపై జరిగే దాడులను నిరోధించేందుకు ప్రత్యేక చట్టాలు, న్యాయస్థానాలు, కమిషన్లు ఉన్నాయి. బాధితులకు పరిహారం, పునరావాసం, న్యాయ సహాయం అందించే వ్యవస్థలూ ఉన్నాయి. అయినా తెలంగాణలో నమోదవుతున్న కేసులు సామాజిక సమానత్వం ఇంకా సంపూర్ణంగా ఆచరణలోకి రాలేదని సూచిస్తున్నాయి.*




ఎస్సీ, ఎస్టీ కమిషన్ నివేదిక ఆధారంగా వెలువడిన సమాచారం ప్రకారం, 2023 నుంచి 2026 జూలై వరకు తెలంగాణలో 9,102 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. ఇందులో 213 హత్య కేసులు, బాలికలు, మహిళలపై 1,305 లైంగిక దాడుల కేసులు ఉన్నాయి. ఇదే కాలంలో 32 కేసుల్లో మాత్రమే శిక్షలు పడినట్లు కమిషన్ వెల్లడించింది. ఇక్కడ ప్రధాన ప్రశ్న కేసులు ఎన్ని నమోదయ్యాయన్నది కాదు. నమోదైన కేసుల్లో బాధితులకు న్యాయం ఎంతవరకు అందింది? అన్నదే. కేసు నమోదు న్యాయ ప్రక్రియకు తొలి అడుగు మాత్రమే. దర్యాప్తు, ఆధారాల సేకరణ, నిందితులపై చర్య, చార్జిషీట్ దాఖలు, విచారణ, తీర్పు, బాధితులకు పరిహారం.. ఈ ప్రక్రియ సక్రమంగా సాగినప్పుడే న్యాయం ఫలిస్తుంది.

**9,102 కేసులు నమోదు.. 32 కేసుల్లోనే శిక్షలు..**

ఈ రెండు సంఖ్యల మధ్య ఉన్న వ్యత్యాసం దర్యాప్తు, విచారణ, సాక్షుల రక్షణ, ప్రభుత్వ పర్యవేక్షణ వంటి అంశాలపై ప్రశ్నలు లేవనెత్తుతుంది. అయితే నమోదైన కేసులన్నీ ఒకే దశలో ఉండవు. కొన్ని దర్యాప్తులో ఉండవచ్చు. మరికొన్ని కోర్టు విచారణలో ఉండవచ్చు. అందువల్ల ఈ సంఖ్యలను నేరుగా శిక్షా రేటుగా పరిగణించడం సరికాదు. అయినప్పటికీ, ఇంత పెద్ద సంఖ్యలో కేసులు నమోదవుతున్న సమయంలో దర్యాప్తు, చార్జిషీట్ల దాఖలు, విచారణ, పెండింగ్ కేసులపై సమగ్ర సమీక్ష అవసరం.

**సంఖ్యల వెనుక మనుషులు....**

9,102 ఒక సంఖ్య మాత్రమే కాదు. దాని వెనుక వేలాది కుటుంబాల అనుభవాలున్నాయి. ఎక్కడో భూమి వివాదం, మరెక్కడో కుల వివక్ష, ఇంకొక్కడ దాడి, మరోచోట లైంగిక హింస, ఇంకొక కుటుంబంలో హత్య. గణాంకాల్లో కనిపించే ప్రతి సంఖ్య వెనుక ఒక జీవితం, ఒక కుటుంబం, ఒక గాయం, ఒక న్యాయపోరాటం ఉంది. కమిషన్ గణాంకాల ప్రకారం 2023 నుంచి 2026 జూలై వరకు 159 మరణాలు, 54 అత్యాచారాలు, 991 లైంగిక దాడులు, 314 అదృశ్యాల కేసులు నమోదయ్యాయి. ఈ సంఖ్యలను కేవలం ఏడాది వారీ హెచ్చుతగ్గులుగా చూడటం సరిపోదు. వాటి వెనుక ఉన్న సామాజిక పరిస్థితులను కూడా పరిశీలించాలి. ఒక సమాజంలో కుల ఆధారిత హింస, వివక్ష, లైంగిక దాడులు, భూమి సంబంధిత సమస్యలు పదేపదే నమోదవుతుంటే వాటి మూలాలను గుర్తించడం ప్రభుత్వ బాధ్యత.

**కుల వివక్ష ఇంకా ఎందుకు కొనసాగుతుంది?...**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచాయి. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లకుపైగా అయింది. విద్య, పట్టణీకరణ, సాంకేతిక పరిజ్ఞానం విస్తరించాయి. అయినా కుల ఆధారిత వివక్ష పూర్తిగా తొలగిపోలేదు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ నివేదికలో దేవాలయ ప్రవేశాల్లో వివక్ష, వినాయక ఉత్సవాల్లో వివక్ష, కులాంతర వివాహాలపై హింస, భూమి సమస్యలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో బ్యాక్‌లాగ్ ఖాళీలు, అట్రాసిటీ చట్టం అమలులో లోపాలు వంటి అంశాలను ప్రస్తావించబడ్డాయి. ఇవి కేవలం విడివిడి సమస్యలు కావు. సమాజంలో సమానత్వం ఎంతవరకు ఆచరణలో ఉందన్న ప్రశ్నను ముందుకు తెస్తాయి. ఒక దళిత కుటుంబం తన భూమిపై హక్కు కోరినా, ఒక గిరిజన కుటుంబం తన భూమిని కాపాడుకోవడానికి ప్రయత్నించినా, ఒక యువకుడు కులాంతర వివాహం చేసుకున్నా, ఒక మహిళ తనపై జరిగిన దాడికి న్యాయం కోరినా, వారి సామాజిక స్థానం న్యాయ ప్రక్రియను ప్రభావితం చేయకూడదు. రాజ్యాంగం హామీ ఇచ్చిన సమానత్వం అంటే ఇదే.

**పోలీస్ స్టేషన్ నుంచే పరీక్ష....**

నేరం జరిగిన తర్వాత బాధితుడు మొదట వెళ్లేది పోలీస్ స్టేషన్‌కే. అందువల్ల అక్కడి నుంచే న్యాయ ప్రక్రియకు అసలు పరీక్ష మొదలవుతుంది. ఫిర్యాదు స్వీకరించడం, సరైన సెక్షన్లు నమోదు చేయడం, ఆధారాలను సేకరించడం, నిందితులపై చర్య తీసుకోవడం, సాక్షులను రక్షించడం దర్యాప్తులో కీలకం. కేసుల నమోదు, దర్యాప్తు, పరిహారం వంటి అంశాల్లో పోలీసు, రెవెన్యూ శాఖల నిర్లక్ష్యంపై కమిషన్ ఆందోళన వ్యక్తం చేసినట్లు నివేదిక పేర్కొంది. బాధితులకు పరిహారం అందడంలో జాప్యం జరుగుతున్న విషయాన్ని కూడా ప్రస్తావించింది. పోలీసు శాఖపై వచ్చిన ప్రతి ఆరోపణను నిర్ధారిత వాస్తవంగా పరిగణించలేం. ప్రతి కేసును దాని ఆధారాల ప్రకారం పరిశీలించాలి. అయితే రాజ్యాంగబద్ధ సంస్థ నివేదికలో ఇలాంటి సమస్యలు ప్రస్తావించబడితే ప్రభుత్వం వాటిపై సమీక్ష జరపాలి. పోలీస్ స్టేషన్ బాధితుడికి భయపడే స్థలం కాకుండా న్యాయం కోసం ఆశ్రయించే స్థలంగా ఉండాలి.

**మహిళలపై హింసకు ప్రత్యేక శ్రద్ధ....**

దళిత, గిరిజన మహిళలపై జరిగే హింసను ప్రత్యేకంగా పరిశీలించాలి. కులం, లింగం, ఆర్థిక పరిస్థితులు కలిసి వారి అసురక్షిత పరిస్థితిని మరింత పెంచవచ్చు. లైంగిక దాడి బాధితురాలిపైనే కాకుండా కుటుంబంపైనా దీర్ఘకాల ప్రభావం చూపుతుంది. అందువల్ల నిందితుడిపై చర్యతో పాటు బాధితురాలికి వైద్యం, న్యాయ సహాయం, భద్రత, గోప్యత, పరిహారం, పునరావాసం కల్పించాలి. విచారణలో ఆమె గౌరవం, వ్యక్తిగత వివరాల గోప్యత కాపాడాలి. మహిళలపై నమోదైన 1,305 లైంగిక దాడుల కేసులు ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేయలేని స్థాయిలో ముందుకు తెస్తున్నాయి.

**భూమి ప్రశ్నను విస్మరించలేం....**

దళిత, గిరిజనులపై జరిగే అన్యాయాన్ని భూమి సమస్య నుంచి వేరు చేయడం సాధ్యం కాదు. గ్రామీణ కుటుంబానికి భూమి జీవనాధారం. గిరిజన సమాజాలకు భూమి, అడవి, సహజ వనరులు జీవన విధానంతో ముడిపడి ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ కమిషన్ నివేదికలో భూమిలేని ఎస్సీ, ఎస్టీలకు భూ పంపిణీ, ప్రాజెక్టుల కోసం భూసేకరణ, భూమి సమస్యలను ప్రస్తావించింది. భూమి కోల్పోయిన కుటుంబానికి పరిహారం చెల్లించడం మాత్రమే పరిష్కారం కాదు. జీవనాధారం ఎలా కొనసాగుతుంది? ఉపాధి ఏమిటి? పిల్లల విద్య ఎలా సాగుతుంది? భవిష్యత్తు భద్రత ఎలా ఉంటుంది? అనే ప్రశ్నలకు కూడా సమాధానం ఉండాలి. భూమిని కోల్పోయిన కుటుంబం చివరకు అదే ప్రాంతంలో కూలీగా మారాల్సి వస్తే, అభివృద్ధి ప్రక్రియలో సామాజిక న్యాయానికి స్థానం ఏమిటన్న ప్రశ్న తప్పదు.

**కమిషన్ మాటకు బలం కావాలి....**

ఎస్సీ, ఎస్టీ కమిషన్ బాధితులకు రాజ్యాంగబద్ధమైన ముఖ్యమైన వేదిక. ఫిర్యాదులను స్వీకరించడం, అధికారులను వివరణ కోరడం, శాఖలతో సమీక్షలు నిర్వహించడం, బాధితులకు భరోసా కల్పించడం దాని బాధ్యతల్లో భాగం. 2023 నుంచి 2026 జూలై వరకు భూమి, అట్రాసిటీ, ఉద్యోగాలు, సర్వీస్ తదితర అంశాలకు సంబంధించిన 5,867 ఫిర్యాదులు కమిషన్‌కు అందినట్లు నివేదిక చెబుతుంది. అయితే ఫిర్యాదు స్వీకరించడం అంతిమ ఫలితం కాదు. ఎన్ని ఫిర్యాదులు పరిష్కరించబడ్డాయి? ఎన్ని కేసుల్లో పరిహారం అందింది? ఎన్ని కేసుల్లో న్యాయ ప్రక్రియ పూర్తయింది? ఎన్ని ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి? అనే వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. జవాబుదారీతనానికి గణాంకాలు అవసరం. పారదర్శకతకు ఫలితాల గణాంకాలు అవసరం.

**శిక్షతోపాటు బాధితుడికి న్యాయం....**

న్యాయం అంటే నిందితుడికి శిక్ష పడటం మాత్రమే కాదు. బాధితుడి భద్రత, గౌరవం, జీవనాధారం, పునరావాసం కూడా అందులో భాగమే. ఒక కుటుంబ సభ్యుడు హత్యకు గురైతే మిగిలిన కుటుంబం ఎదుర్కొనే ఆర్థిక సమస్యలకు పరిష్కారం కావాలి. లైంగిక దాడికి గురైన మహిళకు భద్రత, వైద్యం, న్యాయ సహాయం అందాలి. గిరిజన కుటుంబం భూమిని కోల్పోతే ప్రత్యామ్నాయ జీవనాధారం కల్పించాలి. కులాంతర వివాహం చేసుకున్న జంటకు ముప్పు ఉంటే రక్షణ కల్పించాలి. కేసులు సంవత్సరాల తరబడి సాగితే బాధిత కుటుంబాలపై భారం పెరుగుతుంది. సాక్షులు వెనక్కి తగ్గే అవకాశం ఉంటుంది. అందువల్ల చట్టపరమైన ప్రక్రియను పాటిస్తూనే దర్యాప్తు, విచారణలో అనవసర జాప్యాన్ని తగ్గించాలి.

**గణాంకాలకు అవతల కనిపించని వాస్తవం....**

నమోదైన కేసులే మొత్తం వాస్తవ పరిస్థితి అని భావించకూడదు. పోలీసులకు ఫిర్యాదు చేయని ఘటనలు ఉండవచ్చు. సామాజిక ఒత్తిడి వల్ల కేసులు ఉపసంహరించుకున్న కుటుంబాలు ఉండవచ్చు. రాజీ పేరుతో న్యాయ ప్రక్రియకు దూరమైన సందర్భాలు ఉండవచ్చు. అందువల్ల 9,102 కేసులు తెలంగాణలో జరిగిన మొత్తం అట్రాసిటీల సంఖ్య కాదు. అది అధికారిక వ్యవస్థ దృష్టికి వచ్చిన నమోదిత కేసుల సంఖ్య. అయినా సమస్య పరిమాణాన్ని అర్థం చేసుకోవడానికి అది ముఖ్యమైన సూచిక. గణాంకాలు సమస్యను చూపిస్తాయి. వాటి వెనుక ఉన్న కారణాలను గుర్తించడం ప్రభుత్వ బాధ్యత. పరిష్కారాలను అమలు చేయడం మరింత ముఖ్యమైన బాధ్యత.

**జీవితాల్లో కనిపించాలి సమానత్వం....**

రాజ్యాంగం సమానత్వాన్ని ప్రకటించింది. చట్టాలు రక్షణ కల్పిస్తున్నాయి. కమిషన్లు పనిచేస్తున్నాయి. అయినా న్యాయం కోసం ముందడుగు వేసిన దళితుడు లేదా గిరిజనుడికి తన సామాజిక స్థానం అడ్డంకిగా మారితే రాజ్యాంగ హామీ ఆచరణలో బలహీనపడినట్లే. దళితుడి ఇంటి గడపకు రాజ్యాంగ హక్కులు చేరాలి. గిరిజనుడి భూమిపై అతని హక్కు రక్షించబడాలి. పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన మహిళకు భయం కాకుండా భరోసా కలగాలి. బాధిత కుటుంబం పరిహారం కోసం సంవత్సరాల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగకూడదు. నేరం జరిగినప్పుడు నిందితుడి సామాజిక, ఆర్థిక ప్రభావం కంటే చట్టం పైచేయి సాధించాలి. దళిత, గిరిజనులపై జరిగే ప్రతి దాడి ఒక వ్యక్తిపై జరిగిన నేరమే కాదు. సమాజం ప్రకటించిన సమానత్వానికి ఎదురైన సవాలు.

**ప్రజాస్వామ్యానికి పరీక్ష....**

9,102 అట్రాసిటీ కేసులు, 213 హత్య కేసులు, 1,305 లైంగిక దాడుల కేసులన్నీ కేవలం పట్టికలోని సంఖ్యలు కావు. వాటి వెనుక కుటుంబాలు ఉన్నాయి. న్యాయం కోసం ఎదురుచూస్తున్న మనుషులు ఉన్నారు. అలాగే కమిషన్ పట్టికలో నమోదైన 159 మరణాలు, 54 అత్యాచారాలు, 991 లైంగిక దాడులు, 314 అదృశ్యాల కేసులు కూడా సంఖ్యలుగా ముగిసిపోకూడదు. వాటి వెనుక ఉన్న కుటుంబాల జీవితాలు, వారి భద్రత, వారి భవిష్యత్తు పాలనలో కనిపించాలి. కేసు నమోదు న్యాయానికి ఆరంభం మాత్రమే. న్యాయం జరిగే వరకు ఆ ప్రయాణం పూర్తికాదు.
చట్టం బలహీనుడి హక్కును కాపాడినప్పుడే రాజ్యాంగం ఆచరణలో కనిపిస్తుంది. పోలీస్ స్టేషన్ బాధితుడికి ఆశ్రయంగా మారినప్పుడే ప్రజాస్వామ్య సంస్థలపై నమ్మకం పెరుగుతుంది. న్యాయస్థానం తీర్పు బాధితుడి జీవితంలో భద్రత, గౌరవం, న్యాయం తీసుకొచ్చినప్పుడే చట్టానికి అర్థం ఉంటుంది. సమానత్వం అంటే చట్టంలో అందరికీ ఒకే హక్కు ఉండటం కాదు, అన్యాయం జరిగినప్పుడు అట్టడుగు మనిషికీ ఆ హక్కు ఆచరణలో లభించడం. దళిత, గిరిజనులకు న్యాయం కావాలి. ఆ న్యాయం ఆలస్యం కాకూడదు.



మామిండ్ల రమేష్ రాజా
సెల్ : 78932 30218

# మానవ హక్కుల ఉద్యమం - బాలగోపాల్ కార్యాచరణ

అసాధారణ మేధస్సు, నిరంతర అధ్యయనం, విస్తృత విషయ పరిజ్ఞానం, వాగ్ధాటి రచనా కౌశలం, ఆత్మీయత, ఆచరణశీలత, నిబద్ధత, నిమగ్నత, కార్యదీక్ష, అంకితభావం మరియు మానవీయతా సుగుణం మొదలైన లక్షణాలన్నింటిని తనలో మూర్తీభవింపజేసుకున్న అపురూప మేధావి బాలగోపాల్. కశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా తలెత్తిన హక్కుల ఉల్లంఘనలపై ఆయన అవిశ్రాంతంగా ఉద్యమించారు. ప్రత్యేకంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆయన హక్కుల ఉద్యమాలకు దశ-దిశను నిర్దేశించారు.



బాలగోపాల్ మధ్య తరగతి బ్రాహ్మణ పండిత కుటుంబంలో 1952, జూన్ 10 నాడు నాగమణి, పార్థనాథశర్మ దంపతులకు జన్మించారు. బాలగోపాల్ వరంగల్ లోని రీజినల్ ఇంజినీరింగ్ కాలేజీలో ఎం.ఎస్సీ అప్లైడ్ మాథ్స్ ని అభ్యసించి అక్కడే డాక్టరేట్ చేస్తున్న క్రమంలో అక్కడ జరుగుతున్న రాడికల్ విద్యార్థి సంఘం కార్యక్రమాలను మరియు ప్రజా పోరాటాలను సునిశితంగా పరిశీలించి రాజకీయ, తాత్విక సంఘర్షణలకు లోను అయ్యారు. 'తాను ప్రజల కోసం ఒక క్రియాశీల కార్యకర్తగా పనిచేయాలి' అని బాలగోపాల్ బలంగా నిర్ణయించుకొని 1981 లో ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘంలో చేరి 1983 నాటికి పౌరహక్కుల సంఘం కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

పౌర హక్కుల ఉద్యమం స్వతంత్రంగా తన చుట్టూ ఉన్న అన్ని ఉద్యమాలలో నైతిక విలువల సార్వజనీనతను ముందుకు తీసుకుపోతూ వాటి వ్యవస్థీకరణ కోసం ప్రయత్నాలు మరియు ప్రయోగాలు చేయాలి అని బాలగోపాల్ ప్రతిపాదించారు. 'సామాజిక మార్పులో నక్సలైట్ ఉద్యమాలతో పాటుగా ఇతర ఉద్యమాలు కూడా భాగం అయినప్పుడు పౌర హక్కుల సంఘం కేవలం నక్సలైట్ ఉద్యమాలతో మాత్రమే సరిపుచ్చుకోకుండా ఆధిపత్యానికి వ్యతిరేకంగా జరుగుతున్న అన్ని రకాల ఉద్యమాల గురించి కూడా పట్టించుకోవాలి' అనే దానికి బాలగోపాల్ సైద్ధాంతిక రూపాన్ని తెచ్చే ప్రయత్నం చేశారు. అయితే ఆ ప్రయత్నంలో భాగంగా 'పౌర హక్కుల సంఘంలో ఆ అంతర్గత ఆలోచనని మౌలికంగా మార్చలేము' అనే ఆలోచనతో ఆయన పౌర హక్కుల సంఘం నుండి నిష్క్రమించారు.

పీడిత వర్గ ప్రజల సాధారణ పౌర హక్కులతో పాటు సామాజిక, ప్రజాస్వామిక హక్కులను కూడా బాలగోపాల్ గుర్తించి అందుకు అనుగుణంగా 1998, అక్టోబర్ 11 నాడు 'మానవ హక్కుల వేదిక' (హెచ్.ఆర్.ఎఫ్)ను స్థాపించారు. ఎస్.జీవన్ కుమార్, ఎ.సునీత, మధుసూదన్ రాజ్ తదితరులను కన్వీనర్‌లుగా ప్రకటించారు. ఒక రకంగా అస్తిత్వ ఉద్యమాలు అందించిన హక్కుల అవగాహనను విస్తృతపరిచే దిశలో మానవ హక్కుల వేదిక ఏర్పడడం గమనార్హం. రాజ్యంతో పాటు రాజ్యేతర శక్తులు సృష్టించే హక్కుల ఉల్లంఘనలపై కూడా హక్కుల ఉద్యమం దృష్టిని కేంద్రీకరించాల్సిన అవసరాన్ని మానవ హక్కుల వేదిక గుర్తించింది. మానవ హక్కుల ఆచరణలో 'హిందూత్వ హింస'ను ప్రతిఘటించడాన్ని ఒక ప్రధాన అంశంగా బాలగోపాల్ ప్రతిపాదించి మానవ హక్కుల అజెండాగా విస్తరించారు.

మానవ హక్కుల వేదికలో భాగంగా బాలగోపాల్ విశాఖపట్నం అభివృద్ధి ప్రాజెక్ట్ కింద స్థానభ్రంశం అయ్యే గిరిజనుల హక్కుల కోసం, భూమి కోసం ఉద్యమించారు. అలాగే ఖమ్మం, తూర్పు గోదావరి జిల్లాలో నిర్వాసితుల కోసం ఆయన కోర్టు ద్వారా పిటిషన్లు వేసి ఉద్యమించారు. 1/70 గిరిజన భూమి రక్షణ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాలలో గిరిజనేతరుల నివాసాలకు అనుకూలంగా ఉత్తర్వులు జారీచేయడాన్ని బాలగోపాల్ తీవ్రంగా వ్యతిరేకించి ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని హైకోర్టులో వేసి ఆ ప్రక్రియను అడ్డుకున్నాడు. రంపచోడవరం ఏజెన్సీలో 1400 ఎకరాల భూమికి సంబంధించిన గిరిజనేతరుల క్రయవిక్రయాలను కోర్టు ద్వారా ఆయన నిలువరించగలిగారు. గిరిజనేతరులకు అనుకూలంగా ఇస్తున్న భూమి రక్షణ ఉత్తర్వులు జారీ చేసే మండల రెవెన్యూ అధికారి అధికారాన్ని పోలవరం మండలం ఇటుకల కోట భూమి వివాద కేసులో ఆయన హైకోర్టులో సవాలు చేసి నిలువరింపజేశారు. అలాగే ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ జిల్లాలలో ఓపెన్ కాస్ట్ లకు వ్యతిరేకంగా బాలగోపాల్ ఉద్యమించారు. నెల్లూరు జిల్లా తడ వద్ద స్థాపించిన తొలి సెజ్ కర్మాగారం అపాచీ కారణంగా బాధితులకు అండగా ఆయన ఉద్యమించారు. అలాగే విశాఖపట్నం జిల్లా సోంపేటలో థర్మల్ పవర్ ప్లాంట్ కి వ్యతిరేకంగా ఆయన ఉద్యమించారు.

ఆ రకంగా బాలగోపాల్ మానవ హక్కుల వేదికలో భాగంగా అనేక ప్రజా సమస్యలపై ఉద్యమించారు. 'ఒక రాజకీయ సిద్ధాంతం పట్ల నిబద్ధత గాని, ఒక రాజకీయ ఉద్యమ అవసరాలు గాని, ఒక సామాజిక వర్గం ప్రయోజనాలు గాని గాక కొన్ని విలువల పట్ల నిబద్ధతతో మనమందరం ఒక దగ్గరికి వచ్చాం. ఆ విలువల వెలుగులో సమాజాన్ని, మానవ జీవితాన్ని అర్థం చేసుకుంటూ దానిని ప్రజాస్వామికరించడానికి, మానవీకరించడానికి అవసరమైన కార్యరంగాన్ని నిర్దేశించుకుని చేపడుతున్న ఈ కార్యక్రమాలు అన్ని అణగారిన వర్గాల ఆరాటాలకు ఆసరా ఇస్తాయి. కాని మనకు ప్రయాణంగా ఆ ఆరాటంలో వ్యక్తమయ్యే విలువలు ఉండాలి. ఇది ప్రజా ఉద్యమాల చరిత్రలో ఒక కొత్త ప్రయోగం. దీనిని విజయవంతంగా ముందుకు తీసుకుపోయినట్లయితే ప్రజాస్వామ్య భావనకు బలం చేకూర్చిన వాళ్ళం అవుతాము' అని అనంతపూర్ లో జరిగిన మానవ హక్కుల వేదిక మూడవ రాష్ట్ర మహాసభలో బాలగోపాల్ చేసిన ప్రసంగం ఆయన దార్శనికతకు అద్దం పట్టింది.

బాలగోపాల్ మానవ హక్కుల వేదికలో భాగంగా భూసమస్యలు, నిర్వాసితుల సమస్యలు, పర్యావరణ సమస్యలు, ఓపెన్ కాస్ట్ సమస్యలు, ఆదివాసుల సమస్యలు, అసంఘటితరంగ కార్మికుల సమస్యలు, ప్రత్యేక ఆర్థిక మండలులకు వ్యతిరేకంగా మరియు అభివృద్ధి పేరుతో జరిగే ప్రకృతి వనరుల దోపిడి విధ్వంసానికి వ్యతిరేకంగా ఉద్యమించారు. అలాగే చట్ట పరిధిలో ఉన్న హక్కులకు భంగం కలిగిన ప్రతిచోటా ఆయన అవిశ్రాంతంగా ఉద్యమించారు. 'భయం నుండి బయటపడి నిర్భయంగా ప్రశ్నించగలగాలి. అలాగే రాజకీయ, సామాజిక జీవితంలో విలువలను పెంపొందించడానికి కృషి చేయాలి' అని బాలగోపాల్ పేర్కొనేవారు.

కేవలం 32 మందితో ఏర్పడిన మానవ హక్కుల వేదిక ( హెచ్.ఆర్. ఎఫ్) ని 300 మంది చురుకైన సభ్యులతో కూడిన సంస్థగా మలచడంలో బాలగోపాల్ కృషి ఎంతగానో ఉంది. అంతిమంగా ఆయన హక్కుల ఉద్యమానికి తలమానికంగా నిలిచారు. మానవ హక్కుల వేదికలో ఆయన నూతన ఒరవడితో తనదైన ప్రజాస్వామిక కార్యచరణతో నిరుపమాన కృషి చేశారు. అతి సామాన్యుడిగా జీవించి ప్రజా హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న బాలగోపాల్ 2009, అక్టోబర్ 8 నాడు మరణించినను 'ఎన్నటికి చెరగని హక్కుల స్ఫూర్తి'గా వెలుగొందుతున్నారు.

(అక్టోబర్ 8 బాలగోపాల్ 17వ వర్ధంతి )



జె.జె.సి.పి.బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690

'సంప్రదాయ గురువు స్థానం' నుంచి

# ఏఐ యుగంలో ఉపాధ్యాయుడి నవీన రూపం

తరతరాలుగా పాఠశాల, కళాశాల లేదా విశ్వవిద్యాలయం అంటే ఒకే విధమైన దృశ్యం మన కళ్లముందు ఉండేది. ఉపాధ్యాయుడు తరగతి ముందు నిలబడి పాఠం చెబుతుంటే, విద్యార్థులు వరుసగా కూర్చొని శ్రద్ధగా వింటూ, ముఖ్యమైన విషయాలను రాసుకునేవారు. అంటే ఉపాధ్యాయుడే జ్ఞానానికి ప్రధానమైన, ప్రశ్నించలేని వనరుగా ఉన్న స్థితి. కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ) వేగంగా అభివృద్ధి చెందడం, డిజిటల్ సమాచారానికి తక్షణ లభ్యత పెరగడంతో తరగతి గదుల్లో నిశ్శబ్దమైన ఒక విప్లవం మొదలైంది. ఆధునిక ఉపాధ్యాయుడు ఇప్పుడు 'పక్కన ఉండి మార్గనిర్దేశం చేసే గురువు' (గైడ్ ఆన్ ది సైడ్)గా మారాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ మార్పు ఉపాధ్యాయ వృత్తిని కాలానుగుణంగా నిలబెట్టడమే కాకుండా, నేర్చుకోవడం అంటే ఏమిటన్న దానికీ కొత్త అర్థాన్ని ఇస్తోంది.

**సమాచారంపై ఉపాధ్యాయుడి ఏకాధిపత్యానికి ముగింపు:**

"ఒక విద్యార్థి ఫ్రెంచ్ విప్లవంపై పూర్తి సారాంశాన్ని లేదా కాల్కులస్ సమస్యకు దశలవారీ పరిష్కారాన్ని మూడు సెకన్లలో ఏఐ చాట్‌బాట్‌ను అడిగి పొందగలిగినప్పుడు, ఉపాధ్యాయుడు కేవలం సమాచారాన్ని అందించే వ్యక్తిగా కొనసాగలేడు. మీరు కేవలం సబ్జెక్ట్ విషయాలను మాత్రమే బోధిస్తే, సాంకేతికత మీ స్థానాన్ని భర్తీ చేస్తుంది" అని డిజిటల్ అభ్యసన భవిష్యత్తుపై పరిశోధన చేస్తున్న విద్యా మానసిక నిపుణురాలు డాక్టర్ అనన్య రావు అంటున్నారు. అందుకే ఆధునిక ఉపాధ్యాయుడు తరగతి ముందు నిలబడి బోధించే పాత్ర నుంచి క్రమంగా బయటకు వస్తున్నారు. వారి కొత్త బాధ్యత ఏమిటంటే-విద్యార్థుల చేతుల్లోకి వచ్చిన అపారమైన సమాచార సముద్రాన్ని ఎలా ఉపయోగించాలో నేర్పడం. ఉపాధ్యాయుడు ఒక క్లిష్టమైన అంశాన్ని పరిచయం చేసి, ఆ తర్వాత విద్యార్థుల మధ్యకు వెళ్తారు. ఒక్కో విద్యార్థి వద్దకు వెళ్లి ప్రశ్నలు అడుగుతారు, వారి ఆలోచనలను సవాలు చేస్తారు, ఏఐ ఇచ్చిన సమాచారంలో పక్షపాతం ఉందా, అది నిజమా కాదా అన్నది పరిశీలించేందుకు సహాయం చేస్తారు.

**మనిషి కేంద్రంగా మారుతున్న ఉపాధ్యాయుడి మార్గదర్శకత్వం:**

ముఖ్యంగా, ఈ మార్పు మానవ ఉపాధ్యాయులను తొలగించడం లేదు కానీ. దీనికి విరుద్ధంగా, వారు ఎందుకు భర్తీ చేయలేని వారో మరింత స్పష్టంగా చూపిస్తోంది.
ఏఐ ఒక విద్యార్థి విద్యా స్థాయికి అనుగుణంగా వ్యక్తిగతీకరించిన గణిత పరీక్షను క్షణాల్లో తయారు చేయగలదు. కానీ ఆ విద్యార్థి ముఖాన్ని చూసి అతను లేదా ఆమె ఆ రోజు మానసికంగా ఇబ్బందిలో ఉన్నారని గుర్తించలేదు. అది సానుభూతిని అందించే లేదు. ఆట స్థలంలో ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన గొడవను పరిష్కరించలేదు. కష్టాల్లో ఉన్న ఒక యువకుడిని ఉపాధ్యాయుడి వ్యక్తిగత అనుభవం లేదా పోరాట కథ ద్వారా ప్రేరేపించలేదు. బహుళైచ్ఛిక ప్రశ్నలకు సంబంధించిన పరీక్షలను దిద్దడం, విద్యార్థుల పనితీరు వివరాలను నమోదు చేయడం, సాధారణ పాఠ్య ప్రణాళికలను రూపొందించడం వంటి పునరావృత పరిపాలనా పనులను ఏఐకి అప్పగించడం ద్వారా ఉపాధ్యాయులకు కొంత సమయం అందుబాటు లోకి వస్తోంది. దీంతో వారు తమకు అత్యంత ముఖ్యమైన పనులపై దృష్టి పెట్టగలుగుతున్నారు. ఉపాధ్యాయుడు భావోద్వేగ అవగాహన కలిగి, అవసరమైన సమయంలో మార్గదర్శకత్వం ఇస్తూ, విద్యార్థులతో లోతైన మానవ సంబంధాన్ని కలిగి ఉంటారు.

**రానున్న సవాళ్లు:**

ఈ మార్పు అంత సులభమైనది కాదు. తరగతి గదిని కొత్త విధానంలో నిర్వహించాలంటే విద్యా వ్యవస్థలో పెద్ద మార్పులు అవసరం. పాఠశాలల నిర్వహణ సంస్థలు కేవలం కంఠస్థం చేసి పరీక్షల్లో రాయడంపై ఆధారపడే అధిక ప్రాధాన్యత కలిగిన పరీక్షా విధానాల నుంచి బయటకు వచ్చి, నిరంతర మూల్యాంకనం, ప్రాజెక్టుల ఆధారిత అంచనా విధానాల వైపు వెళ్లాలి. అదే సమయంలో డిజిటల్ విభజన కూడా పెద్ద సమస్యగా ఉంది. తగిన నిధులు లేని విద్యా సంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులకు డిజిటల్ మార్గదర్శకులుగా పనిచేయడానికి అవసరమైన సాంకేతిక పరికరాలు, సదుపాయాలు అందుబాటులో ఉండకపోవచ్చు. ఇంద్రప్రస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ-ఢిల్లీ) ఎంపిక చేసిన కొన్ని పరీక్షలు, అసైన్‌మెంట్లలో విద్యార్థులు చాట్‌జీపీటీ వంటి జనరేటివ్ ఏఐ సాధనాలను ఉపయోగించేందుకు అనుమతిస్తోంది. అయితే విద్యార్థులు తాము ఉపయోగించిన ఖచ్చితమైన ప్రాంప్ట్‌లను కూడా తమ సమాధానాలతో పాటు సమర్పించాల్సి ఉంటుంది. మూల్యాంకనంలో ప్రధానంగా పరిశీలించే అంశాలు: 1)ప్రాంప్ట్‌ల నాణ్యత, ప్రశ్నను ఎలా రూపొందించారు అన్న తీరు; 2)విమర్శనాత్మక ఆలోచన, తార్కికత, విశ్లేషణ; 3)ఏఐ రూపొందించిన సమాధానాలను విద్యార్థులు ఎంత సమర్థంగా మెరుగుపరిచారు, వాటి నిజానిజాలను ఎలా పరిశీలించారు, వాటిని తమ అవసరాలకు ఎలా అన్వయించారు అనే విషయాలు ప్రధాన విషయంగా ఉంటుంది. ఐఐఐటీ-ఢిల్లీ డైరెక్టర్ రంజన్ బోస్ నాయకత్వంతో అనుబంధమైన ఈ విధానం, ఏఐని పూర్తిగా నిషేధించడం కంటే బాధ్యతాయుతంగా విద్యలో భాగం చేయాలనే ముందుచూపుతో కూడిన విధానాన్ని సూచిస్తోంది. ఉపాధ్యాయుడు ఇకపై ప్రదర్శనకు ప్రధాన పాత్రధారి కాకపోవచ్చు. కానీ అంతకంటే శక్తివంతమైన పాత్రలో-మన భవిష్యత్తును నిర్మించే విద్యార్థుల ఆలోచనలకు దిశానిర్దేశం చేసే సహ ప్రయాణికుడిగా, 'కో-పైలట్'గా-మారుతున్నాడు.

డా.బి.రాధికా రాణి
అసోసియేట్ ప్రొఫెసర్, హెడ్
లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

# మైనర్ అమ్మాయిలకు అవకాశం ఇస్తే అంతే సంగతులు

• హోటల్ యజమానులకు చందానగర్ సిఐ అల్టిమేటం







**శేరిలింగంపల్లి, అక్టోబర్ 07 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి ప్రాంతంలో ఈ మధ్యకాలంలో వివిధ హోటల్స్, లాడ్జిలలో అసాంఘిక కార్యక్రమాలు పెట్టరేగిపోవడంతో పాటు ప్రత్యేకించి మైనర్ అమ్మాయిల ఎంట్రీలు పెరిగి పోవడంపట్ల వివిధ మీడియా ప్రసార మాధ్య మాలలో వార్తా కథనాలు వెలువడుతున్న నేపథ్యాన్ని పురస్కరించుకొని బుధవారం చందా నగర్ సర్కిల్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ శ్రీధర్ చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ హోటల్స్, లాడ్జిలు ఇతర విడది గృహాల యజమానులతో చందానగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా హోటల్ యాజమాన్యాలతో మాట్లాడిన సిఐ పలు అంశాల పట్ల కఠిన స్వరంతో హెచ్చరికలు జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రతి హోటల్ కు మరియు లాడ్జికి నిర్దిష్టమైన విధివిధానాలు ఉండాలని, ఖచ్చితమైన అనుమతులతో పాటు పూర్తి భద్రత వ్యవహారాలు, సిసి కెమెరాల పర్యవేక్షణ నిరంతరం ఉండి తీరాల్సిందేనని యాజమాన్యాలకు స్పష్టం చేయడం జరిగింది. ప్రతి హోటల్ లో విధిగా చెక్ అవుట్ వివరాలను నమోదు చేయాలని, ఎట్టి పరిస్థితులలోనూ ఇతరుల సమయాన్ని మరొకరికి కేటాయించడం, అందులోనూ మైనర్లకు అవకాశం కల్పించడం వంటి దుస్సాహసానికి పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టంగా హెచ్చరించడం గమనార్హం. హోటల్లు, లాడ్జిలు, రెస్ట్ రూములు కేవలం ఆయా పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు విడది గృహాలు గా మాత్రమే కొనసాగాలని, కాదు కూడదు అని మద్యాన్ని ప్రోత్సహించడం, అసాంఘిక చర్యలకు ఆస్కారమివ్వడం, మత్తు పదార్థాలకు పరోక్ష సహకారం అందించడం వంటి నేరపూరిత కార్యక్రమాలకు పాల్పడినట్లు ఏమాత్రం సమాచారం అందిన అలాంటి వారిని ఉక్కు పాదంతో తొక్కిపడేస్తామని వివిధ హోటళ్ల యజమానులకు ఆదేశాలను జారీ చేయడం జరిగింది. ఇకనుండి అనుక్షణం ప్రతి హోటల్ పై, లాడ్జిపై పోలీసుల స్పష్టమైన నిఘా, పర్యవేక్షణ కొనసాగుతుందని, ఉదాసీన వైఖరి, నిర్లక్ష్యం వారి వ్యాపారాలపాలిట శరాఘాతమై ఎస్హెచ్ఓ స్పష్టం చేయడం జరిగింది. ఈ విషయంలో వివిధ హోటళ్ల యజమానులు అలాంటి అసాంఘిక కార్యక్రమాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబో మని, అలాంటి అనుమానా లకు తావిచ్చేలా ఉంటే వారి సమాచారాన్ని సైతం చందానగర్ పోలీస్ అధికారులకు అందజేస్తామని హామీనిచ్చి నట్లు పోలీసు అధికారులు తెలియజేశారు.

**సైబరాబాద్ సిపి కార్యాలయంలోనూ ప్రస్తావన**

చందానగర్ స్టేషన్ హౌస్ అధికారి నిర్వహించిన సమావేశపు ఉద్దేశాన్ని ఉటంకిస్తూ సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం ఆవరణలో సైతం సైబర్ సిపి డాక్టర్ ఎం రమేష్ పోలీసు ఉన్నతాధికారులతో అక్రమ లాడ్జీలు, అసాంఘిక చర్యలపై ప్రస్తావన తేవడం జరిగిందని, త్వరలోనే సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని హోటల్స్ పై, లాడ్జిలపై ప్రత్యేక పోలీసు దళాల దాడులను కొనసాగించడానికి కసరత్తును చేపడుతున్నట్లు పలువురు అధికారులు తెలిపారు. మీడియా కథనాలకుతోడు, వాస్తవాలు కూడా దగ్గరగా ఉండడంతో సైబరాబాద్ కమిషనరేట్ కు అక్రమ లాడ్జిల వ్యవహారం కొంత తలనొప్పిగా మారినట్లు స్పష్టం అవుతుండగా దానిని ఆదిలోనే నిర్మూలించాలని వారు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లేందుకు సంసిద్ధులు కావడం విశేషం!

# ప్రేమ పేరుతో బాలికపై లైంగిక దాడి

• నిందితుడికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష • రూ.20 వేల జరిమానా • మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు



**మెదక్ బూరో, అక్టోబర్ 7 (జనంసాక్షి):** మెదక్: మైనర్ బాలికను ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడు నీలం కుమార్ (30)కు ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. శంకరంపేట ఆర్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన 16 ఏళ్ల ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినిని నిందితుడు ప్రేమిస్తున్నానని, ఎలాగైనా పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. అనంతరం బాలికను సంగారెడ్డిలోని తన స్నేహితుడి గదికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత నంది కందికి తీసుకెళ్లి అక్కడ ఇంటి యజమానికి తాము భార్యాభర్తలమని చెప్పి గదిని అద్దెకు తీసుకున్నారు. కొన్ని రోజుల తర్వాత వారి వద్ద ఉన్న డబ్బులు అయిపోవడంతో తిరిగి ఇంటికి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అయితే ఇంటికి వెళితే కుటుంబ సభ్యులు కొడతారనే భయంతో పోలీసులను ఆశ్రయించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో శంకరంపేట గ్రామ పరిధిలో రోడ్డుపక్కన ఆగి ఉన్న బాలిక, నిందితుడిని గమనించిన ఓ వ్యక్తి పోలీసులకు సమాచారం అందించాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి శంకరంపేట ఆర్ ఎస్ఐ గౌస్ ఏప్రిల్ 2021లో కేసు నమోదు చేశారు. అప్పటి దర్యాప్తు అధికారి తూప్రాన్ డీఎస్పీ కిరణ్‌కుమార్ కేసును దర్యాప్తు చేసి కీలక సాక్ష్యాధారాలను సేకరించారు. అనంతరం కేసు విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య బలమైన వాదనలు వినిపించారు. ప్రస్తుత శంకరంపేట ఎస్ఐ శివానందం సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలను, ఇరుపక్షాల వాదనలను పరిశీలించిన ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావాలి నిందితుడు నీలం కుమార్‌కు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. 18 ఏళ్లలోపు బాలిక అంగీకారం చట్టపరమైన సమ్మతి కాదని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ స్పష్టం చేశారు. ప్రేమ, పెళ్లి పేరుతో మైనర్లను మాయమాటలతో నమ్మించి లైంగిక దాడులకు పాల్పడే వారిపై పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తప్పవన్నారు. తల్లిదండ్రులు పిల్లల స్నేహాలు, కదలికలు, ఆన్‌లైన్ పరిచయాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పిల్లలతో స్నేహపూర్వకంగా మాట్లాడి సమస్యలను తెలుసుకోవాలని, అనుమానాస్పద పరిణామాలను నిర్లక్ష్యం చేయవద్దన్నారు. బాలికలు, మహిళల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ కేసులో కోర్టు లైజనింగ్ అధికారి ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణగౌడ్, సీడీఓ శ్రీధర్‌గౌడ్, లీగల్ అడ్వైజర్ శ్వేత సహకరించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అభినందించారు.

## బైక్ స్టంట్లకు పాల్పడిన ముగ్గురు యువకులు అరెస్ట్



**రాజేంద్రనగర్, అక్టోబర్7 (జనంసాక్షి) :** సోషల్ మీడియాలో రీల్స్, లైక్స్ కోసం పబ్లిక్ రోడ్లపై ప్రమాదకర బైక్ స్టంట్లు చేస్తూ, అతివేగంగా వాహనాలు నడిపిన ముగ్గురు యువకులను అత్తాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్స్పెక్టర్ సీతయ్య వివరాల ప్రకారం ఈ నెల 6న అత్తాపూర్ పిల్లర్ నంబర్ 257 సమీపంలో నంబర్ ప్లేట్లు లేని మూడు హోండా డియో వాహనాలతో యువకులు ప్రమాదకర స్టంట్లు చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో మహమ్మద్ మోహినుద్దీన్ అలియాస్ మోహిన్ (24), మహమ్మద్ రిజ్వాన్ (21), తౌహిద్ (19)లను అరెస్ట్ చేశారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించేలా స్టంట్లు, రాంగ్ రూట్, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఇన్స్పెక్టర్ హెచ్చరించారు.

# భూముల రిజిస్ట్రేషన్లపై సైద్‌పల్లి రైతుల ఆందోళన

## షాద్‌నగర్-పరిగి రహదారిపై బైఠాయించి నిరసన



**పరిగి అక్టోబర్ 7 జనంసాక్షి :** వికారాబాద్ జిల్లా పరిగి మండలం సైద్‌పల్లి గ్రామ రైతులు షాద్‌నగర్-పరిగి ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. గ్రామంలోని పలు సర్వే నంబర్లకు సంబంధించిన భూముల రిజిస్ట్రేషన్లు జరగకుండా రెవెన్యూ అధికారులు హోల్డ్‌లో పెట్టారని పలువురు గ్రామ రైతులు ఆరోపించారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు కోసం తమ భూములను ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, అయితే ప్రాజెక్టుకు భూములు ఇచ్చే విషయంలో అభ్యంతరం లేదని తెలిపారు. కానీ మిగిలిన భూములను అవసరాల మేరకు విక్రయించుకోవడానికి కూడా రిజిస్ట్రేషన్లు జరగకుండా హోల్డ్‌లో పెట్టడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

తమ పిల్లల వివాహాలు, ఇతర అత్యవసర అవసరాల కోసం భూములను విక్రయించాల్సి వచ్చినా రిజిస్ట్రేషన్లు జరగకుండా, స్లాట్ బుక్ కాకుండా అధికారులు చేస్తున్నారని రైతులు ఆరోపించారు. స్లాట్ బుక్ అయిన తర్వాత కూడా రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఆటంకాలు కల్పించడం సరికాదని వారు పేర్కొన్నారు. గ్రామసభ నిర్వహించకుండా, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా భూములను తీసుకునే ప్రయత్నం జరుగుతోందని రైతులు ఆరోపించారు. ఇప్పటివరకు గ్రామంలో ఎలాంటి గ్రామసభ నిర్వహించలేదని, భూసేకరణకు సంబంధించి తమకు ఎలాంటి నోటీసులు కూడా ఇవ్వలేదని తెలిపారు.

లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు కోసం గ్రామ రైతులందరి అంగీకారంతో భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, అయితే మిగిలిన భూముల రిజిస్ట్రేషన్లపై విధించిన ఆంక్షలను తొలగించాలని రైతులు డిమాండ్ చేశారు. రోడ్డెక్కి నిరసన చేస్తున్న రైతులను సముదాయించి పంపించారు పోలీసులు.

# నకిలీ జీపీఏతో భూముల బాగోతం!

• ఐదుగురు అరెస్టు.. ఆరు ప్లాట్లకు అక్రమ రిజిస్ట్రేషన్లు
• అసలు యజమానుల ఫొటోలు, సంతకాలు, వేలిముద్రలతో నకిలీ పత్రాలు




**కీసర, అక్టోబర్ 07 (జనంసాక్షి)**

నకిలీ జీపీఏ, తప్పుడు స్థిరాస్తి పత్రాలతో చీర్యాల భూములను అక్రమంగా విక్రయించి రిజిస్ట్రేషన్లు చేసిన కేసులో ఐదుగురు నిందితులను కీసర పోలీసులు అరెస్టు చేశారు. బసరికారి శ్రీనివాస్‌రావు, బార్లపాటి ఆనంద్, బొర్రా వెంకటేష్, మీర్ సాదిక్ అలీ, రామిడి సత్తిరెడ్డిలను బుధవారం అదుపులోకి తీసుకుని విచారించగా కీలక వివరాలు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

**అసలు యజమానుల పేర్లతో జీపీఏ**

కీసర మండలం చీర్యాల గ్రామం సర్వే నంబర్ 94లోని 18 ఎకరాల 19 గుంటల భూమికి తోటరెడ్డి వెంకట్‌రెడ్డి, మహమ్మద్ ఇక్బాల్ తదితరులు యజమానులుగా ఉన్నారు. 1982లో రిజిస్టర్డ్ సేల్‌డీడ్ ద్వారా భూమిని కొనుగోలు చేసి అప్పటి నుంచి స్వాధీనంలో ఉన్నారు. అయితే 2024లో తమ భూమిలో కొన్ని ప్లాట్లకు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తుండటాన్ని గుర్తించి ఆరా తీశారు. సంబంధిత పత్రాలను పరిశీలించగా.. 1988లో తమ పేర్లతో నకిలీ జీపీఏ సృష్టించినట్లు గుర్తించారు. సయ్యద్ అఫ్జల్ అనే వ్యక్తి ఈ నకిలీ జీపీఏను సృష్టించినట్లు పోలీసులు గుర్తించారు. దీనిపై తోటరెడ్డి వెంకట్‌రెడ్డి ఫిర్యాదుతో కీసర పోలీస్‌స్టేషన్‌లో క్రైం నంబర్ 414/2025 కింద కేసు నమోదైంది.

**ఆరు ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు**

నకిలీ జీపీఏలోని ఫొటోలు, సంతకాలు, వేలిముద్రలు అసలు యజమానులవి కావని తెలిసినా నిందితులు వాటినే ఉపయోగించినట్లు దర్యాప్తులో తేలింది. ఈ పత్రాల ఆధారంగా సర్వే నంబర్ 94లోని ప్లాట్ నంబర్లు 21, 28, 38, 59, 129, 145లకు సేల్‌డీడ్‌లు రిజిస్టర్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం కొన్ని ఆస్తులకు సంబంధించి సేల్‌డీడ్‌లు, అగ్రిమెంట్ ఆఫ్ సేల్ కమ్ జీపీఏల ద్వారా లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు.

**సాక్షులుగా సంతకాలు.. నగదు**

బార్లపాటి ఆనంద్, బొర్రా వెంకటేష్, మీర్ సాదిక్ అలీ, రామిడి సత్తిరెడ్డిలు పలు రిజిస్ట్రేషన్ పత్రాల్లో సాక్షులుగా సంతకాలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఇందుకు ప్రతిఫలంగా నగదు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. లావాదేవీలు అక్రమమని తెలిసినా రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సహకరించినట్లు పేర్కొన్నారు.

**మధ్యవర్తులపై దర్యాప్తు**

తటాకం నారాయణశర్మ, జూపల్లి రవీందర్ మధ్యవర్తులుగా వ్యవహరించినట్లు నిందితుల విచారణలో వెల్లడైన నేపథ్యంలో వారి పాత్రపైనా దర్యాప్తు చేస్తున్నారు. నకిలీ పత్రాల తయారీ, రిజిస్ట్రేషన్‌లో సహకరించిన వ్యక్తులు, ఆర్థిక లావాదేవీలు, ఇతర ఆస్తి నేరాల్లో నిందితుల ప్రమేయంపై ఆరా తీస్తున్నారు.

**ఆస్తి కొనుగోలుదారులకు సూచన**

స్థిరాస్తి కొనుగోలు చేసే ముందు రెవెన్యూ రికార్డులు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పత్రాలను పూర్తిగా పరిశీలించుకోవాలని కీసర పోలీసులు సూచించారు. అనుమానాస్పద స్థిరాస్తి లావాదేవీలు, నకిలీ పత్రాలపై సమాచారం ఉంటే సమీప పోలీస్‌స్టేషన్‌కు లేదా డయల్ 100కు తెలియజేయాలని కోరారు. జవహర్‌నగర్ ఏసీపీ ఎస్.చక్రపాణి మార్గదర్శకత్వంలో కీసర ఇన్‌స్పెక్టర్ బిక్కి రమేశ్, ఎస్ఐ అనిల్‌కుమార్, సిబ్బంది దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.



# పాత తాండూరులో దారుణం

## ఎస్సీ స్మశాన వాటికలో 25 సమాధులు కూల్చివేత

### రియల్ వ్యాపారుల కబ్జా కోణం

**తాండూరు ఆక్టోబర్ 7(జనంసాక్షి)** మున్సిపల్ పరిధిలో దారుణం వెలుగులోకి వచ్చింది. పట్టణ మున్సిపల్ పరిధి సీతారాంపేట్ సమీపంలో సర్వే నెంబర్ 3లో ఉన్న ఎస్సీ స్మశాన వాటికను కొందరు రియల్ వ్యాపారులు కబ్జా చేసేందుకు యత్నించారన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఈ సందర్భంగా పాత తాండూరు వాసులు మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఈ స్మశాన వాటికను కొందరు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా మంగళవారం రాత్రికి రాత్రే యంత్రాలతో స్మశాన వాటికలోకి వచ్చి సుమారు 20 నుంచి 25 స్మశాన వాటికలను, సమాధులను కూల్చివేసి రోడ్డు కూడా వేశారు. ఇది ఎస్సీ వర్గానికి చెందిన స్మశాన వాటిక అని చూడకుండా స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించారని ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకుని సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించిన స్థానికులు స్మశాన వాటికలో రియల్ వ్యాపారులు చేసిన దౌర్జన్యాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. కబ్జాకు గురవుతున్న స్మశాన వాటికను కాపాడుకునేందుకు పోరుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా స్మశాన వాటికను కాపాడాలని డిమాండ్ చేస్తూ గురువారం తాండూరు తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల ముందు మెరుపు ధర్నా చేపడుతున్నట్లు పాత తాండూరు వాసులు తెలిపారు. ఈ ధర్నాలో మాదిగ, మాల వర్గాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నేతలు, యువకులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

# మూసీ భూసేకరణలో భూ యజమానులకు న్యాయం చేయాలి

• కలెక్టర్‌ను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
• 60:40 నిష్పత్తిలో ల్యాండ్ పూలింగ్ ప్రయోజనాలు కల్పించాలని విజ్ఞప్తి
• ప్రతాప సింగారంలో 1,750 చదరపు గజాలు ఇస్తున్నారని వెల్లడి • ఇక్కడ 1,400 ఇవ్వాలని కోరిన ఎమ్మెల్యే



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 07 (జనంసాక్షి) :** మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు పరిధిలో భూసేకరణ, ల్యాండ్ పూలింగ్, భూ యజమానులకు కల్పించాల్సిన ప్రయోజనాలపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరిని కలిశారు. భూ యజమానులు, రైతులు, బాధితులకు న్యాయం జరిగేలా నిబంధనలను పారదర్శకంగా అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం సెప్టెంబర్ 19, 2026న జారీ చేసిన +.ా.వీం.చీశీ.240 ద్వారా మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ఏరియాలో ల్యాండ్ పూలింగ్ అమలుకు తీసుకున్న నిర్ణయాలపై కలెక్టర్‌తో చర్చించారు. ప్రాజెక్టు పరిధిలో పట్టా భూములు, బఫర్ ఏరియా, రివర్ బెడ్/ఎఫ్‌టీఎల్, అసైన్డ్, ప్రభుత్వ భూములు ఉన్న నేపథ్యంలో ఆయా భూముల యజమానుల ప్రయోజనాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

**60:40 నిష్పత్తిలో ఇవ్వాలి**

ల్యాండ్ పూలింగ్‌లో భూ యజమానులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు లేదా డెవలప్ చేయగల భూమి కేటాయింపు, వాటా, పరిహారం, స్టాంప్ డ్యూటీ తదితర అంశాల్లో స్పష్టత కల్పించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రతాప సింగారం వద్ద 1,750 చదరపు గజాలు ఇస్తున్నారని, అదే విధంగా ఇక్కడ కూడా 1,400 చదరపు గజాలు ఇవ్వాలని కోరారు. ల్యాండ్ పూలింగ్‌లో 60:40 నిష్పత్తిని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా, భూ యజమానుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ న్యాయబద్ధంగా, పారదర్శకంగా చేపట్టాలని బండారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సల్ల వీరారెడ్డి, పంగా మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆమనగల్ కేంద్రంగా ఏసీపీ కార్యాలయం

### ప్రభుత్వ ఉత్తర్వులు జారీ



**కడ్తాల్ అక్టోబర్ 07 (జనంసాక్షి):** ఆమనగల్ కేంద్రంగా ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోకి ఆమనగల్ ఏసీపీ కార్యాలయాన్ని తీసుకువచ్చి, దాని పరిధిలో ఆమనగల్, మాడ్గుల, కడ్తాల్, తలకొండపల్లి పోలీస్ స్టేషన్లను కేటాయించారు. దీంతో ఈ నాలుగు మండలాల పోలీసు పరిపాలనలో కీలక మార్పు చోటుచేసు కోనుంది. ఇప్పటివరకు ఆమనగల్, కడ్తాల్, తలకొండపల్లి పోలీస్ స్టేషన్లు షాద్ నగర్ ఏసీపీ పరిధిలో ఉండగా, మాడ్గుల పోలీస్ స్టేషన్ ఇబ్రహీంపట్నం ఏసీపీ పరిధిలో కొనసాగింది. దీంతో నాలుగు మండలాల ప్రజలు పోలీసు ఉన్నతాధికారులను కలిసేందుకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో నాలుగు మండలాలకు ఆమనగల్ కేంద్ర బిందువుగా మారనుంది. ఏసీపీ కార్యాలయం అందుబాటు లోకి రావడంతో ఫిర్యాదుల పరిష్కారం, పోలీసు పరిపాలన, శాంతిభద్రతల పర్యవేక్షణ మరింత చేరువయ్యే అవకాశం ఉంది. నేరాల నియంత్రణ, పోలీస్ స్టేషన్ల మధ్య సమన్వయం కూడా మెరుగు పడనుంది. ఏళ్లుగా పోలీసు పరిపాలనకు సంబంధించి ఎదుర్కొంటున్న ఇబ్బందులకు పరిష్కారం లభించనుంది.



# తల్లిదండ్రులు లేని పిల్లలకు చేయూత

## టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్

**దుద్యాల, అక్టోబర్ 7 (జనం సాక్షి):** దుద్యాల గ్రామంలో నర్సింలు 2023లో ఆత్మహత్య చేసుకోగా పద్మమ్మ సెప్టెంబర్ 2026లో అనారోగ్యంతో మరణించడం జరిగింది. వీరికి గల నలుగురు పిల్లలు తల్లిదండ్రులు కోల్పోయి అనాధలుగా మిగిలిన సుజన పదవ తరగతి కావ్యశ్రీ ఏడవ తరగతి, అనన్య 4వ తరగతి, శివప్రసాద్ యూకేజీ అనాధలుగా నిలవడం చాలా బాధాకరమైన అనిపిస్తే తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి కే రవీందర్ గౌడ్ మాట్లాడుతూ ఈ విద్యార్థిని విద్యార్థులకు కావలసిన విద్యాభ్యాసానికి మరియు ఉన్నత చదువులకు తెలంగాణ విద్యావంతుల వేదిక తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చి వారి తల్లిదండ్రుల ఆత్మకు శాంతి కలగాలని మరియు ఈ పిల్లలందరూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాతలైన బసవరాజ్, వరుణ్ ప్రబోధ్ అందించిన సహాయాన్ని టేకుల్ కోడ్ గ్రామానికి సంబంధించిన పూజా, శ్రావణిలకు అందజేశామన్నారు. తెలంగాణ విద్యావంతుల వేదిక రిటైర్డ్ ఉపాధ్యాయులు బసవరాజు అందించిన సహాయాన్ని గ్రామానికి చెందిన నలుగురు పిల్లలకు దసరా పండగ సందర్భంగా కొత్త బట్టలు కొనిచ్చి అందరూ సుఖసంతోషాలతో జరుపుకునే అతి పెద్ద పండుగ దసరా పండుగకు పిండివంటలు చేసుకుని తల్లిదండ్రులు లేనటువంటి లోటు తెలియకుండా అందరి మాదిరిగానే పిండి వంటలు చేసుకుని పండుగను సంతోషంగా జరుపుకోవడానికి కావలసిన ఆహార వస్తువులు మరియు పదార్థాలను అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో దుద్యాల ప్రధానోపాధ్యాయులు మల్లప్ప, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు రాములు, రవి నాయక్, సుధాకర్ రావు, చంద్రశేఖర్ రెడ్డి, పాల్గొని పిల్లలకు మనో ధైర్యాన్ని కలగజేశారు.

## ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య

**లక్నో :** ఒక మహిళ తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసింది. గుండెపోటుతో అతడు చనిపోయినట్లు నమ్మించేందుకు ప్రయత్నించింది. అంత్యక్రియల తర్వాత మొబైల్ ఫోన్‌లోని చాట్ ద్వారా ఈ విషయం బయటపడింది. ఈ నేపథ్యంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ఈ సంఘటన జరిగింది.

# నీటి లభ్యత ఉన్నా రైతాంగాన్ని అరిగోస పెడుతున్న ప్రభుత్వం

- కేఎల్ఐ పంపులు నిర్విరామంగా నడిపి రైతాంగాన్ని కాపాడాలి : మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి
- 12లోగా నార్లపూర్ పంపులు ప్రారంభించకపోతే వేలాది మంది రైతులతో ముట్టడిస్తాం
- పొంగులేటి, కృష్ణారావులు అధికారులతో, మీడియా సమక్షంలో బహిరంగ చర్చకు రావాలి

**వనపర్తి బ్యూరో అక్టోబర్ 7 జనంసాక్షి**
కేఎల్ఐ పంపులను నిర్విరామంగా నడిపి, జూరాల నుంచి సకాలంలో నీటిని విడుదల చేసి రైతాంగాన్ని కాపాడాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. నీటి లభ్యత ఉన్నప్పటికీ రైతాంగాన్ని ప్రభుత్వం అరిగోస పెడుతోందని ఆయన ఆరోపించారు. నార్లపూర్ పంపులను వెంటనే ప్రారంభించకపోతే 12వ తేదీన వేలాది మంది రైతులతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు. బుధవారం నాడు వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆయన నివాస గృహంలో ఏర్పాటు చేసిన,పత్రికా సమావేశంలో నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి పాలమూరు జిల్లాలో రైతులు కరెంట్, నీళ్లు, యూరియా, రుణమాఫీ, రైతుభరోసా లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతాంగాన్ని ఆదుకోవాల్సిన ప్రభుత్వం, ప్రజా సమస్యలపై నిత్యం ప్రశ్నిస్తున్న వారిపై వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం నాయకుల కుసంస్కారానికి నిదర్శనమని విమర్శించారు.కేఎల్ఐ పంపులను నిర్విరామంగా నడపకపోవడం, సకాలంలో జూరాల నీటిని విడుదల చేయకపోవడం వల్ల ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా 6 నుంచి 7 లక్షల ఎకరాల పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని నిరంజన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు చివరి దశలో ఉన్నందున ప్రస్తుతం నీరు అత్యవసరమని తెలిపారు.జూరాలలో 9 టీఎంసీల నీరు ఉన్నప్పటికీ రైతులను ఇబ్బందులకు గురిచేశారని, ప్రజల ఒత్తిడి మేరకు నీటిని సర్దుబాటు చేశారని అన్నారు.

రైతులు నీళ్లు, కరెంట్, యూరియా, రుణమాఫీ, రైతుభరోసా కోరుతున్నా ప్రభుత్వానికి సోయి లేదని విమర్శించారు.కేసీఆర్ హయాంలో వలసలు లేవని, ప్రస్తుత



ప్రభుత్వ హయాంలో ప్రజలు వలసబాట పడుతున్నారని ఆయన అన్నారు.

**ఆస్తులపై ఆరోపణలు రుజువు చేయాలి**

తన ఆస్తులపై వందలాది ఎకరాల ఆరోపణలు చేస్తున్నారని, మూడేళ్లు గడిచినా చేసిన ఆరోపణలకు ఇప్పటివరకు రుజువులు లేవని నిరంజన్‌రెడ్డి అన్నారు. 90 ఎకరాల ప్రభుత్వ భూమి అని ఆరోపించి చివరకు 19 గుంటలుగా తేల్చారని విమర్శించారు.పానగల్ వ్యవసాయ క్షేత్రం తన కష్టార్జితమని తెలిపారు. 663 సర్వే నంబర్ ఉబేద్దుల కొత్వాల్‌కు చెందినదని, అందులో తన కుమార్తెకు చెందిన అరగుంట భూమి ఆక్రమణకు గురైందని తేల్చేందుకు అధికారులు ప్రయత్నించారని ఆరోపించారు. తనపై ఆరోపణలు చేయించేందుకు అధికారులపై ఒత్తిడి తెచ్చారని అన్నారు. తనను ఏమీ చేయలేక ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మరోసారి సర్వేకు ఆదేశించారని పేర్కొన్నారు. తన అన్ని ఆస్తులను బహిరంగంగా వెల్లడించేందుకు సిద్ధంగా ఉన్నానని నిరంజన్‌రెడ్డి తెలిపారు.

తనపై ఒక్క అరగుంట భూమి ఆక్రమణ ఆరోపణను కూడా అధికారులు, రాష్ట్ర మీడియా సమక్షంలో రుజువు చేయాలని సవాల్ చేశారు. తనపై ఆరోపణలు చేస్తున్న పొంగులేటి, కృష్ణారావులు తమ కలెక్టర్లు, అధికారులను, రాష్ట్ర మీడియాను తీసుకుని బహిరంగ చర్చకు రావాలని కోరారు.తనపై ఒక్క అరగుంట భూమి ఆక్రమణ రుజువైనా ముక్కు నేలకు రాసి క్షమాపణ చెబుతానని నిరంజన్‌రెడ్డి సవాల్ విసిరారు. చీకటి ఆదేశాలు, రహస్య నివేదికలు కాకుండా పారదర్శకంగా వ్యవహరించాలని అన్నారు. తనపై ఆధారాలు లేని ఆరోపణలు, అవహేళనలు, దుష్ప్రచారాలు చేయడం ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమని విమర్శించారు.కృష్ణారావును ఉద్దేశించి పలు వ్యాఖ్యలు చేసిన నిరంజన్‌రెడ్డి.. తన రాజకీయ త్యాగం ఫలితంగానే ఆయన తొలిసారి ఎమ్మెల్యే అయ్యారని గుర్తు చేశారు. అసూయ, కుయుక్తులతో రాజకీయ మనుగడకు తావులేదని అన్నారు. తన సవాల్‌ను స్వీకరించి బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో గట్టు యాదవ్, బి.లక్ష్మయ్య, వాకిటి శ్రీధర్, లక్ష్మారెడ్డి, నందిమల్ల అశోక్, కృష్ణానాయక్, మాణిక్యం, వనం రాములు, రాళ్ల కృష్ణయ్య, గంధం పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# నందారం అభివృద్ధికి కొత్తరూపు

**హెచ్‌ఎండీఏ ద్వారా మంజూరైన 1.20 కోట్ల నిధులతో పనులు**



**బాలానగర్,అక్టోబర్ 7(జనంసాక్షి):** బాలానగర్ మండలం నందారం గ్రామ అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అందిస్తున్న సహకారం, గ్రామ సర్పంచ్ హారిసింగ్ తీసుకుంటున్న చొరవతో పలు అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్నాయని గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు. ప్రజల అవసరాలను తెలుసుకుంటూ రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్లు తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా నందారం గ్రామంలో హెచ్‌ఎండీఏ ద్వారా మంజూరైన రూ.1.20 కోట్ల నిధులతో అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి శంకుస్థాపన చేశారు.

ఈ పనులు పూర్తయితే గ్రామంలోని పలు ప్రాంతాల్లో రహదారి సౌకర్యం మెరుగుపడటంతో పాటు మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి వాటి పరిష్కారానికి సర్పంచ్ హారిసింగ్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని స్థానికులు తెలిపారు. గ్రామ సమస్యలను ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నిధులు, అభివృద్ధి పనులు తీసుకురావడంలో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం ఏఎంసీ చైర్ పర్సన్ అశ్విని, సర్పంచులు, హరి సింగ్, వెంకటేశ్వర్ రెడ్డి, టిపిసిసి సమన్వయకర్త దత్తాత్రేయ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ నాయక్, ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు యాదయ్య, పెద్దలు, మాజీ నాయకులు, గ్రామ పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, పార్టీ సభ్యులు, మహిళా సంఘాల నాయకులు, వివిధ సంఘాల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అందరి సహకారంతో నందారం గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్థులు ఆకాంక్షించారు.




## పనులకు బిల్లులు రావడం లేదని
# సర్పంచ్‌ల ఆవేదన

**రాజాపూర్, అక్టోబర్ 7 (జనంసాక్షి):** మండల కేంద్రంలో గల రైతు వేదికలో ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొని తమ గ్రామాల్లోని సమస్యలపై మండల అధికారులను ప్రశ్నించారు. రాయపల్లి, మల్లేపల్లి,ముదిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల్లో ఉన్న సభ్యులు చెప్పిన వారికే ఇల్లు మంజూరు చేస్తున్నారని, సర్పంచ్లు చెప్పినా వారికి ఇవ్వడం లేదని అధికారులను ప్రశ్నించారు. ఎటువంటి పనులు చేసిన బిల్లులు రావడం లేదని, గ్రామాల్లో ఏదైనా పని చేయాలంటే సర్పంచ్ లము అప్పులు చేయాల్సి వస్తుంది అని అన్నారు. మహిళా సమాఖ్య సంఘాల అధ్యక్షులు, బుక్ కీపర్లు ఇష్టారాజ్యంగా లోన్లు తేవాడంతో మహిళా సమాఖ్య సంఘాల్లో రెగ్యులర్ గా డబ్బులు చెల్లించే వారికి, అవసరం వచ్చినప్పుడు లోన్ రాకాపోవడంతో చాలా మంది ఇబ్బంది పడుతున్నారని సర్పంచ్ లకు కనీసం సమాఖ్య సంఘాల సమావేశం ఉన్నప్పుడు సమాచారం ఇవ్వడం లేదని సర్పంచ్ లు అధికారులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాధరోహిణి, డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్, ఏఎంసీ వైస్ చైర్మన్ శేఖర్ గౌడ్, ఎంపీడీవో విజయలక్ష్మి, నాయబ్ తహసీల్దార్ భారతి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎక్సైజ్ శాఖ, పోలీసు శాఖ అధికారులు గైర్హాజరు అయ్యారు. అన్ని గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు. బిబినగర్ సర్పంచ్ భర్త సర్వసభ్య సమావేశంలో పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది.

# మూర్ఛకు కొత్త ఆశాకిరణం

## డ్రగ్-రెసిస్టెంట్ ఎపిలెప్సీలో సెనోబమేట్



**మహబూబ్ నగర్ అర్బన్ అక్టోబర్ 7, జనంసాక్షి :** మూర్ఛ (ఎపిలెప్సీ) అనేది కేవలం స్పృహ కోల్పోయి చేతులు, కాళ్లు కొట్టుకోవడం మాత్రమే కాదని, వివిధ రకాల సీజర్స్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స అందించడం ద్వారా మెరుగైన నియంత్రణ సాధించవచ్చని ప్రముఖ న్యూరాలజిస్ట్ మరియు ఎపిలెప్టాలజిస్ట్ డా. సాయి సతీష్ కంద్రాజు తెలిపారు. కొంతమంది రోగుల్లో అకస్మాత్తుగా ఒక చేతి లేదా కాలి కదలికలు, వింత వాసన లేదా అనుభూతి, మాట ఆగిపోవడం, కొన్ని క్షణాల పాటు స్పందించకపోవడం వంటి లక్షణాలు కనిపించవచ్చని, వీటిని ఫోకల్ సీజర్లా పరిగణించవచ్చని ఆయన వివరించారు. శరీరం మొత్తం ప్రభావితమయ్యే జనరలైజ్డ్ సీజర్స్ కూడా ఉంటాయని, అందువల్ల ప్రతి సీజర్‌ను ఒకే విధంగా చూడకూడదన్నారు. ఎపిలెప్సీ ఉన్నవారు వైద్యులు సూచించిన మందులను క్రమం తప్పకుండా తీసుకోవడం అత్యంత ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. మందులను తమంతట తాము ఆపడం, మోతాదును మార్చడం వల్ల సీజర్స్ తిరిగి వచ్చే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. తగినంత నిద్ర, క్రమబద్ధమైన జీవనశైలి, వ్యక్తిగత సీజర్ ట్రిగ్గర్లను నివారించడం కూడా చికిత్సలో ముఖ్యమైన భాగాలని తెలిపారు. సరైన రెండు యాంటీ-సీజర్ మందులను తగిన మోతాదులో ఉపయోగించినప్పటికీ సీజర్స్ కొనసాగితే దానిని డ్రగ్-రెసిస్టెంట్ ఎపిలెప్సీగా పరిగణిస్తారు. అలాంటి రోగులకు మరిన్ని మందులతో పాటు ఎపిలెప్సీ సర్జరీ, వున్స్ వంటి పరికర చికిత్సలు, ఇతర ఆధునిక చికిత్సా విధానాలను కూడా పరిశీలించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ నేపథ్యంలో (సెనోబమేట్) భారతదేశంలో అందుబాటులోకి రావడం డ్రగ్-రెసిస్టెంట్ ఫోకల్ ఎపిలెప్సీ చికిత్సలో మరో ముఖ్యమైన ఎంపికను అందిస్తోందని డా. సాయి సతీష్ తెలిపారు. క్లినికల్ అధ్యయనాల్లో కష్టతరమైన ఫోకల్ ఎపిలెప్సీ ఉన్న కొంతమంది రోగుల్లో సీజర్ నియంత్రణతో పాటు సీజర్-ఫ్రీ స్థితి కూడా సాధ్యమైనట్లు వెల్లడైందని చెప్పారు. మీడియా సమావేశంలో మేనేజర్ బి సుదర్శన్ రెడ్డి రోహిత్ కుమార్ పాల్గొన్నారు.

# మక్తల్‌లో రూ.4 కోట్లతో ఇరిగేషన్ నూతన భవన నిర్మాణానికి భూమిపూజ

- శంకుస్థాపన చేసిన మంత్రి వాకిటి శ్రీహరి, జిల్లా కలెక్టర్ ప్రియాంక
- ఆధునిక వసతులతో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



**మక్తల్, అక్టోబర్ 07 (జనంసాక్షి)**
మక్తల్ పట్టణంలో నీటి పారుదల శాఖ (ఇరిగేషన్) కార్యకలాపాలను మరింత సులభతరం చేసేందుకు రూ.4 కోట్ల భారీ వ్యయంతో నూతనంగా నిర్మించనున్న ఇరిగేషన్ శాఖ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. బుధవారం మక్తల్‌లో రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య శాఖ, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, జిల్లా కలెక్టర్ ప్రియాంకతో కలిసి ఈ నూతన భవన నిర్మాణానికి ఘనంగా భూమిపూజ చేశారు. అధికారులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖకు సంబంధించిన కార్యాలయాలు, సిబ్బంది తమ విధులను మరింత సజావుగా నిర్వహించేందుకు ఈ మెరుగైన వసతుల భవనం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అన్ని ఆధునిక సౌకర్యాలతో పాటు, నాణ్యతా ప్రమాణాలను తూచా తప్పకుండా పాటించి భవన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మక్తల్ పట్టణంలోని ఇరిగేషన్ శాఖకు చెందిన స్థలాల్లో గోదాముల నిర్మాణానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపించినట్లు మంత్రి తెలిపారు. గోదాముల నిర్మాణానికి తగిన స్థలాన్ని కేటాయించేలా సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంకను ఆయన కోరారు. అదేవిధంగా, పట్టణంలో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి



అవసరమైన మున్సిపల్ స్థలాన్ని వెంటనే కేటాయించాలని కలెక్టర్‌కు సూచించారు. మక్తల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి శ్రీహరి స్పష్టం చేశారు. సాగునీరు, రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక వసతులను బలోపేతం చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మక్తల్ మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కాంత్ కుమార్, నీటి పారుదల శాఖ ఈఈ గోపాల చారి, డీఈఈలు సురేష్, మహేశ్, శివుడు, వెంకట రమణ, శేఖర్, ఏఈలు, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# రేగోడ్ గ్రామకంఠం భూమిపై అధికారుల ఆరా

## 22 గుంటల భూమిపై అధికారుల ముమ్మర తనిఖీలు

## కలెక్టర్‌కు నివేదిక సమర్పించనున్న అధికారులు

**రేగోడు,అక్టోబర్17 (జనంసాక్షి):** మండల కేంద్రమైన రేగోడ్ లోని పెద్ద శంకరంపేట వెళ్లే ప్రధాన రహదారి పక్కన సుమారు 22 గుంటల ఉగ్రామకంఠం సంబంధించిన భూమిపై బుధవారం మెదక్ డీఎల్‌పీఓ యాదయ్య ఆధ్వర్యంలో అధికారులు తనిఖీ నిర్వహించారు.గ్రామకంఠం పరిధిలోని భూమికి సంబంధించిన హద్దులు, సంబంధిత వివరాలను పరిశీలించి సమాచారాన్ని సేకరించారు.ఈనేపథ్యంలో పూర్తి స్పష్టత రావాల్సి ఉండటంతో మరోసారి సమగ్ర సర్వే నిర్వహించాలని అధికారులు నిర్ణయించినట్లు మెదక్ డీఎల్పీఓ యాదయ్య తెలిపారు.మెదక్ ఏడీ ఆధ్వర్యంలో సర్వే చేపట్టిన అనంతరం భూమి వివరాలు సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు అధికారులు వెల్లడించారు. గ్రామకంఠం భూమికి సంబంధించిన అంశంపై అధికారుల దృష్టి సారించిన నేపథ్యంలో మరోసారి సమగ్ర సర్వేకు నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.తాజాగా నిర్వహించిన



క్షేత్రస్థాయి తనిఖీ, త్వరలో చేపట్టనున్న సర్వేలో వెలుగులోకి వచ్చే అంశాలను,నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించిన అనంతరం పూర్తి వివరాలను వెల్లడిస్తామని తెలిపారు.




# శంకర రెడ్డికి డైనమిక్ స్కూల్ అవార్డు

**జడ్చర్ల, అక్టోబర్ 7 (జనంసాక్షి):** జడ్చర్ల గీతశ్రీ హైస్కూల్ కరస్పాండెంట్ వి. శంకర రెడ్డి డైనమిక్ స్కూల్ అవార్డు అందుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో ఎడ్యుకేషనల్ న్యూస్ నెట్‌వర్క్ నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు ఆయనకు ఈ అవార్డును అందజేశారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు ఈ గుర్తింపు లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. పురస్కారం పాఠశాల పట్ల తన బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులోనూ విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని శంకర రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బాలరాజు, డైరెక్టర్ రాజేశ్వరి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.




# జ్ఞానేశ్వర్ కాదు.. అజ్ఞానేశ్వర్: శివసేన రెడ్డి

**ఓట్ల తొలగింపును అడ్డుకుంటాం.. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం ఆగదు**

**45 వేల ఓట్ల తొలగింపునకు కుట్ర జరుగుతోందని ఆరోపణ**

**వనపర్తి బ్యూరో అక్టోబర్ 7 జనంసాక్షి :** ఓట్ల తొలగింపు అంశంపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇండియా కూటమి, అఖిలపక్ష పార్టీల నాయకులు భారీ నిరసన చేపట్టారు. బుధవారం నాడు వనపర్తి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించిన అనంతరం సమీకృత కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సీఈసీ జ్ఞానేశ్వర్‌కుమార్, బీజేపీ నాయకుల దిష్టిబొమ్మలను దహనం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శివసేన రెడ్డి మాట్లాడుతూ.. "జ్ఞానేశ్వర్‌కుమార్ కాదు.. అజ్ఞానేశ్వర్‌కుమార్" అంటూ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బీజేపీకి ఓట్లు వేయని వారి ఓట్లను ఫామ్--6 పేరుతో తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన వయోజన ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, అర్హులైన ఓటర్ల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 వయోజన ఓటు హక్కుకు హామీ ఇస్తోందని పేర్కొన్నారు. తొలగించిన ఓట్లను పునరుద్ధరించే వరకు కాంగ్రెస్, ఇండియా కూటమి పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**45 వేల ఓట్ల తొలగింపునకు కుట్ర :** నియోజకవర్గంలో సుమారు 2.75 లక్షల ఓట్లు ఉండగా.. అందులో 45 వేల ఓట్లను తొలగించేందుకు కుట్ర జరుగుతోందని శివసేన రెడ్డి, అఖిలపక్ష నాయకులు ఆరోపించారు. బతికున్న ప్రజల ఓట్లను తొలగించడం, అర్హులైన ఓటర్లను జాబితా నుంచి తొలగించడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు.బీజేపీని ప్రశ్నించే సాధారణ పౌరుల ఓట్లను తొలగించే హక్కు ఎవరికీ లేదన్నారు. ఎన్నికల వ్యవస్థలో తీసుకొచ్చిన మార్పులను అడ్డం పెట్టుకుని బీజేపీ శాశ్వతంగా అధికారంలో కొనసాగేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా నుంచి సమీకృత కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లిన నాయకులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభికి అఖిలపక్ష నాయకులతో కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్టాంజనేయులు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జబ్బర్, సీపీఐ జిల్లా కార్యదర్శి జయరాములు, సీపీఐ కార్యవర్గ సభ్యులు రమేష్, తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు ఖాదర్ బాషా, సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి అరుణ్‌కుమార్, గణేష్, ఎంఐఎం, సమాజ్‌వాది పార్టీ నాయకులు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, మాజీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, పట్టణ అధ్యక్షుడు కదిరే రాములు, కౌన్సిలర్లు ధనలక్ష్మి, విజయలక్ష్మి, ఎస్సీ డిపార్ట్మెంట్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, మహిళా జిల్లా అధ్యక్షురాలు శ్రీలత రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు వాల్యానాయక్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# గుప్తనిధుల కోసం అర్ధరాత్రి క్షుద్ర పూజలు

**రాజోళి, అక్టోబర్ 7 (జనంసాక్షి):** మండలంలోని తూర్పు గార్లపాడు ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం క్షుద్ర పూజలు నిర్వహించిన ఘటన కలకలం రేపింది. స్థానికుల సమాచారం మేరకు..కారులో వచ్చిన వ్యక్తులు ముందుగా పూజలు నిర్వహించి, అనంతరం గుప్తనిధుల కోసం తవ్వకాలకు ప్రయత్నించినట్లు స్థానికులు తెలిపారు. బుధవారం ఉదయం స్థానికులు వెంటనే రాజోలి ఎస్సైకి సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడ కనిపించిన ఆనవాళ్లను పరిశీలించి వివరాలను సేకరించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

# సబ్ స్టేషన్ వద్ద రాపర్తి రైతుల నిరసన



**కల్వేర్,అక్టోబర్ 08 (జనం సాక్షి)** నాణ్యమైన కరెంటు ఇవ్వాలని, కరెంటు కష్టాలు తీర్చాలని కోరుతూ రాపర్తి గ్రామ రైతులు బుధవారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. పెద్ద ఎత్తున రైతులు, గ్రామస్తులు, యువకులు సబ్ స్టేషన్ ఎదుట బైఠాయించి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గత కొంతకాలంగా గ్రామంలో సరైన విద్యుత్ సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. తక్కువ వోల్టేజీతో వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని, తరచూ కరెంటు కోతలతో పంటలకు సకాలంలో నీరు పెట్టలేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో కరెంటు లేకపోవడంతో పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గృహ అవసరాలకు కూడా కరెంటు సరిగా ఉండడం లేదని తెలిపారు. పలుమార్లు విద్యుత్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సబ్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ గారు స్పందించి రాపర్తి గ్రామానికి నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామని, వోల్టేజ్ సమస్యను తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు నిరసన విరమించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నాణ్యమైన కరెంటు ఇచ్చి రైతులను ఆదుకోవాలని, లేనిపక్షంలో మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని రైతులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాపర్తి గ్రామ రైతులు, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంగన్వాడీ టీచర్ల భర్తీ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా




**నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 07 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లాలో 89 అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియను ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో అంగన్వాడీ టీచర్ల పోస్టుల భర్తీ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల వారీగా అందిన దరఖాస్తుల వివరాలు, అర్హతల పరిశీలన, ధ్రువీకరణ పత్రాల వెరిఫికేషన్ తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అంగన్వాడీ టీచర్ల భర్తీ ప్రక్రియలో అర్హత కలిగిన అభ్యర్థులకు న్యాయం జరిగేలా నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ, ప్రతి దశను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. దరఖాస్తుదారులు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలను పకడ్బందీగా పరిశీలించాలని, ఎలాంటి సందేహాలకు అవకాశం లేకుండా అవసరమైన స్థాయిల్లో పత్రాలను మరోసారి ధ్రువీకరించుకోవాలని ఆదేశించారు. భర్తీ ప్రక్రియకు సంబంధించిన సమాచారం, తదుపరి దశల వివరాలను దరఖాస్తుదారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. మండల, గ్రామ స్థాయిల్లో సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అర్హత పత్రాల పరిశీలనను పూర్తి చేయాలని తెలిపారు. అంగన్వాడీ టీచర్ల భర్తీ ప్రక్రియ పూర్తిగా నిబంధనల ప్రకారమే, పారదర్శకంగా జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని, భర్తీ చేయిస్తామని చెప్పే వ్యక్తులకు ఎలాంటి డబ్బులు చెల్లించవద్దని ఆయన సూచించారు. భర్తీ ప్రక్రియకు సంబంధించి అధికారిక సమాచారం మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి వినూత్న, సీడీపీవోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్‌లో అయోధ్య రామ మందిరం!

- అద్భుతమైన సెట్టింగ్స్
- ప్రజలను ఆకర్షిస్తున్న పరిస్థితి
- ఓం చండేశ్వరి ఎగ్జిబిషన్ కు తరలివస్తున్న నగర ప్రజలు





**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 07 ( జనం సాక్షి) :** ఎక్కడో ఉన్నటువంటి అయోధ్య రామ మందిరాన్ని వెళ్లి చూడలేని వాళ్ళు వరంగల్లో చూడవచ్చు. ఆ అనుభూతిని ఆనందాన్ని పొందవచ్చు. వరంగల్ నగరంలోని హంటర్ రోడ్ లో ఓం చండేశ్వరి ఎగ్జిబిషన్ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్పర్సన్ గుండు సుధారాణి తదితరులు ప్రారంభించారు. ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసిన రామ మందిరం త పాటు పలు స్టాల్స్ ను చూసి ఆనందం వ్యక్తం చేశారు. నిర్వాహకులు గోపీనాథ్, వేణు పటేల్, శ్రీకాంత్, వరుణ్, రోహిత్, ఫెరోస్ తదితరులు ఎగ్జిబిషన్లో వరంగల్లో నెలకొల్పి వరంగల్ ప్రజల వినోదానికి విజ్ఞానానికి ఎంతో కృషి చేశారు. ప్రధానంగా ఎగ్జిబిషన్లో అయోధ్య రామ మందిరం, బటర్ఫ్లై ప్యాలెస్ తోపాటు జాయింట్ వీల్, సూపర్ హీరోస్ సెవెన్ జిస్, హ్యాండ్లూమ్, గేమ్ జోన్స్, కొలంబస్, జాయింట్ వీల్, ఎయిర్ బౌన్సర్ తోపాటు ప్రజలను అత్యంత ఆకర్షించేటువంటి అన్ని రకాల ఆహార పదార్థాలు సౌకర్యాలు ఎగ్జిబిషన్లో ఉన్నాయి. ప్రధానంగా ఎంత వ్యయంతో నెలల తరబడి నిర్మాణం చేసిన అయోధ్య రామ మందిరం విజిటర్స్ ను ఎంతగానో ఆకట్టుకుంటుంది. సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు ఈ ఎగ్జిబిషన్ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. 45 రోజులపాటు వరంగల్లో ఈ ఎగ్జిబిషన్ కనులవిందు చేయనున్నట్లు పేర్కొన్నారు.

# అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేత

- పర్యావరణానికి హాని చేస్తే కఠిన చర్యలు



**పెంచికల్‌పేట్, అక్టోబర్ 7 (జనంసాక్షి) :** జాతీయ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు పెంచికల్ పేట్ రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతంలో అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. అగర్‌గూడ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో గల 'కల్లు బాబా' గుడి పరిసరాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తాచెదారాన్ని అధికారులు, సిబ్బంది కలిసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వినియోగం వల్ల కేవలం మనుషులకే కాకుండా, మనుషులు అటవీ ప్రాంతాల్లో చేసే నిర్లక్ష్యపు పనుల వల్ల మూగ జంతువుల ఆవాసాలు కూడా తీవ్రంగా కలుషితం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దైవ దర్శనాలు, విహారయాత్రల కోసం అడవుల్లోకి వచ్చే ప్రజలు తమ వెంట తెచ్చుకున్న ప్లాస్టిక్ కవర్లు, సీసాలను అక్కడే పడేయడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని, వీటిని తినడం వల్ల వన్యప్రాణులు ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నాయని స్పష్టం చేశారు.

**భారీ జరిమానా, జైలు శిక్ష తప్పదు**

అటవీ ప్రాంతాలను ప్లాస్టిక్ రహితంగా ఉంచాలని, నిబంధనలు ఉల్లంఘించి అడవుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పడవేసి పర్యావరణానికి హాని కలిగించినట్లయితే అటవీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటువంటి వారిపై భారీ జరిమానా విధించడమే కాకుండా, అవసరమైతే జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేశారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, అటవీ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలందరూ సహకరించాలని అటవీ శాఖ ఈ ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో రేంజ్ సిబ్బంది డీఆర్వో అస్మా, ఖీూా లు అహ్మద్ అలీ, గోవిందు, బీట్ ఆఫీసర్స్ సంగదీప్,కళ్యాణ్, లచ్చన్న, స్వర్ణలత,శిరీష, అనిమల్ ట్రాకర్స్ పాల్గొన్నారు.

# నేరానికి కళ్లెం.. గ్రామానికి కన్ను

- ముధోల్ పోలీసుల 'థర్డ్ ఐ' విప్లవం
- ఖాకీ కన్ను తెరిస్తే... నేరం అక్కడే కాలిపోద్ది!
- ముధోల్ గడ్డపై సీసీ విప్లవానికి ఎస్పీ శ్రీకారం






**ముధోల్, అక్టోబర్ 07 (జనం సాక్షి) :** గ్రామాల్లో నేరం జరిగాక వెతకడం కాదు, నేరం జరగకుండా ముందే కట్టడి చేయడమే అసలైన పోలీసింగ్ అని నిరూపిస్తూ ముధోల్ పోలీసులు వినూత్న అడుగు వేశారు. ముధోల్ ఎస్ఐ బిట్లా పర్సిస్ చొరవ, గ్రామ సర్పంచులు, పెద్దల సహకారంతో ముధోల్ పీఎస్ పరిధిలోని చింత కుంట గ్రామంలో 20, వెంకటాపూర్ గ్రామంలో 7 సీసీ కెమెరాలను బుధవారం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ "ఇది కేవలం కెమెరా కాదు, గ్రామానికి కాపలా కాసే మూడో కన్ను. ఇలాంటి ముందు చూపుతో పనిచేస్తున్న ముధోల్ పోలీసులను, సహకరించిన సర్పంచులను, గ్రామ పెద్దలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను' అని ప్రశంసించారు. గ్రామాల భద్రతే లక్ష్యంగా ఎస్ఐ పర్సిస్ చేస్తున్న కృషిని గ్రామస్తులు కూడా కొనియాడారు. ఈ కార్యక్రమం పోలీస్-ప్రజా సంబంధాలకు ఒక మైలురాయిగా నిలిచింది.నిర్మల్ జిల్లాకే ఆదర్శంగా నిలిచిన ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ డా. జానకి శర్మిల, భైంసా ఏఎస్పీ పి. సాయికిరణ్ ముఖ్య అతిథులుగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వారి వెంట బాసర సీఐ దీపక్, లోకేశ్వరం ఎస్ఐ ప్రదీప్, ముధోల్ ఎస్ఐ బిట్లా పర్సిస్, నారీశక్తి టీం రాజమణి, ఆశు, సిబ్బంది సందీప్, రోహన్ పాల్గొన్నారు.



# నాటు సారా తయారీ చక్కెర పట్టివేత

**పెద్దవంగర, అక్టోబర్ 07(జనం సాక్షి) :** నాటుసారా తయారీకి వినియోగించే 600 కేజీల చక్కెరను సరఫరా చేస్తున్న వ్యక్తిని మండల పోలీస్ లు పట్టుకొని అరెస్ట్ చేశారు.ఎస్సై ప్రమోద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మొన్న తొర్రూర్ మండలంలోని అమర్సింగ్ తండకు చెందిన ఇద్దరు యువకులు పెద్దవంగర మండలంలో 15లీటర్ల గుడుంబను సరపర చేస్తుండగా పట్టుకొని నాటుసారకు ఉపయోగించే బెల్లం ఎక్కడి నుండి తెస్తున్నారని అడగక బెల్లం కాదు చక్కెర అని చెప్పడంతో ఆ షాప్ వివరాలు తెలుసుకోని తొర్రూర్ మండలంలోని శ్రీమాత ట్రేడర్స్ షాప్ ను తనిఖీ చేసి 12 బస్తాలు చక్కరను పట్టుకున్నారు. అనంతరం షాప్ నడుపుతున్న శ్రీధర్ ను అరెస్ట్ చేశామని తెలిపారు.

# పోలీసుల దాడిలో మూడు మొక్కలు స్వాధీనం

- నిందితుడిపై కేసు నమోదు



**చెన్నూర్ అక్టోబర్ 7(జనం సాక్షి) :** రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ ఆదేశాల మేరకు, టాస్క్‌ఫోర్స్, నార్కోటిక్స్ ఏసీపీ శ్రీనివాస్ రావు చెన్నూర్ రూరల్ సీఐ కృష్ణ ళ పర్యవేక్షణలో కోటపల్లి ఎస్ఐ శివనీతి రాజశేఖర్, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ జె. లక్ష్మణరావు లు పోలీసు సిబ్బంది తో కలిసి నమ్మదగిన సమాచారం మేరకు ఎదుల్లబందం గ్రామానికి చెందిన దుర్గం మహేష్ (33), తండ్రి: చంద్రయ్య ఇంటి ఆవరణలో తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో ఇంటి ఆవరణలో సాగు చేస్తున్న గంజాయి మొక్కలకు, మహేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడ సాగు చేస్తున్న మూడు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మొక్కలను వ్యవసాయ శాఖ ఏఈఓ పరిశీలించి అవి గంజాయి మొక్కలేనని నిర్ధారించారు. వీటిలో రెండు మొక్కలు 12 అంగుళాలు, మరో మొక్క 14 అంగుళాల ఎత్తు ఉన్నట్లు ఎస్ ఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న మూడు మొక్కల విలువ సుమారు రూ. 4,600 ఉంటుందని అంచనా వేశారు. గంజాయి సాగు, విక్రయాలు, రవాణా, వినియోగానికి పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగంగా అనుమానాస్పద కార్యకలాపాలపై ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ ఐ రాజశేఖర్ సూచించారు.

# ఇండోర్ స్టేడియం వల్ల క్రీడ కారులు శిక్షణ పొందవచ్చు



**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 07 ( జనం సాక్షి ) :** స్టేషన్ ఘనపూర్ మునిసిపాలిటీ పరిధిలోని నమిలిగొండ రోడ్ లో ఉన్న ఇండోర్ స్టేడియం ను తెరిచినట్లయితే క్రీడ కారులకు ఎంతో శిక్షణ పొందుతారని జాతీయ క్రీడకారులకు మంచి శిక్షణ దొరుకుతుంది అని జాతీయ పారా క్రీడ కారుడు సిద్దార్థ్ నాయక్ అన్నారు. బుధవారం సిద్దార్థ్ నాయక్ ఆధ్వర్యంలో క్రీడాకారులు ఇండోర్ స్టేడియంను సందర్శించారు. ఈ స్టేడియం లో క్రీడ కారులకు సంబంధించిన గ్రౌండ్ హాల్ , సామాగ్రి ఎండకు,వానకు అండగాఉండే గదులను పరిశీలించడం జరిగింది.

# ఎస్సీ కులాలలో రోస్టర్ విధానంలో మాలజాతికి అన్యాయం



**నేరడిగొండ అక్టోబర్7(జనంసాక్షి):** ఎస్సీ కులాలలో జరుగుతున్న రిజర్వేషన్లు కల్పించే రోస్టర్ విధానంలో మాలజాతికి అన్యాయం జరుగుతుందని మాల జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేష్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మాల ఉపకులాల సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఎస్సీ కులాలలో జరిగిన రోస్టర్ విధానంలో మాలజాతికి జరిగిన అన్యాయ విషయాన్నీ జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్ తెలియజేసినారు, ఉద్యగాలలో, పిల్లలకు చదువులో వర్తించే రిజర్వేషన్లలో నష్టాలను చర్చించారు.ఈనెల 11 వ, తేదీ రోజు జిల్లా మాల సంఘ భవనంలో రాష్ట్ర అధ్యక్షులు,రాష్ట్ర స్థాయి నాయకులు వస్తున్నారని,కాబట్టి అందరు రావాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నక్క మహేందర్ జిల్లా నాయకులు జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్, మాల ఉద్యోగుల సంఘం అసోసియేట్ అధ్యక్షులు బొమ్మెత సుభాష్, మాల సంక్షేమ సంఘం అసోసియేట్ అధ్యక్షులు ముచ్చ రఘు, సీనియర్ నాయకులు సింగరి అశోక్ సార్, మేధరి స్వామి సార్ నేరడి గొండ మండలం నాయకులు, వివిధ గ్రామ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు నక్క మహేందర్ అధ్యక్షులు, కుర్మే నారాయణ స్వామి ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యకులు మద్దెల నారాయణ స్వామి,సీనియర్ నాయకులు మద్దెల చందర్, దావుల ప్రశాంత్, దావుల శ్రీనివాస్, ఆకుల అశోక్, మద్దెల నారాయణ స్వామి, అనుపట్ల సంజీవ్, పట్టేపు మహేందర్ బోగి లక్ష్మణ్, ఉడుగుల అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ, దసరా ఉత్సవాలకు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలి

- వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని, హనుమకొండ జిల్లా కలెక్టర్



**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 7 (జనం సాక్షి) :** జిల్లాలో బతుకమ్మ, దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో ఏర్పాట్లను పూర్తిచేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ఈ నెల 10వ తేదీ నుండి 21 వరకు జరగనున్న బతుకమ్మ, దసరా ఉత్సవాలకు సంబందించి వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే ఏర్పాట్లపై సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించి మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, దేవాదాయ, ఇతర శాఖల అధికారులతో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సమీక్షించారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతీ పండుగకు సంబంధిత అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటే అన్నీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవచ్చన్నారు. అధికారులు సమన్వయంతో బాధ్యతయుతంగా విధులని నిర్వర్తించి బతుకమ్మ, దసరా ఉత్సవాలు ఘనంగా జరిగేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ. ఎంగిలి పూల బతుకమ్మ వేయి స్తంభాల గుడిలో.. అలాగే సద్దుల బతుకమ్మ వేడుకలు పద్మాక్షమ్మ ఆలయంలో జరుగుతాయాన్నారు. అధికారులు అప్పగించిన బాధ్యతలను సరిగ్గా నిర్వర్తించి ఉత్సవాలు విజయవం తంగా జరిగేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో భద్రకాళి ఆలయంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల గురించిన వివరాలను ప్రధానార్చకులు భద్రకాళి శేషు వివరించగా, వేయి స్తంభాల గుడి, పద్మాక్షమ్మ దేవాలయాలలో జరగనున్న బతుకమ్మ ఉత్సవాలను గురించి ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ, శంకర్ శర్మ అర్చకులు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రవి, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత , గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న , జడ్పీ సీఈఓ శేషాద్రి, డిఆర్డిఓ మేన శ్రీను, పరకాల, హనుమకొండ ఆర్డీవోలు వెంకన్న , వెంకటేష్ , దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సునీత, వివిధ శాఖల అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

# కాసిపేట గనిని సందర్శించిన సేఫ్టీ జనరల్ మేనేజర్

**కాసిపేట అక్టోబర్ 7 (జనం సాక్షి) :** కాసిపేట 1వ గని ని బెల్లంపల్లి రీజియన్ జనరల్ మేనేజర్ రఘు కుమార్ బుధవారం కాసిపేట 1వ గని ని సందర్శించారు. 3 సీఎం 13 డిస్ట్రిక్ట్‌ను సందర్శించి పనులను పరిశీలించారు. గని లో తీసుకుంటున్న రక్షణ చర్యలను పర్యవేక్షించి అధికారులకు, ఉద్యోగులకు సూచనలు చేశారు.రక్షణ విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని అన్నారు. సేఫ్టీ జనరల్ మేనేజర్ తో ఏరియా రక్షణాధికారి వేములు మురళి,మేనేజర్ సతీష్, రక్షణాధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# నకిలీ లోన్ ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- సైబర్ నేరాలపై అవగాహన కు ప్రత్యేక ప్రచారం
- పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా ఎస్పి కేకాన్ సుధీర్ రామనాథ్



**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 7 (జనం సాక్షి):** సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ చేపట్టిన ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో సైబర్ మోసాల నివారణపై రూపొందించిన అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తక్షణ రుణాలు, తక్కువ వడ్డీ రుణాలు, నిమిషాల్లో లోన్ మంజూరు అంటూ సైబర్ నేరగాళ్లు ప్రజలను ఆకర్షించి,లోన్ ప్రాసెసింగ్ ఫీజు, అడ్వాన్స్ ఫీజు,జీఎస్టీ తదితర పేర్లతో ముందుగా డబ్బులు చెల్లించాలని కోరుతున్నారని తెలిపారు. ఇలాంటి నకిలీ లోన్ ఆఫర్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అత్యవసర పరిస్థితుల్లోనూ తొందరపడి ముందస్తు చెల్లింపులు చేయవద్దు. ముందుగా ఆఫర్‌ను పరిశీలించాలి.రుణదాత వివరాలను ధృవీకరించాలి.అధికారిక సంస్థల ద్వారా మాత్రమే రుణ సేవలను పొందాలి" అని ఎస్ పి సూచించారు.ప్రజలు అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్, మెసేజ్‌లు లేదా లోన్ యాప్‌లకు తమ బ్యాంకు ఖాతా వివరాలు, ఓటిపి లు, పాస్‌వర్డ్‌లు,వ్యక్తిగత సమాచారాన్ని వెల్లడించవద్దని తెలిపారు.ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని, అలాగే www.cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేయడం ద్వారా డబ్బును నిలిపివేసే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ డీసీఆర్‌బీ కిషోర్ కుమార్,ములుగు సీఐ దారం సురేష్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్,వెంకటాపూర్ ఎస్ఐ చల్లా రాజు, డీసీఆర్‌బీ ఎస్ఐ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఐఐఎఫ్‌ఎం భోపాల్ బృందం మేడారం పర్యటనకు ఏర్పాట్లు




**మేడారం(ములుగు),అక్టోబర్ 7(జనం సాక్షి):** గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం, అటవీ ఆధారిత జీవనోపాధి తదితర అంశాలపై క్షేత్రస్థాయి అధ్యయనంలో భాగంగా ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్మెంట్ (ఐఐఎఫ్ఎం), భోపాల్ కు చెందిన ప్రొఫెసర్ శరదిందు పాండే, టీం మేడారంలోని శ్రీ సమ్మక్క సారలమ్మ ఆదివాసీ మ్యూజియాన్ని సందర్శించారు. ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సూచనల మేరకు ఐఐఎఫ్ఎం బృందం మేడారం పర్యటనకు అవసరమైన ఏర్పాట్లు చేయగా మ్యూజియంలో గిరిజనుల సంప్రదాయ జీవన విధానం,సంస్కృతి, కళలు,ఆచారాలు,అటవీ ఆధారిత జీవనోపాధికి సంబంధించిన ప్రదర్శనలను బృందం పరిశీలించింది.ఈ సందర్భంగా మ్యూజియంలో ప్రదర్శిస్తున్న గిరిజన సంప్రదాయ వస్తువులు,కళాకృతులు, ఆచారాలు, జీవన విధానానికి సంబంధించిన అంశాలను పరిశీలించి, తెలంగాణ గిరిజన ప్రాంతాల ప్రత్యేకతలు, సంస్కృతి పరిరక్షణకు చేపడుతున్న చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. ఐఐఎఫ్ఎం బృందం పర్యటనలో భాగంగా గిరిజనుల అభివృద్ధి, అటవీ ఉత్పత్తుల సేకరణ,విలువ జోడింపు,ఎకోటూరిజం, గిరిజన సంస్కృతి పరిరక్షణ వంటి అంశాలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేస్తోంది.ఈ పర్యటన ద్వారా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన అనుభవాలను పరస్పరం పంచుకునే అవకాశం ఏర్పడింది.




## కోదాడ విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట
# రైతుల ఆందోళన

**కోదాడ(జనంసాక్షి):** విద్యుత్ కోతల వల్ల చేతికొచ్చిన వరి పైర్లు ఎండిపోతున్నాయని ఆగ్రహిస్తూ కోదాడ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బుధవారం అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు బొల్లు ప్రసాద్ నాయకత్వంలో రైతులు సబ్‌స్టేషన్ ముందు ట్రాక్టర్లను అడ్డుగా పెట్టి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు బొల్లు ప్రసాద్ మాట్లాడుతూ ఎడాపెడా విద్యుత్ కోతలు విధించడం వల్ల పొలాలకు నీళ్లు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిరంతర విద్యుత్ సరఫరా లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని మండిపడ్డారు. విద్యుత్ కోతల కారణంగా ఎండిపోయిన పంటలకు ఎకరాకు 30,000 చొప్పున పరిహారం చెల్లించాలని, అలాగే పంటలను కాపాడేందుకు వెంటనే 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకుంటే ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో రైతులు కమతం వెంకటరావు, కుటుంబరావు, సైదయ్య, సామినేని సుబ్బారావు, సతీష్, నగేష్,కనగాల పూర్ణ, కొండయ్య, నాగుల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్



**నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 7,(జనం సాక్షి):** 2026--27 సంవత్సరానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు పత్తిని కొనుగోలు చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పత్తి మద్దతు ధర కొనుగోళ్లపై మార్కెటింగ్, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారు 5,93,795 ఎకరాల్లో పత్తి సాగు అవుతుండగా, సుమారు 3,56,257 మెట్రిక్ టన్నుల పత్తి మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. జిల్లాలో 26 జిన్నింగ్ మిల్లులు ఉండగా, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో 10 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం పత్తికి క్వింటాల్‌కు రూ.8,667 మద్దతు ధర ప్రకటించిందని, తేమశాతం 8 వరకు ఉంటే ఈ ధర లభిస్తుందని కలెక్టర్ తెలిపారు. రైతులకు కపాస్ కిసాన్ యాప్, పత్తి నాణ్యత ప్రమాణాలు, కొనుగోలు కేంద్రాల వివరాలు, కొనుగోలు రోజులు, సెలవుల వివరాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో నెల రోజుల ముందస్తు షెడ్యూల్, మద్దతు ధర, తేమశాతం తదితర వివరాలను ఫ్లెక్సీల ద్వారా ప్రదర్శించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, టాయిలెట్లు, నీడ, అవసరమైతే రాత్రి బస సౌకర్యం, మైక్ ఏర్పాటు చేయాలని, పోలీస్ పికెటింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పత్తి విక్రయించిన రైతులకు తక్షణమే చెల్లింపులు జరిగేలా సీసీఐ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ట్రాన్స్‌పోర్ట్ పేరుతో డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు:**

డిండి, చారగొండ ప్రాంతాల్లో ట్రాన్స్‌పోర్ట్ పేరుతో కొందరు డబ్బులు వసూలు చేస్తున్నారన్న జిన్నింగ్ మిల్లుల యజమానుల ఫిర్యాదుపై కలెక్టర్ తీవ్రంగా స్పందించారు. రైతులు, మిల్లర్లు, వాహనదారుల నుంచి ఎవరైనా అక్రమంగా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ అంశంపై ప్రత్యక్షంగా తనిఖీలు నిర్వహించి నివేదిక ఇవ్వాలని జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారిని ఆదేశించారు. స్థానిక పోలీసులు కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి పత్తి కొనుగోలు కేంద్రానికి తహసిల్దార్, మండల వ్యవసాయ అధికారి, ఏఈఓ, ఎస్ఐ, మార్కెటింగ్ సెక్రటరీ, సీసీఐ ప్రతినిధి, రైతుల తరపున ఒకరితో స్థానిక కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రెండు రోజుల్లో కమిటీ సమావేశాలు నిర్వహించి రైతులకు కపాస్ కిసాన్ యాప్, పత్తి నాణ్యత ప్రమాణాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, అదనపు ఎస్పీ రమేష్, సీసీఐ అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ దిలీప్, మార్కెటింగ్ శాఖ ఏడీ ఛాయాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, జిన్నింగ్ మిల్లుల యజమానులు, మార్కెటింగ్, లీగల్ మెట్రాలజీ, ఫైర్, ట్రాన్స్‌పోర్ట్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# తాగునీటి కోసం రోడ్డెక్కిన గ్రామస్తులు

### ఏడు రోజులుగా నీటి సరఫరా బంద్
### కలుషిత నీటితో చర్మవ్యాధుల ఇబ్బందులు
### ఖాళీ బిందెలతో రాస్తారోకో..
### తాత్కాలికంగా ట్యాంకర్ నీటి సరఫరా



**బూర్గంపహాడ్ అక్టోబరు 07 (జనంసాక్షి) :** తాగునీటి సమస్య పరిష్కారం కాకపోవడంతో సారపాకలోని ముత్యాలమ్మ గుడి ప్రాంతానికి చెందిన గ్రామస్తులు రోడ్డెక్కారు. గత ఏడు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ బుధవారం మెయిన్ రోడ్డుపై ఖాళీ బిందెలతో బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. తమ ప్రాంతంలోని బావి, బోరు నుంచి మోటార్ ద్వారా వస్తున్న నీరు మురికిగా ఉండటంతో వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. ఆ నీటిని ఉపయోగించడం వల్ల చిన్నారులతో పాటు పలువురికి దురదలు, చర్మ సంబంధిత సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఇప్పటికే పలువురు పిల్లలు చర్మవ్యాధులతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తమ తాగునీటి సమస్యను జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా కొంతకాలం నీటి సరఫరా అందిందని గ్రామస్తులు తెలిపారు. అయితే ప్రస్తుతం మళ్లీ ఏడు రోజులుగా నీరు రావడం లేదన్నారు. పంచాయతీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. సుమారు గంటపాటు గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించడంతో ఇరువైపులా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు.

**రేపటి నుంచి పైపులైన్ పనులు**

గ్రామస్తుల ఆందోళన నేపథ్యంలో పంచాయతీ అధికారులు తాత్కాలికంగా వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. కాగా, ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి వివరణ ఇస్తూ పై నుంచి తగినంత నీరు సరఫరా కాకపోవడంతో వాటర్ ట్యాంకులు పూర్తిస్థాయిలో నిండడం లేదని, దీంతో నీటి కొరత ఏర్పడిందని తెలిపారు. ముత్యాలమ్మ గుడి ప్రాంతానికి ప్రత్యేకంగా పైపులైన్ ఏర్పాటు చేయనున్నామని, గురువారం నుంచే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. అయితే తాత్కాలిక చర్యలతో పాటు కలుషిత నీటి సమస్యను కూడా పరిష్కరించి, తమకు శాశ్వతంగా స్వచ్ఛమైన తాగునీరు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.




# బడి బోర్డుపై అక్షరం సరిదిద్దిన అధికారులు

## జనంసాక్షి వార్తకు స్పందన




**మాడుగులపల్లి అక్టోబర్ 7(జనం సాక్షి):** ప్రజా సమస్యలను వెలికితీస్తూ అధికారులను మేల్కొలపడంలో జనం సాక్షి దినపత్రిక మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండల పరిధిలోని తోపుచర్ల గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీస్) నేమ్‌బోర్డుపై ప్రాథమిక అనే పదంలో 'క' అక్షరం లోపించిన అంశంపై జనం సాక్షి లో ప్రచురితమైన ప్రత్యేక వార్తా కథనానికి విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించారు ఈ కథనం ప్రచురితమైన కొన్ని గంటల వ్యవధిలోనే విద్యాశాఖ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు వేగంగా స్పందించి చర్యలు చేపట్టారు నేమ్‌బోర్డుపై లోపించిన 'క' అక్షరాన్ని వెంటనే సరిచేసి, ప్రాథమిక పాఠశాల అని సరైన అక్షరక్రమంతో బోర్డును పునరుద్ధరించారు. పాఠశాల ముఖద్వారంలో ఉన్న అక్షరదోషాన్ని స్పష్టంగా గుర్తించి, కథనాన్ని ప్రచురించి అధికారుల్లో చలనం తీసుకొచ్చిన జనం సాక్షి దినపత్రికకు, అలాగే వార్తకు తక్షణమే స్పందించి తప్పును సరిదిద్దిన స్థానిక విద్యాశాఖ అధికారులకు తోపుచర్ల గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# చిరు వ్యాపారులపై అధికారుల ఆగ్రహం

### ఎమ్మెల్యే అనుచరులమంటూ కొందరి దౌర్జన్యం?
### 30 ఏళ్లుగా టీ కొట్టు నడుపుతున్న నిరుపేదపై చర్యలతో ఆందోళన

**వైరా (జనంసాక్షి) :** రోడ్డు పక్కన చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న చిరు వ్యాపారులపై అధికారుల చర్యలు ఇప్పుడు వైరాలో చర్చనీయాంశంగా మారుతున్నాయి. తల్లాడ రోడ్డులోని సాయిబాబా ఆలయం సమీపంలో గత సుమారు 30 సంవత్సరాలుగా టీ కొట్టు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న గండుగలపాడు గ్రామానికి చెందిన ఓ చిరు వ్యాపారిపై ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు తీవ్ర చర్చకు దారితీశాయి. స్థానికుల కథనం ప్రకారం.. సదరు వ్యాపారి రోడ్డు పక్కన ఉన్న పొలంలో చిన్నపాటి బడ్డీ కొట్టు ఏర్పాటు చేసుకుని మూడు దశాబ్దాలుగా జీవనం సాగిస్తున్నారు. అయితే కొందరు వ్యక్తులు తాము ఎమ్మెల్యే అనుచరులమంటూ అక్కడికి వచ్చి బడ్డీ కొట్టును తొలగించేందుకు ఒత్తిడి తీసుకువచ్చారని బాధితులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా బడ్డీ కొట్టు సమీపంలోని వీధిలైటుకు సంబంధించిన విద్యుత్ కనెక్షన్‌ను కూడా తొలగించేందుకు ప్రయత్నించారని చెబుతున్నారు. ఈ వ్యవహారంలో ఇరిగేషన్ అధికారుల తీరుపైనా పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత వ్యక్తుల ఒత్తిళ్లకు అనుగుణంగా అధికారులు వ్యవహరించారని, చిరు వ్యాపారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బడ్డీ కొట్టును తొలగించేందుకు చర్యలు చేపట్టారని బాధిత వర్గాలు ఆరోపిస్తున్నాయి. బడ్డీ కొట్టును తొలగించడం, రేకులను పడేయడం వంటి చర్యలతో పాటు తమను భయభ్రాంతులకు గురిచేశారని బాధితులు వాపోతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. చిరు వ్యాపారి ఏర్పాటు చేసుకున్న స్థలం ప్రభుత్వ పరిధిలోనిదా, ఇరిగేషన్ శాఖకు సంబంధించినదా, లేక ప్రైవేట్ భూమా అనే విషయాన్ని అధికారులు స్పష్టంగా వెల్లడించాల్సిన అవసరం ఉంది.

స్థలం ఆక్రమణకు సంబంధించిన సమస్య ఉంటే నిబంధనల ప్రకారం ముందస్తు నోటీసులు ఇచ్చి, హద్దులు నిర్ధారించి చర్యలు తీసుకోవా ల్సిందేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో అధికారిక ఆదేశాలు లేకుండా ఎవరైనా వ్యక్తులు తమకు రాజకీయ పెద్దల అండ ఉందంటూ నిరుపేద చిరు వ్యాపారులపై ఒత్తిడి తీసుకురావడం సరికాదనే అభిప్రా యాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల వెంబడి చిన్నచిన్న వ్యాపారాలు నిర్వహిస్తూ వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వారికి కూడా జీవనోపాధి కొనసాగించుకునే హక్కు ఉందని, నిబంధనలు ఉల్లంఘించినట్లయితే చట్టబద్ధమైన ప్రక్రియ ద్వారా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. స్థలానికి హద్దులు నిర్ణయించి, నిబంధనల ప్రకారం వ్యవహరించాలి. నిరుపేదల జీవనోపాధిని దెబ్బతీసేలా వ్యవహరించకూడదు" అని స్థానికులు కోరుతున్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, బాధిత చిరు వ్యాపారికి న్యాయం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.




# కులం పేరుతో దూషించి దాడి

### నిందితుడు అరెస్ట్
### వివోఏ పై దాడి కేసులో కొప్పుల అమర్నాథ్‌కు రిమాండ్

**చింతపల్లి, అక్టోబర్ 07 (జనంసాక్షి) :** చింతపల్లి మండలం పి.కె. మల్లేపల్లి గ్రామంలో మహిళా వీఓఏపై కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడిన కేసులో కొప్పుల అమర్నాథ్‌ను చింతపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. అక్టోబర్ 2న గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామసభ జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు చింతపల్లి పోలీస్‌స్టేషన్‌లో భారతీయ న్యాయ సంహిత (బి.ఎన్.ఎస్), 2023తో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడిని అరెస్ట్ చేసి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. మహిళలు, అణగారిన వర్గాలపై దాడులు, వేధింపులకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు, హెచ్చరించారు.. వారి వెంట నాంపల్లి సీఐ రాజు, చింతపల్లి ఎస్సై ముత్యాల రామ్మూర్తి, వున్నారు

# అనుమతుల్లేకుండానే స్తంభాలకు ఫ్లెక్సీలు

### మాడుగులపల్లి మండల కేంద్రంలో నిబంధనల ఉల్లంఘన
### అనుమతులు తీసుకోలేదని స్పష్టంచేసిన పంచాయతీ కార్యదర్శి





**మాడుగులపల్లి, అక్టోబర్ 07 (జనంసాక్షి) :** మాడుగులపల్లి మండల కేంద్రంలో వ్యాపార ప్రకటనల పేరిట నిబంధనలను బొందపెడుతున్నారు ఇటీవల ఒక షాపింగ్ మాల్‌కి సంబంధించిన నిర్వాహకులు ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండానే గ్రామ పరిధిలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలకు భారీ ఫ్లెక్సీలను కట్టడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది ప్రభుత్వ నిబంధనల ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో గానీ, విద్యుత్ స్తంభాలపై గానీ ప్రకటనలు (ఫ్లెక్సీలు/బ్యానర్లు) ఏర్పాటు చేయాలంటే గ్రామ పంచాయతీ నుంచి రాతపూర్వక అనుమతి పొందడంతో పాటు నిర్ణీత రుసుము చెల్లించాల్సి ఉంటుంది అంతేకాకుండా, విద్యుత్ శాఖ అధికారుల సమన్వయం లేకుండా స్తంభాలకు ఫ్లెక్సీలు కట్టడం వల్ల ఈదురుగాలులు వీచినప్పుడు వైర్లు తెగిపడి ప్రమాదాలు జరిగే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు గ్రామ పంచాయతీకి రావాల్సిన ఆదాయానికి గండి కొడుతూ, భద్రతా ప్రమాణాలను పక్కనబెట్టి వ్యాపార ప్రకటనలు ఏర్పాటు చేస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

**పరిశీలించి తొలగిస్తాం : పంచాయతీ కార్యదర్శి శ్రవణ్**

విద్యుత్ స్తంభాలకు కట్టిన ఫ్లెక్సీల వ్యవహారంపై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా సదరు షాపింగ్ మాల్ యాజమాన్యం గ్రామ పంచాయతీ నుండి ఎటువంటి అనుమతులు తీసుకోలేదని స్పష్టం చేశారు అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే తొలగిస్తామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

# సీతారామ ప్రాజెక్టు కింద భూములు కోల్పోయే రైతులకు మెరుగైన నష్టపరిహారం చెల్లిస్తాం

### భూసేకరణ సర్వేకు రైతులు సహకరించాలి : సీతారామ ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సదానందం



**కామేపల్లి,అక్టోబర్ 7 (జనం సాక్షి) :** సీతారామ ప్రాజెక్టు కాలువల కింద భూములు కోల్పోయే రైతులకు మెరుగైన నష్టపరిహారం చెల్లిస్తామని రైతులందరూ భూ సేకరణ సర్వేకు సహకరించాలని సీతారాం ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సదానందం విజ్ఞప్తి చేశారు. బుధవారం మండలంలోని కొమ్మినేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన కొండాయిగూడెం, కొమ్మినేపల్లి, రెవెన్యూ గ్రామాల సీతారామ ప్రాజెక్ట్ కాలువల రైతుల భూసేకరణ అవగాహన సభలోఆయన పాల్గొని మాట్లాడుతూ 2 వేల కోట్లతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టు ద్వారా పదివేల ఎకరాల సాగు భూమికి గోదావరి జలాలు అందించడం జరుగుతుందని వెల్లడించారు. కొమ్మినేపల్లి, కొండాయిగూడెం రెవెన్యూ గ్రామాల పరిధిలో కాలువల నిర్మాణాలకు 100 ఎకరాలు భూమిని సేకరించనున్నట్లు వెల్లడించారు. రైతులు నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం భూమి విలువకు అదనంగా మూడు రేట్లు రైతులకు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. భూమితో పాటు అందులో ఉండే ఆస్తులకు కూడా విలువ కట్టించి పరిహారం అందించడం జరుగుతుందని వివరించారు . రైతులు అందుబాటులో ఉండి ఫీల్డ్ లో సర్వేకు సహకరించాలని తమ తమ భూముల వివరాలు నమోదు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాసరావు, సీతారామ ప్రాజెక్టు (ఇరిగేషన్) డిఈ మోతిలాల్, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్,గ్రామ సర్పంచ్ అనురాధ బాయి. ఉప సర్పంచ్ మేకల మల్లికార్జున్ రావు,జిపిఓ కందయ్య,గ్రామ పంచాయతీ కార్యదర్శి శంకర్, రెవిన్యూ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు కామేపల్లి, ముచ్చర్ల రెవెన్యూ పరిధిలో గ్రామసభలు

### మండల తహసిల్దార్ శ్రీనివాసరావు



సీతారామ ప్రాజెక్టు కాలువల భూసేకరణ ప్రక్రియలో భాగంగా నేడు గురువారం, మధ్యాహ్నం 12:00 గంటలకు ప్రత్యేక గ్రామసభలు నిర్వహించ నున్నట్లు కామేపల్లి తహసీల్దార్ ప్రకటనలో తెలిపారు. కామేపల్లి ముచ్చర్ల రెవెన్యూ గ్రామాల పరిధిలోని భూసేకరణపై చర్చించేందుకు ఉదయం 10 .గంటలకు ముచ్చర్ల గ్రామపంచాయతీలో కార్యాలయంలో గ్రామసభ మరియు కామేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మధ్యాహ్నం 1.గంటకు ఈ సంయుక్త సమావేశం జరగనుంది. ఈ కార్యక్రమానికి భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ (రెవెన్యూ) ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ప్రాజెక్టు కాలువల పరిధిలోకి వచ్చే కామేపల్లి, ముచ్చర్ల రెవెన్యూ గ్రామాల రైతులు, భూస్వాములు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలను తెలపాలని తహసీల్దార్ కోరారు.

# కలకలం రేపుతున్న అంగన్వాడీ టీచర్ అదృశ్యం



**బీబీనగర్ (జనంసాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లో అంగన్వాడీ టీచర్ అదృశ్యమైన ఘటన కలకలం రేపుతోంది. విధులకు వెళ్లిన అంగన్వాడి టీచర్ తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు తన ఆచూకీ కోసం ఎంత వెతికిన ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. బీబీనగర్ మండల కేంద్రానికి చెందిన అంగన్వాడీ టీచర్ బొల్లెడు ఐమావతి (54) గత 15 ఏళ్లుగా బీబీనగర్ లోని అంగన్వాడీ టీచర్గా పనిచేస్తుంది. రోజు మాదిరిగానే ఈ నెల 1వ తేదీన విధుల్లో భాగంగా అంగన్వాడీ కేంద్రానికి వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుండి బయలుదేరింది. తిరిగి హైమావతి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై తన ఆచూకీ కోసం వెతికసాగారు. కానీ గత ఆరు రోజులుగా ఆమె ఆచూకీ లభించకపోవడంతో హైమావతి కుమారుడు సందీప్ స్థానిక పోలీస్ స్టేషన్ లో తన తల్లి మిస్ అయినట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అంగన్వాడి టీచర్ మిస్సింగ్ పట్ల అప్రమత్తమైన పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఐమావతి ఆచూకీ తెలిసిన వారు బీబీనగర్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# 8-12 శాతంలోపు తేమ ఉండేలా పత్తిని సిద్ధం చేసుకోవాలి

- పత్తి రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలి
- దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- కౌలు రైతులు తాత్కాలిక రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్-07 (జనంసాక్షి) :** 2026-27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ద్వారా పత్తిని కనీస మద్దతు ధర క్రింద విక్రయించేందుకు రైతులు పత్తిని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సిద్ధం చేసుకుని తీసుకురావాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తి కొనుగోళ్ల సమయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

**8 జిన్నింగ్ మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై**

2026-27 సీజన్‌లో ఖమ్మం జిల్లాలో పత్తి కొనుగోళ్ల కోసం 8 జిన్నింగ్ మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఖమ్మం, మద్దులపల్లి, మధిర, వైరా ప్రాంతాల్లోని నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులు పత్తిని తీసుకువచ్చే ముందు తమకు సంబంధించిన కొనుగోలు కేంద్రం, జిన్నింగ్ మిల్లు వివరాలను ముందుగానే తెలుసుకోవాలని కలెక్టర్ సూచించారు. నోటిఫై చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పత్తిని విక్రయించి కనీస మద్దతు ధర ప్రయోజనం పొందాలని తెలిపారు. పత్తిలో తేమ శాతం నాణ్యత, ధరపై ప్రభావం చూపుతున్నందున రైతులు పత్తిని మార్కెట్‌కు తీసుకువచ్చే ముందు తేమ శాతాన్ని తప్పనిసరిగా పరీక్షించుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని 129 రైతు వేదికల్లో మాయిశ్చర్ మీటర్ల ద్వారా పత్తిలో తేమ శాతాన్ని పరీక్షించుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. రైతులు తాము పండించిన పత్తిని సాధ్యమైనంత వరకు 8 శాతం లోపు తేమ ఉండేలా ఆరబెట్టి తీసుకురావాలని సూచించారు. 8 శాతానికి మించి తేమ ఉన్నప్పుడు ప్రతి అదనపు ఒక్క శాతం తేమకు రూ.86.67 చొప్పున ధరలో తగ్గింపు ఉంటుందని అధికారులు తెలిపారు. పత్తిని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సిద్ధం చేసుకుని తీసుకురావడం ద్వారా ధరలో కోతను నివారించవచ్చని అన్నారు.

**కౌలు రైతులు తాత్కాలిక రిజిస్ట్రేషన్ చేసుకోవాలి**

కౌలు రైతులు సిసిఐ ద్వారా కనీస మద్దతు ధర క్రింద పత్తిని విక్రయించేందుకు అవసరమైన తాత్కాలిక రిజిస్ట్రేషన్ ప్రక్రియను ముందుగానే పూర్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమీపంలోని వ్యవసాయ విస్తరణ అధికారి, మండల వ్యవసాయ అధికారి లేదా జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని సంప్రదించి అవసరమైన వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. సిసిఐ ద్వారా పత్తి విక్రయించే సమయంలో రైతు ఆధార్ ధృవీకరణ తప్పనిసరిగా చేయించుకోవాలని కలెక్టర్ తెలిపారు.

**కపాస్ కిసాన్' యాప్ ద్వారా స్లాట్ బుకింగ్**

2026--27 సీజన్‌లో సిసిఐ ద్వారా కనీస మద్దతు ధర క్రింద పత్తిని విక్రయించేందుకు రైతులు 'కపాస్ కిసాన్' మొబైల్ యాప్‌ను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. మొబైల్ నంబర్, ఓటిపి ద్వారా యాప్‌లో లాగిన్ అయి సిసిఐ కి పత్తి విక్రయించేందుకు స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. కపాస్ కిసాన్ యాప్ ద్వారా కొనుగోలు కేంద్రాల వివరాలు, పత్తి విక్రయ వివరాలు, తక్పట్టి, చెల్లింపులు తదితర వివరాలను తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు. రైతులందరూ ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని కనీస మద్దతు ధర పథకం ప్రయోజనాలను పొందాలని సూచించారు. రైతుల సందేహాల నివృత్తికి వాట్సాప్ హెల్ప్‌లైన్ 8897281111, 'కపాస్ కిసాన్' యాప్ టోల్‌ఫ్రీ నంబర్ 18005995779 ను సంప్రదించాలని తెలిపారు. పత్తి కొనుగోళ్ల ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు సమన్వయంతో కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి, రైతులకు నాణ్యతా ప్రమాణాలు, తేమ శాతం, కొనుగోలు కేంద్రాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ముందుగానే అవగాహన కల్పించాలని సూచించారు.




# వడ్డీరేట్లు పెరిగాయ్..

## 0.25శాతం పెంచిన ఆర్‌బీఐ

అందరూ ఊహించిందే జరిగింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక వడ్డీరేట్లను సవరించింది. రెపో రేటును 25 బేసిస్ పాయింట్ల మేర పెంచింది. దీంతో రెపో రేటు 5.50శాతానికి చేరింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం వెల్లడించారు. 2023 ఫిబ్రవరి తర్వాత వడ్డీరేట్లను ఆర్‌బీఐ పెంచడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. తాజా నిర్ణయంతో రెపో రేటుతో ముడిపడి ఉన్న గృహ, వాహన రుణాలు ప్రియం కానున్నాయి. 2023 ఫిబ్రవరిలో చివరిసారిగా రెపో రేటును ఆర్‌బీఐ 0.25% పెంచి, 6.5 శాతానికి చేర్చింది. 2025లో వడ్డీ రేట్ల తగ్గింపు ప్రక్రియను ప్రారంభించే వరకు, 2023-24 ఆర్థిక సంవత్సరం అంతా ఈ రేటు అమలైంది. ఆ తర్వాత గతేడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఇక, డిసెంబరులో మరో పావుశాతం తగ్గించింది. దీంతో మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది. అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్, జూన్, ఆగస్టులో



జరిగిన సమీక్షల్లో వరుసగా నాలుగుసార్లు వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ యథాతథంగా ఉంచిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం పశ్చిమాసియా ఘర్షణల వల్ల, దేశీయంగా రిటెయిల్ ద్రవ్యోల్బణానికి ముప్పు పెరుగుతున్న వేళ.. ఆర్‌బీఐ ఈసారి వడ్డీరేట్లను సవరించింది.

**ఆర్‌బీఐ గవర్నర్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు..**

ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా స్థిర వైఖరి నుంచి కఠిన వైఖరికి మారాలని ద్రవ్య విధాన పరపతి సమీక్ష నిర్ణయించింది. ఇకపై రెపో రేటు పెంచడమో లేదా యథాతథంగా ఉంచడమో జరుగుతుంది. అంటే సమీప భవిష్యత్తులో రేట్ల కోత లేదన్నమాటే..! అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితి, సరఫరా గొలుసు సమస్యల కారణంగా దేశీయంగా ఆర్థిక కార్యకలాపాలపై కొంత ప్రతికూల ప్రభావం పడొచ్చు.

### ఫిక్స్‌డ్ డిపాజిట్ల వడ్డీ రేట్లు పెంచిన బజాజ్ ఫైనాన్స్

ఆర్‌బీఐ కీలక వడ్డీ రేట్లను పెంచిన విషయం తెలిసిందే. 25 బేసిస్ పాయింట్లు పెంచడంతో రెపోరేటు 5.25 నుంచి 5.50 శాతానికి చేరింది. ఈ నేపథ్యంలో ప్రముఖ బ్యాంకులు, ఇతర ఫైనాన్స్ సంస్థలు తమ ఫిక్స్‌డ్ డిపాజిట్ల వడ్డీ రేట్లను పెంచనున్నాయి. ఆర్‌బీఐ నిర్ణయం వెలువడగానే.. తొలుత నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ బజాజ్ ఫైనాన్స్ తన ఎఫ్‌డీ వడ్డీ రేట్లను పెంచుతున్నట్లు ప్రకటించింది. 15 నుంచి 40 బేసిస్ పాయింట్ల వరకు సవరించింది. కొత్త వడ్డీ రేట్లు అక్టోబర్ 7 నుంచే అమల్లోకి వచ్చాయి. సాధారణ పౌరులకు 31 నుంచి 60 నెలల కాలపరిమిత గల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై గరిష్ఠంగా 7.75 శాతం వడ్డీ లభిస్తుంది. గతంలో ఇది 7.40 శాతం. ఇదే వ్యవధులపై సీనియర్ సిటిజన్లకు 7.75 శాతం నుంచి 8.15 శాతం వడ్డీ లభిస్తుంది. 12 - 17 నెలల కాల వ్యవధిగల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేటును బజాజ్ ఫైనాన్స్ 20 బేసిస్ పాయింట్లు పెంచడంతో 6.80 శాతానికి చేరింది. సీనియర్ సిటిజన్లకు 6.95 శాతం నుంచి 7.40 శాతానికి పెంచింది. 18- 30 నెలల వ్యవధి గల ఎఫ్‌డీలపై 15 బేసిస్ పాయింట్లు పెంచడంతో వడ్డీ 7 శాతానికి చేరింది. సీనియర్ సిటిజన్లకు 7.40 శాతం వడ్డీ లభిస్తుంది. 31-60 నెలల కాలపరిమితి గల రుణాలపై వడ్డీ రేటును 40 బేసిస్ పాయింట్లు పెంచింది. దీంతో వడ్డీ రేటు 8.15 శాతానికి చేరింది. పాత డిపాజిట్లను రెన్యువల్ చేసుకునే ఖాతాదారులకు అదనంగా మరో 10 బేసిస్ పాయింట్ల వడ్డీని ఆఫర్ చేస్తోంది. 31 - 60 నెలల వ్యవధికి రెగ్యులర్ డిపాజిటర్లకు గరిష్ఠంగా 7.85 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.25 శాతం వరకు వడ్డీ అందుతుంది. కొత్త డిపాజిట్లకు, రెన్యువల్ డిపాజిట్లకు రెండింటికీ ఈ వడ్డీ రేట్లు వర్తిస్తాయి.

## పోస్ట్‌పెయిడ్ యూజర్లకు ఎయిర్‌టెల్ షాక్..

### ప్లాన్ ధరలు పెంపు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రముఖ టెలికాం కంపెనీ ఎయిర్‌టెల్ పోస్ట్‌పెయిడ్ యూజర్లకు షాకిచ్చింది. వాటి ప్లాన్ ధరలను రూ.50 చొప్పున పెంచింది. పెరిగిన ధరలు అక్టోబర్ 8 నుంచి అమల్లోకి రానున్నాయి. ప్రస్తుత పోస్ట్‌పెయిడ్ వినియోగదారులు నెల రోజుల్లో సమీప ప్లాన్‌కు అప్‌గ్రేడ్ అవుతారు. దీంతో పాటు పోస్ట్‌పెయిడ్ యూజర్లకు ఇంటర్నేషనల్ రోమింగ్ సదుపాయాన్ని ఉచితంగా అందిస్తోంది. సవరించిన ప్లాన్‌ల ప్రకారం.. ఎయిర్‌టెల్ వ్యక్తిగత పోస్ట్‌పెయిడ్ ప్లాన్‌లు ఇకపై రూ.499 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇద్దరికి రూ.749, ముగ్గురికి రూ.1049, నలుగురికి రూ.1249, రూ.1449, ఐదుగురు కుటుంబ సభ్యులు ఉన్నవారికి కనీసం రూ.1799 చెల్లించాల్సి ఉంటుంది. కాంప్లిమెంటరీగా అందిస్తున్న అంతర్జాతీయ రోమింగ్ ప్లాన్‌లో 5జీబీ డేటా, 60 నిమిషాల కాలింగ్, 25 ఎస్సెమ్మెస్‌లు ఐదు రోజుల పాటు ఉచితంగా లభిస్తాయి. ఎయిర్‌టెల్ పోస్ట్‌పెయిడ్ ఫ్యామిలీ ప్లాన్ కలిగిన కస్టమర్లందరూ ఇంటర్నేషనల్ రోమింగ్ ప్లాన్‌ను వినియోగించుకోవచ్చని ఎయిర్‌టెల్ ఓ ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే పోస్ట్‌పెయిడ్ వినియోగదారులకు ఫాస్ట్‌లేన్ టెక్నాలజీ (నెట్‌వర్క్ స్లైసింగ్), అపరిమిత డేటా, స్పామ్ ప్రొటెక్షన్ వంటి ప్రయోజనాలు లభిస్తున్నాయని, ఇంటర్నేషనల్ రోమింగ్ కొత్తగా యాడ్ అయ్యిందని భారతీ ఎయిర్‌టెల్ మార్కెట్ ఆపరేషన్స్ డైరెక్టర్ అమిత్ త్రిపాఠి పేర్కొన్నారు. మరో ప్రైవేటురంగ టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియా ఇంటర్నేషనల్ రోమింగ్ సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు ప్రకటించిన కొద్దిరోజులకే.. ఈ ప్రకటన రావడం గమనార్హం.

## అక్టోబరులో దేశంలో 1.23 లక్షల టెక్ ఉద్యోగాలు

టెక్నాలజీ రంగంలో ఉద్యోగ అవకాశాలు మళ్లీ పెరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా అక్టోబరులో 1.23 లక్షల టెక్ ఉద్యోగాలు అందుబాటులోకి వచ్చినట్లు 'ఎక్స్‌ఫెనో' సంస్థ తాజాగా విడుదల చేసిన నివేదికలో తెలిపింది. గత 18 నెలల్లో ఇదే అత్యధికమని పేర్కొంది. సెప్టెంబరుతో పోలిస్తే 5 శాతం, గతేడాది అక్టోబరుతో పోలిస్తే 17 శాతం వృద్ధి కనిపించిందని తెలిపింది. అయితే.. ఎక్కువ ఉద్యోగాలు అనుభవం ఉన్నవారికే లభిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. ఇందులో మధ్యస్థాయి నుంచి సీనియర్ లెవల్ ఉద్యోగాలు 68 వేల వరకు ఉన్నట్లు నివేదిక పేర్కొంది. మొత్తం ఉద్యోగాల్లో ఇవి 55 శాతం కాగా.. ఫ్రెషర్లకు కేవలం 15 వేల కొలువులు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు వెల్లడించింది. "ఉద్యోగ అవకాశాల కల్పనలో బెంగళూరు 31 వేల కొలువులతో ముందుంది.

## రేపట్నుంచే అమెజాన్ గ్రేట్ ఇండియన్ సేల్..

# ఆఫర్ల వివరాలు ఇవే!

పండగ ఆఫర్లతో వినియోగదారులను అలరించేందుకు ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ సిద్ధమైంది. గురువారం నుంచి 'గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2026' ప్రారంభం కానుంది రాత్రి 12 గంటల నుంచే సేల్ మొదలుకానుంది. స్మార్ట్‌ఫోన్‌లు, గృహోపకరణాలు, స్మార్ట్‌టీవీ, రిఫ్రిజిరేటర్లపై అమెజాన్ డిస్కౌంట్లు ప్రకటించింది. శాంసంగ్ గెలాక్సీ ఎస్25 అల్ట్రా 5జీ ప్రధాన ఆకర్షణంగా నిలుస్తోంది. బేస్ వేరియంట్‌ను రూ.84,999 (కూపన్ ఆఫర్‌తో పాటు)కు కొనుగోలు చేయొచ్చు. లిస్టింగ్ ధర ప్రస్తుతం రూ.99,999గా ఉంది. 9 నెలల పాటు నోకాస్ట్ ఈఎంఐ సదుపాయం కూడా ఉంది. ఐఫోన్ 16పై కూడా ఆఫర్ ప్రకటించింది. లిస్టింగ్ ధర రూ.89,900 కాగా.. డిస్కౌంట్ అనంతరంరూ.71,999కు లభిస్తుంది. మిడ్‌రేంజ్ సెగ్మెంట్‌లో వన్‌ప్లస్ నార్డ్ 6 ధర ప్రస్తుతం రూ.52,999 ఉండగా.. రూ.42,999కు విక్రయించనుంది. ఆరు నెలల నోకాస్ట్ ఈఎంఐ సదుపాయం కూడా ఉంది. షావోమీ 17పై ఏకంగా 50 శాతం వరకు ఆఫర్ ఉంది. లిస్టింగ్ ధర రూ.1,19,999 ఉండగా.. రూ.59,999కు కొనుగోలు చేయొచ్చు. వన్‌ప్లస్, రెడ్‌మీ, లావా వంటి




స్మార్ట్‌ఫోన్లపై కూడా భారీ తగ్గింపులు ఉన్నాయి. నో-కాస్ట్ ఈఎంఐ, ఎక్స్ఛేంజీ, కూపన్ ఆఫర్లు అందిస్తున్నట్లు అమెజాన్ తెలిపింది. హోం అప్లయన్సెస్‌పై 65 శాతం వరకు డిస్కౌంట్లు ఉన్నాయి. ఇందులో శాంసంగ్, హైయర్, ఎల్‌జీ, గోద్రేజ్ తదితర కంపెనీలకు చెందిన వాషింగ్ మెషిన్స్, రిఫ్రిజిరేటర్లు, ఏసీలు, మైక్రోవేవ్స్ వంటి ఉత్పత్తులు ఉన్నాయి. గ్రేట్ డీల్స్, ఎక్స్ఛేంజ్ ఆఫర్, నోకాస్ట్ ఈఎంఐ వంటి సదుపాయాలు ఉన్నాయి. ఈ సేల్‌లో భాగంగా ఎస్‌బీఐ డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు హోల్డర్స్‌కు 10 శాతం ఇన్‌స్టంట్ డిస్కౌంట్ లభిస్తుంది. స్మార్ట్‌టీవీ, ప్రొజెక్టర్లపై 65 శాతం వరకు డిస్కౌంట్‌ను అందిస్తున్నట్లు అమెజాన్ ప్రకటించింది. శాంసంగ్, షావోమి, టీసీఎల్, ఎల్‌జీ తదితర కంపెనీల ఉత్పత్తులు ఉన్నాయి. వీటి ధరలు రూ.7999 నుంచి ప్రారంభమవుతాయి. అమెజాన్ ఫ్రెష్ డీల్ ద్వారా 60 శాతం వరకు, అమెజాన్ బ్రాండ్స్‌లో 80 శాతం వరకు, విమాన టికెట్లపై 23 శాతం వరకు ఆదా చేయొచ్చని అమెజాన్ తెలిపింది. బుక్స్ అండ్ టాయ్స్‌పై 80 శాతం వరకు డిస్కౌంట్ అందిస్తున్నట్లు పేర్కొంది.

## నష్టాల్లో ముగిసిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. దీంతో గత రెండు సెషన్ల లాభాల ర్యాలీకి బ్రేక్ పడింది ఆర్‌బీఐ కీలక వడ్డీ రేట్ల పెంపు సూచీలపై ప్రభావం చూపింది. దాదాపు మూడున్నరేళ్ల తర్వాత ఈ పెంపు చేపట్టడంతో రెపో రేటు 5.5 శాతానికి చేరింది. దీంతో ముఖ్యంగా మెటల్, రియాల్టీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. దీంతో సూచీలు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 72,965.38 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా సూచీ నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 72,468.72 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 429.11 పాయింట్లు కోల్పోయి 72,638.70 వద్ద ముగిసింది. నిఫ్టీ 173.05 పాయింట్లు పతనమై 22,603.05 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 96.77గా ఉంది. సెన్సెక్స్ 30లో కోటక్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు తప్ప మిగతా కంపెనీల షేర్లన్నీ నష్టాల్లోనే ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 101.93 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,116.41 వద్ద ట్రేడవుతోంది.



### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 1,58,159 (22 క్యారెట్లు) | ₹ 1,72,544 (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,45,000

# పల్లెపల్లెలో ప్రజాపాలనే ధ్యేయం

- హుస్నాబాద్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా..
- 5 గ్రామాల్లో విస్తృతంగా పర్యటించిన మంత్రి పొన్నం ప్రభాకర్..
- ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా మార్చడంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపు



**చిగురుమామిడి అక్టోబర్ 07(జనంసాక్షి):** గ్రామాల్లోని ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటిని త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యంగా 'పల్లె పల్లెకు పొన్నంమన్న, పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమం నిరంతరం కొనసాగుతోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ముదిమాణిక్యం, రామంచ, ముల్కనూరు, పీచుపల్లి, సీతారాంపూర్ ఐదు గ్రామాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం విస్తృతంగా పర్యటించారు. పల్లె పల్లెలో ప్రజా పాలనను అందిస్తూ, ప్రజల ఇబ్బందులను ఆయన నేరుగా అడిగి తెలుసుకున్నారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా ప్రజలు మంత్రి పొన్నం ప్రభాకర్ కు గ్రామ గ్రామాన బతుకమ్మలతో, కోలాటంతో కదిలి వచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఒక ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కేవలం అధికారుల వల్లే కాకుండా, ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేలా పల్లెల్లోని ప్రజలంతా అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. తమ ప్రభుత్వం గ్రామ సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణ, విద్యుత్ పొదుపును ప్రోత్సహిస్తూ పల్లెల్లో ప్రతి ఇంటి ముందు సోలార్ ప్యానెల్ కనిపించేలా ప్రతి ఒక్కరూ ఆదర్శంగా నిలవాలని సూచించారు. రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. సాంప్రదాయ పంటలతో పాటు ఆయిల్ ఫామ్ సాగు చేపట్టడం ద్వారా రైతులు అదనపు ఆదాయం సాధించవచ్చని వివరించారు. కేవలం వ్యవసాయంపైనే కాకుండా, రైతులు పాడి పరిశ్రమ, పశుపోషణపై ప్రత్యేక దృష్టి సారించి ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. పల్లెల్లో నీటి సంరక్షణకు తగిన చర్యలు చేపట్టడంతో పాటు, మహిళల ఆర్థిక సాధికారితకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు. ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని తక్షణమే పరిష్కరించడమే ఈ 'పల్లె పల్లెకు పొన్నంమన్న' కార్యక్రమముఖ్య ఉద్దేశమని వివరించారు. ఈ జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా, ఆర్డీవో షర్మిల, కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు మార్క రాజకుమార్ గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు బోయిని రమేష్, ఒంటెల కిషన్ రెడ్డి, సాంబారి భారతమ్మ కొమురయ్య, పీచు సత్యనారాయణ రెడ్డి, గోగురి లక్ష్మీ మురహరి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్, సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్, తహసిల్దార్ కనకయ్య, ఎంపీడీవో రామ్మోహన్ చారి, వడ్డెర కార్పొరేషన్ వైస్ చైర్మన్ బత్తుల వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బదుకోలు దేవేందర్ రెడ్డి, సాంబారి బాబు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## చిన్నారుల ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరం

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**గోదావరిఖని, జనంసాక్షి :** జిల్లాలో 5 సంవత్సరాల లోపు చిన్నారులకు ఆధార్ నమోదు సులభతరం చేసేందుకు కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు రామగుండం ఐసీడీఎస్ కార్యాలయంలో రెండు రోజులపాటు ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అక్టోబర్ 7, 8 తేదీల్లో నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక శిబిరం మొదటి రోజు బుధవారం విజయ వంతంగా నిర్వహించినట్లు తెలిపారు. చిన్నారుల తల్లి దండ్రులు, సంరక్షకులు శిబిరానికి హాజరై ఆధార్ న మోదు సేవలను వినియోగించుకున్నారు. 5 సంవత్సరాల లోపు చిన్నారుల ఆధార్ నమోదు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరం అక్టోబర్ 8న కూడా కొనసాగుతుందని తెలిపారు. రామగుండం పరిధిలోని అర్హులైన చిన్నారుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లల ఆధార్ నమోదు చేయించాలని సూచించారు. చిన్నారుల ఆధార్ నమోదు ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు, భవిష్యత్‌లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్యా, ఇతర అవసరాలకు ఆధార్ సంబంధిత సేవలు అందుబాటులో ఉండేలా ఈ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



## పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 7 (జనంసాక్షి):** పత్తి కొనుగోళ్లను సజావుగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పత్తి కొనుగోళ్లపై జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించి కొనుగోలు కేంద్రాల నిర్వహణ, రైతులకు కల్పించాల్సిన సౌకర్యాలు, కొనుగోలు ప్రక్రియ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో పత్తికి క్వింటాల్‌కు రూ.8,667 కనీస మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పత్తిలో తేమ శాతం, నాణ్యత, రకాన్ని బట్టి ధరలో మార్పులు ఉండే అవకాశం ఉందని తెలిపారు. రైతులు పత్తిని ఇంటి వద్దనే బాగా ఆరబెట్టి, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. పత్తి కొనుగోళ్లకు సంబంధించి రైతులకు ఏవైనా సమస్యలు తలెత్తితే వ్యవసాయ మార్కెటింగ్ శాఖ టోల్‌ఫ్రీ నంబర్ 1800-599-5779ను సంప్రదించాలని సూచించారు. అలాగే అఅఎ వాట్సాప్ చాట్‌బాట్ 88972-81111 ద్వారా సీసీఐ సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన సేవలు, సమాచారాన్ని పొందవచ్చన్నారు. గత ఏడాది మాదిరిగానే కపాస్ కిసాన్ యాప్ ద్వారా మద్నూర్‌లోని 7 జిన్నింగ్ మిల్లులు, గాంధారిలోని ఒక జిన్నింగ్ మిల్లులో పత్తిని విక్రయించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు, పత్తి సాగు విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకుని 67 రైతు వేదికల్లో 67 తేమ కొలిచే పరికరాలను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

# ఎంవిఐ లేకుండానే డ్రైవింగ్ టెస్ట్..

**రిజిస్ట్రేషన్ నిర్వహిస్తున్న సిబ్బంది**

- కోరుట్ల రవాణా శాఖ కార్యాలయంలో సిబ్బంది ఇష్టారాజ్యం
- ఏసీబీ తనిఖీల్లో బయటపడ్డ నిజానిజాలు
- వివరాలు వెల్లడించిన ఏసీబీ డీఎస్పీ మహేందర్ రెడ్డి

**కోరుట్ల అక్టోబర్ 7 (జనంసాక్షి):** కోరుట్ల రవాణా శాఖ కార్యాలయంలో డ్రైవింగ్ పరీక్షలు వాహనాల పరిశీలన అధికారి పర్యవేక్షణ జరగాల్సి ఉండగా కోరుట్లలోని కానిస్టేబుల్ ఆ పనులు నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో బయటపడడం జరిగింది ఎం వి ఐ కార్యాలయంలో అందుబాటులో లేని సమయంలో కానిస్టేబుల్ అండ్ గిరీష్ కుమార్ అభ్యర్థులకు డ్రైవింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారని అధికారులు గుర్తించడం జరిగింది .

**అదనపు వసూలు ఏజెంట్ల హవా**

కార్యాలయంలో ఏజెంట్లు స్వేచ్ఛగా తిరుగుతూ సిబ్బందితో వ్యవహారాలు నడుపుతున్నారు ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుములకు అదనంగా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఏసీబీ తనికెల్లో గుర్తించడం జరిగింది ప్రజలకు వాహనాల రిజిస్ట్రేషన్ సేవలు అందించాల్సిన జగిత్యాల జిల్లా కోరుట్ల రవాణా శాఖ యూనిటీ కార్యాలయంలో బయటపడిన పరిస్థితి అక్టోబర్ 6న కరీంనగర్ అవినీతి నిరోధక శాఖ అధికారులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో కార్యాలయ నిర్వహణలో పలు లోపాలు వెలుగు చూసాయి. డ్రైవింగ్ వచ్చిందో లేదో పరీక్షించాల్సిన అధికారి అందుబాటులో లేరు అయినా పరీక్షలు జరుగుతున్నాయి వాహనాలను పరిశీలించాల్సిన కార్యక్రమం సాగుతున్నాయి అధికారి నిర్వహించాల్సిన బాధ్యతలు రవాణాశాఖ కానిస్టేబుల్ చేపడుతుండగా కార్యాలయంలో స్వేచ్ఛగా తిరుగుతూ సిబ్బంది వ్యవహారం నడుపుతున్నారు ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూషములు అదనంగా ప్రజల నుంచి డబ్బులు వసూలు అవుతున్నట్లు ఏసీబీ తనిఖీల్లో గుర్తించడం జరిగింది. కోరుట్ల ఆర్డీఓ కార్యాలయంలో



ఏసీబీ అధికారులు మెరుపు దాడులు చేసిన వైనం స్థానికంగా కలకలం రేపింది. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా కార్యాలయ రికార్డులు వాహనాల రిజిస్ట్రేషన్ వివరాలు ఛానల్ ఆర్థిక లావాదేవీలు అధికారులు పరిశీలించడం జరిగింది సుదీర్ఘ కాలంగా పెండింగ్లో ఉన్న దరఖాస్తులను కూడా తనిఖీ చేశారు రికార్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని ఉద్యోగులు విధి నిర్వహణపై పర్యవక్షణ కొరబడిందని గుర్తించారు. ప్రజల దరఖాస్తుల పరిష్కారం నుంచి కార్యాలయ పత్రం నిర్వహణ వరకు బయటపడిన లోపాలను ఏసీబీ బృందం నమోదుచేసింది.

**లంచం అడుగుతే ఏసీబీకి చెప్పండి**

ప్రభుత్వ సేవలు పొందేందుకు ఏ అధికారి లేదో ఏ సిబ్బంది లంచం డిమాండ్ చేసిన ప్రజలు భయపడకుండా ఫిర్యాదు చేయాలని డిఎస్పి మహేందర్రెడ్డి కోరారు టోల్ ఫ్రీ నెంబర్ 1064 వాట్సాప్ నెంబర్ 9440446106 ద్వారా సమాచారం అందించవచ్చని తెలిపారు చేసిన వారి వివరాలను రహస్యంగా ఉంచుతామని తెలియజేశారు.

# గ్రామీణుల ఆరోగ్యమే ప్రాధాన్యత

**ప్రతి పేదవాడికి వైద్యం అందుబాటులోకి తేవడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం:మంత్రి అడ్లూరి**



**జగిత్యాల బ్యూరో (జనంసాక్షి):** మల్లాపూర్ మండలం సాతారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య ఉప కేంద్రాన్ని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగారావు తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి, గ్రామీణ ప్రజలకు వైద్యం అందని పరిస్థితి ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆరోగ్య రంగంలో మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తోందన్నారు. వైద్యం కోసం ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితిని తగ్గించి, ప్రాథమిక ఆరోగ్య సేవలను గ్రామ స్థాయిలోనే అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. సాతారం గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం ప్రారంభంతో ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువయ్యాయని తెలిపారు. సాధారణ అనారోగ్య సమస్యలకు ప్రాథమిక చికిత్సతో పాటు ఆరోగ్య పరీక్షలు, వైద్య సలహాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స చేయడం కంటే, వ్యాధిని ముందుగానే గుర్తించి నివారించడమే ప్రజారోగ్యంలో కీలకమని అన్నారు. ప్రజలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, చిన్న ఆరోగ్య సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. మహిళలు, గర్భిణీలు, చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆరోగ్య సేవలు సకాలంలో అందేలా వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడంతో పాటు ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా క్షేత్రస్థాయి సిబ్బంది పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆరోగ్య మౌలిక వసతులు భవనం వరకు పరిమితం కాకుండా ప్రజలకు నిరంతర వైద్య సేవలు అందించే కేంద్రాలుగా పనిచేయాలని అన్నారు. ఉప కేంద్రంలో సిబ్బంది అందుబాటులో ఉండేలా, అవసరమైన సేవలు నిరంతరాయంగా కొనసాగించేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తోందని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రాథమిక వైద్యం కోసం గ్రామస్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి తగ్గుతుందని, అందుబాటులో ఉన్న ఆరోగ్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో మరిన్ని అభివృద్ధి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

# భద్రతతో ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలి

- అడ్రియాల లాంగ్‌వాల్ 4వ ప్యానెల్ పనులు వేగవంతం
- వార్షిక ప్రణాళిక లక్ష్యాలపై అధికారులతో సమీక్ష
- యంత్రాల పూర్తి వినియోగంతో ఉత్పాదకత పెంచాలని సూచన





**రామగిరి/గోదావరిఖని, అక్టోబర్ 07 (జనంసాక్షి):** సింగరేణి సంస్థ నిర్దేశించిన బొగ్గు, ఓబీ ఉత్పత్తి లక్ష్యాలను భద్రతకు ప్రాధాన్యమిస్తూ సాధించాలని డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కొప్పుల వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. బుధవారం రామగుండం-3 ఏరియాలోని ఓసీపీ-1, ఓసీపీ-2 ఉపరితల గనులతో పాటు అడ్రియాల లాంగ్‌వాల్ గనిని ఆయన సందర్శించి క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా రామగుండం-3 ఏరియా జీఎం సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జీఎం కొలిపాక నాగేశ్వరరావులతో సమీక్ష నిర్వహించారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా, జీడీకే-10 గని విస్తరణ పనులు, యంత్రాల పనితీరుపై వివరాలు తెలుసుకున్నారు. జీడీకే-10 గని వద్ద జరుగుతున్న విస్తరణ పనులను పరిశీలించిన డైరెక్టర్.. యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని, భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ఉత్పత్తి కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.
అడ్రియాల లాంగ్‌వాల్ గనిలో 3వ ప్యానెల్ సాల్వేజింగ్ పనులు పూర్తి చేసినందుకు సంబంధిత అధికారులు, సిబ్బందిని అభినందించారు. 4వ ప్యానెల్ పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేసేందుకు చేపడుతున్న చర్యలపై సమీక్షించారు. భద్రతతో పనులు పూర్తి చేసి లాంగ్‌వాల్ నుంచి ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని సూచించారు. వెన్సర్ కంపెనీ పనుల పురోగతిని కూడా సమీక్షించారు.
ఇదిలా ఉండగా, 2027-28 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక ప్రణాళిక, ఉత్పత్తి లక్ష్యాల రూపకల్పన కోసం ఏర్పాటు చేసిన కమిటీ రామగుండం-1 ఏరియాలో పర్యటించింది. ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఉత్పత్తి, ఉత్పాదకత పెంపు, మ్యాన్‌పవర్, యంత్రాల వినియోగం, ఓపెన్‌కాస్ట్, అండర్‌గ్రౌండ్ గనుల పనితీరు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. గనుల్లో ఎదురవుతున్న సమస్యలు, ఉత్పత్తి వివరాలను కమిటీ సభ్యులు తెలుసుకుని, నిర్దేశిత లక్ష్యాల సాధనకు అవసరమైన కార్యాచరణపై దృష్టి సారించాలని సూచించారు.
కార్పొరేట్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ విభాగం ఆధ్వర్యంలోని కమిటీలో జీఎంలు జి.దేవేందర్, పి.ఎలిషా, కె.యాదయ్య, వి.నరసింహారావు తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. రామగుండం-3, అడ్రియాల, రామగుండం-1 ఏరియాల అధికారులు, ప్రాజెక్ట్ అధికారులు, ఇంజినీర్లు, గని మేనేజర్లు, ఇతర విభాగాల అధికారులు సమీక్షల్లో పాల్గొన్నారు.



## అల్పాహారం, మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్

**గోదావరిఖని, జనంసాక్షి :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలుర) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని బుధవారం రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు మక్కాన్సింగ్ రాజు ఠాగూర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యం- పోషణ -విద్య ,అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం ఉదయం విద్యార్థులకు టిఫిన్ మధ్యాహ్నం భోజనం ఇస్తూ, మీ అందరికి మంచి ఆరోగ్యము మంచి విద్యను అందించాలన్నదే మా రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశమని, ఏ ఒక్కరు ఆకలితో ఉండి చదువుకు దూరం కావొద్దు అని విద్యార్థులందరూ ఆరోగ్యంగా దృఢంగా ఉండటం మా ప్రభుత్వం బాధ్యత అని ఆరోగ్యవంతమైన విద్యార్థులు ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిస్తారని, మీ అందరరూ అలా ఎదగాలన్నదే మా ఉద్దేశం అని తెలియజేశారు .ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సంజీవ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# కార్మికులను మోసం చేస్తున్న సింగరేణి, సీఎంపిఎఫ్ అధికారులు

- సీఎంపిఎఫ్ ఆఫీసు ముందు సిఐటియు ప్లాకార్డ్స్ తో నిరసన
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి




**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి కార్మికుల సీఎంపిఎఫ్ చిట్టీలు ఇవ్వాలని ఆఫీస్ ముందు సిఐటియు ప్లాకార్డ్స్ తో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తుమ్మల రాజారెడ్డి మాట్లాడుతూ సీఎంపిఎఫ్ కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పోర్టల్ లో కార్మికుల గత ఆర్థిక సంవత్సరం కష్టార్జితాన్ని ఇప్పటివరకు అప్డేట్ చేయక పోవడంతో ఉద్యోగస్తులు ఆందోళన చెందుతున్నారని వెంటనే అప్డేట్ చేయాలలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో సీఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్ గోవర్ధన్ గారికి వినతి పత్రం అందజేయడం జరిగిందని. ఒకవైపు కేంద్రంలో వందల కోట్ల కుంభకోణం సీఎంపిఎఫ్ లో జరుగుతున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మరోవైపు రాష్ట్రంలోని సింగరేణి కార్మికుల పట్టు పైసలను పోర్టల్ లో గత ఆర్థిక సంవత్సరం తాలూకు నిలువను ఇప్పటికీ అప్డేట్ చేయించడంలో ప్రతి నెల సీఎంపిఎఫ్ సింగరేణి యాజమాన్యం గెలిచామని గొప్పలు చెప్పుకుంటున్న ఏఐటీయూసీ ఐఎన్టీయూసీ నాయకులు సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నా... కార్మికుల వివరాలను పొందుపరచడంలో విఫలమయ్యారని విమర్శించారు. గతంలో సీఎంపీఎఫ్ వడ్డీ రేటు తక్కువగా కట్టినప్పుడు సిఐటియుగా పెద్ద ఎత్తున ఆందోళన చేసి వడ్డీ రేటు కోట్ల రూపాయలు విద్యార్థులకు ఇప్పించడంలో ముందున్నామని, ఇప్పుడు పూర్తి వివరాలను నమోదు చేయాలని పోర్టల్ లో పట్టు పైసా కాపీలను అందుబాటులో ఉంచాలని పోర్టల్ సమస్యలను పరిష్కరించాలని లేదంటే ఆఫీస్ ను పెద్ద ఎత్తున ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్జీవన్ అధ్యక్ష కార్యదర్శులు వంగల శివరాం రెడ్డి, మెండె శ్రీనివాస్, ఆరేపల్లి రాజమౌళి, అనబోయిన శంకర్, నంది నారాయణ, ఈగ వెంకటేశ్వర్లు, ఉరుసు సందీప్, పెద్దపల్లి శశికిరణ్, కొమ్మ రమేష్, జి జనార్ధన్, ఈ సాగర్, విప్రో, అఖిల్, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాతారంలో ఆరోగ్య ఉప కేంద్రం ప్రారంభం

- గ్రామస్థులకు ప్రాథమిక వైద్యం మరింత చేరువ
- పేదలకు వైద్యం అందుబాటులోకి తేవడమే లక్ష్యం : మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- మహిళలు, చిన్నారులు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ



**మల్లాపూర్, అక్టోబర్ 07 (జనంసాక్షి):** గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలను మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మల్లాపూర్ మండలం సాతారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య ఉప కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్, వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగారావుతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి, గ్రామీణ ప్రజలు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా గ్రామస్థాయిలోనే ప్రాథమిక ఆరోగ్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. సాతారం ఆరోగ్య ఉప కేంద్రం ద్వారా సాధారణ అనారోగ్యాలకు ప్రాథమిక చికిత్సతో పాటు ఆరోగ్య పరీక్షలు, వైద్య సలహాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు అందుబాటులోకి వస్తాయన్నారు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స చేయడం కంటే ముందుగానే గుర్తించి నివారించడమే ముఖ్యమని పేర్కొన్నారు.
మహిళలు, గర్భిణీలు, చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి సకాలంలో వైద్య సేవలు అందేలా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఉప కేంద్రం కేవలం భవనానికే పరిమితం కాకుండా నిరంతర వైద్య సేవలు అందించేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. కలెక్టర్ బి.సత్యప్రసాద్ మాట్లాడుతూ ఉప కేంద్రం అందుబాటులోకి రావడంతో సాతారం ప్రజలకు ప్రాథమిక వైద్యం సులభతరమైందన్నారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించాలని సూచించారు.
వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగారావు మాట్లాడుతూ కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించడంతోపాటు ఆరోగ్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీవో నరసింహారావు, డీఎంహెచ్‌వో సుజాత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్, తహసీల్దార్, గ్రామ సర్పంచ్ పోతవేణి నారాయణగౌడ్, ఉప సర్పంచ్ బేతి జగన్, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఖరీఫ్-2026 ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- ఖరీఫ్-2026 ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్ష నిర్వహించిన అదనపు కలెక్టర్ బి శ్రీరాములు



**పెద్దపల్లి,అక్టోబర్ 07(జనంసాక్షి) :** ఖరీఫ్-2026 సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని లిఅదనపు కలెక్టర్ బి శ్రీరాములు అధికారులను ఆదేశించారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు ఖరీఫ్-2026 ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి శ్రీరాములు మాట్లాడుతూ, ధాన్యం నిల్వకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ప్రణాళికను ముందస్తుగా సిద్ధం చేసుకోవాలని తెలిపారు. మండలాల వారీగా పంట కోతల షెడ్యూల్‌కు అనుగుణంగా అవసరమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించే సమయానికి రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఎఫ్ఏక్యూ నాణ్యత ప్రమాణాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యం మాత్రమే కొనుగోలు కేంద్రాలకు వచ్చేలా రైతులకు ముందుగానే సూచనలు అందించాలని తెలిపారు. నాణ్యత ప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయ, పౌరసరఫరాల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన గన్నీ బ్యాగుల లభ్యతపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఏ కొనుగోలు కేంద్రంలోనూ అవసరమైన సామగ్రి కొరత లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు.ధాన్యం శుభ్రపరిచే యంత్రాలు, తూకం యంత్రాలు, తేమ శాతం కొలిచే యంత్రాలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా ముందుగానే క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు.ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిస్థాయిలో ఉండేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు ధాన్యం కొనుగోలు ప్రక్రియ, ఎఫ్ఏక్యూ నాణ్యత ప్రమాణాలు, పరికరాల వినియోగం తదితర అంశాలపై అవసరమైన శిక్షణ అందించాలని సూచించారు.ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, జిల్లా సహకార అధికారి శ్రీమాల, ఎస్‌డబ్ల్యూసీ రీజినల్ మేనేజర్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తతే రక్షణ కవచం

- ఆగండి.. ఆలోచించండి.. సరిచూసుకోండి
- 'పాజ్ ఫర్ సేఫ్టీ' పోస్టర్ ఆవిష్కరణ
- మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి




**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 07 (జనంసాక్షి):** సాంకేతికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండటమే వాటి నుంచి రక్షణకు మార్గమని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో రూపొందించిన 'పాజ్ ఫర్ సేఫ్టీ-పాజ్.. థింక్.. వెరిఫై..' (ఆగండి.. ఆలోచించండి.. సరిచూసుకోండి) అవగాహన పోస్టర్‌ను బుధవారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ హెడ్‌క్వార్టర్స్‌లోని ఆస్ట్రా కన్వెన్షన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నకిలీ ఇన్‌వాయిస్‌లు, పర్చేజ్ ఆర్డర్లతో జరిగే బిజినెస్ ఫ్రాడ్‌ల పట్ల వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని, చెల్లింపులకు ముందు వెండర్, బ్యాంకు ఖాతా వివరాలను పూర్తిగా పరిశీలించాలని సూచించారు. వర్క్‌ఫ్రమ్‌హోమ్, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో వచ్చే అధిక ఆదాయ ఆఫర్లను నమ్మవద్దని, ముందస్తు రిజిస్ట్రేషన్ ఫీజులు అడిగే సంస్థల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. తక్షణ రుణాల పేరుతో నకిలీ లోన్ యాప్‌లు వ్యక్తిగత సమాచారం, ఫొటోలు సేకరించి వేధింపులకు పాల్పడే అవకాశం ఉందని, గుర్తుతెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దని హెచ్చరించారు. బ్యాంకు అధికారులు, పోలీసులు, ఇతర ప్రభుత్వ అధికారులమంటూ బెదిరించే ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దని, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. సోషల్ మీడియాలో భారీ డిస్కౌంట్ల పేరుతో వచ్చే నకిలీ షాపింగ్ లింకులను క్లిక్ చేసి ముందస్తు చెల్లింపులు చేయవద్దన్నారు. సైబర్ మోసానికి గురైన వారు ఆలస్యం చేయకుండా 'గోల్డెన్ అవర్'లో జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ 1930కు ఫోన్ చేయాలని లేదా అధికారిక సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సీపీ సూచించారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా, సైబర్ నేరాల నివారణలో ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, టౌన్ ఇన్‌స్పెక్టర్లు, సైబర్ విభాగం ఎస్సైలు అనూష, సిబ్బంది, ఎస్ఆర్ జూనియర్ ప్రైవేట్ కళాశాల జోనల్ ఇన్‌చార్జి తిరుపతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



**చొప్పదండి, అక్టోబర్ 7 (జనంసాక్షి):** గర్భిణీ స్త్రీలు పాలిచ్చే తల్లులు పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని మున్సిపల్ చైర్ పర్సన్ వడ్లూరి సరిత శ్రీనివాస్ పేర్కొన్నారు. చొప్పదండి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ వడ్లూరి సరిత అధ్యక్షతన మెప్మా ఐసిడిసిల ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ అభియాన్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గర్భిణీలు మరియు పాలిచ్చే తల్లులు పోషకాహారం నిమిత్తం మార్కెట్లలో దొరికే వస్తువులు అనగా సెరిలాక్, హార్లిక్స్ వంటి ఖరీదైన వస్తువులకు డబ్బులు వెచ్చించకుండా ఇంటి వద్ద దొరికే మినప పప్పు, శెనగ పప్పు, పెసరు పప్పు, బబ్బేర పప్పు, ఇతర పప్పు దినుసులు మరియు జీలకర్ర వంటి వాటిని ఉపయోగించి తయారు చేసిన ఆహారమును ఆరు నెలలు దాటిన పిల్లలకు అందజేయాలని, ఆరు నెలల లోపు పిల్లలకు తల్లి పాలు అందజేయాలని సూచించినారు. గర్భిణీ స్త్రీలు ఆకు కూరలు అనగా కరివేపాకు, మునగాకు, కొండ పిండి మొదలగు ఆకు కూరలు పోషక విలువలున్న ఆహారాన్ని స్వీకరించాలని తెలిపినారు. క్రమం తప్పకుండా ప్రతి దినము 30 నిమిషములు నడక మరియు సులభమైన వ్యాయాము చేసినట్లయితే సిజేరియన్ కాకుండా సుఖ ప్రసవం జరిగే అవకాశం ఉందని తెలిపినారు. తదుపరి ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిడిపిఒ నర్సింగా రాణి అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు మరియు చిన్న పిల్లలకు అందజేయుచున్న కోడి గుడ్లు, పాలు, బాలామృతం మొదలగు పోషకాహారాల కార్యక్రమాల గూర్చి వివరించారు. అనంతరం ఆరు నెలల చిన్న పిల్లలకు అన్న ప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ కీర్తి నాగరాజు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పెరుమాండ్ల మానస, కౌన్సిలర్లు చిల్ల అర్చన, వడ్లూరి అనూష, కౌన్సిలర్ కొత్త సుమలత, ముద్దం రాజేశ్వరి, మెప్మా టిఎంసి ఎం. అనిత, అంగన్వాడీ సూపర్వైజర్ సుధారాణి, మశ్రత్, హెల్త్ సూపర్వైజర్ శ్రీదేవి, మున్సిపల్ మేనేజర్ మాలతి, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శివాని, మెప్మా ఆర్పీలు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లల తల్లులు, పట్టణ మహిళలు, మహిళా ఉద్యోగులు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నారుల ఆధార్ నమోదు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**పెద్దపల్లి, అక్టోబర్ 07 (జనంసాక్షి):** ఐదేళ్లలోపు చిన్నారుల ఆధార్ నమోదుకు రామగుండం ఐసీడీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. అక్టోబర్ 7, 8 తేదీల్లో నిర్వహిస్తున్న శిబిరంలో మొదటి రోజు పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆధార్ నమోదు చేయించారు. అక్టోబర్ 8న కూడా శిబిరం కొనసాగుతుందని, అర్హులైన చిన్నారుల తల్లిదండ్రులు హాజరై ఆధార్ నమోదు చేయించుకోవాలని కోరారు. భవిష్యత్‌లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్యా తదితర సేవలకు ఆధార్ అవసరాల దృష్ట్యా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

# గిరిజన మినీ గురుకులం, మోడల్ స్కూల్‌లో కలెక్టర్ తనిఖీ

- విద్య, వసతి, భోజనం, మౌలిక వసతుల పరిశీలన
- విద్యార్థుల భద్రత, బోధనా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి



**మల్లాపూర్, అక్టోబర్ 07 (జనంసాక్షి):** మండలంలోని గిరిజన మినీ గురుకులం, టీజీ మోడల్ స్కూల్‌ను జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ బుధవారం సందర్శించి విద్యార్థులకు అందుతున్న విద్య, వసతి, భోజనం, మౌలిక వసతులను పరిశీలించారు. తరగతి గదులు, విద్యార్థులు-ఉపాధ్యాయుల హాజరు, బోధనా విధానం, విద్యా ప్రగతి, తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్.. పాఠశాలలో అందుతున్న విద్య, వసతి సౌకర్యాలు, భోజనం తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం, మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును, బోధనా ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షించాలని, విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేలా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని వసతులను కల్పిస్తూ విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని సూచించారు. పరిశీలనలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ పల్లికొండ నరేష్, జిల్లా విద్యాధికారి కె.రాము, తహసీల్దార్, ఎంపీడీవో, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి జూడో పోటీలకు మానేరు విద్యార్థి ఎంపిక

### మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి

**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 07 (జనంసాక్షి) :** హనుమకొండ లోని కెమిస్ట్రీ భవన్లో ఈనెల 10 నుంచి 12 వరకు జరగనున్న 70వ రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్ 14 జూడో ఛాంపియన్ షిప్ పోటీలకు కరీంనగర్ లోని మానేరు విద్యాసంస్థల చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పిఈటి చిలువేరి మహేందర్ తెలిపారు. ఇటీవల కరీంనగర్ లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలల్లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో రాణించిన బండారి జాహ్నవి 27 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించి రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జాతీయ పోటీలకు ఎంపికై జిల్లా కీర్తిని ఇనుమడింప చేయాలని సూచించారు. మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీత రెడ్డి, ప్రిన్సిపాల్ సరితా రెడ్డిలతో పాటు పీఈటీలు మహేందర్, తిరుపతి, స్వామి, అఖిలాశ, సాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

# 'ఓటు, సీటు చోరీకి తెరలేపింది కాంగ్రెస్సే'

- ఈసీ రాజ్యాంగబద్ధ సంస్థ.. బీజేపీ జేబు సంస్థ కాదు
- జ్ఞానేశ్‌కుమార్‌పై ఆరోపణలు కోర్టులో తేల్చుకోవాలి
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలున్నాయన్న బండి సంజయ్



**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 07 (జనంసాక్షి):** దేశంలో తొలి ఓటు, సీటు చోరీకి పాల్పడింది కాంగ్రెస్సేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆరోపించారు. 1946లో దేశంలోని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలన్నీ తొలి ప్రధాని అభ్యర్థిగా సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌ను ప్రతిపాదించగా, ఒక్క పీసీసీ మద్దతు కూడా లేని జవహర్‌లాల్ నెహ్రూను ప్రధానిని చేశారని పేర్కొన్నారు. దీనినే కాంగ్రెస్ తొలి ఓటు, సీటు చోరీగా అభివర్ణించారు.
ప్రధాని నరేంద్రమోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని కరీంనగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సేవా జ్యోతి' ర్యాలీ, వికసిత్ భారత్ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ పనిచేస్తున్నారని, దేశ అభివృద్ధిపై యువత ఆలోచించాలని కోరారు. 2014కు ముందు, ప్రస్తుతం దేశంలో చోటుచేసుకున్న అభివృద్ధిని ప్రజలు బేరీజు వేసుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ రాజ్యాంగబద్ధ సంస్థ అని, అది బీజేపీ జేబు సంస్థ కాదని బండి సంజయ్ అన్నారు. రాజ్యాంగ సంస్థలను బదనాం చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు నష్టమని పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌పై ఏవైనా ఆరోపణలు ఉంటే కోర్టులో తేల్చుకోవాలని సూచించారు. రాహుల్‌గాంధీ ఎన్నికల కమిషన్‌ను కలవాలనుకుంటే ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకోవచ్చని అన్నారు. రాష్ట్ర రాజకీయాలపై స్పందిస్తూ కేసీఆర్ భూ వివాదాలపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న చర్యలు రాజకీయ డ్రామాగా అభివర్ణించారు. బీఆర్ఎస్ అవినీతిపై చర్యలు తీసుకునే ధైర్యం కాంగ్రెస్‌కు లేదని, కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై పోరాడే పరిస్థితి బీఆర్ఎస్‌కు లేదని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలు ఉన్నాయని బండి సంజయ్ ఆరోపించారు. పార్టీ తనకు ఎన్నో అవకాశాలు, పదవులు ఇచ్చిందని, పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాదని ఆయన అన్నారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా స్వీకరించి కార్యకర్తగా పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారి శాంతికుమార్, జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఖనిలో సేవా మేరా యోగ్ దాస్

**గోదావరిఖని, జనంసాక్షి :** ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా పరిపాలన సందర్భంగా రామగుండం నియోజకవర్గంలో భాజపా రాష్ట్ర నాయకురాలు సొమారపు లావణ్య ఆధ్వర్యంలో "సేవా మేరా యోగ్‌దాన్" మొక్కల పెంపకం కార్యక్రమం భారత ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానిగా నిరంతరం 25 సంవత్సరాల ప్రజా పరిపాలన, సేవను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా భారతీయ జనతా పార్టీ (బిజెపి) పిలుపు మేరకు "సేవా మేరా యోగ్‌దాన్" కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి భాజపా రాష్ట్ర నాయకురాలు సొమారపు లావణ్య ముఖ్య అతిథిగా హాజరై, నాయకులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మాతంగి రేణుక, రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు మామిడి రాజేష్ ,మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి సంజీవ్, చిలుక శంకర్, అరిగెల శ్రావణ్, సదానందం పాల్గొనారు.





కొడంగల్ సీనియర్ హాస్టల్



మధిర వైవైఐఆర్‌ఎస్

# ఊపందుకున్న యంగ్ ఇండియా స్కూళ్ల నిర్మాణాలు

## రాష్ట్ర వ్యాప్తంగా 105 నియోజకవర్గాల్లో స్కూళ్లకు ప్లాన్

- 87 చోట్ల వివిధ దశల్లో పాఠశాలల పనులుల
- నిర్మాణాలకు రూ. 1,144.85 కోట్ల నిధులు విడుదల

**హైదరాబాద్, అక్టోబర్ 7 (జనంసాక్షి) :**

*విద్యా రంగానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎనలేని ప్రాముఖ్యతని స్తున్నారు. చదువుతోనే అన్ని రంగాల్లో మార్పు సాధ్యమని నమ్మిన సీఎం విద్యా శాఖను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని బాల,బాలికలకు నాణ్యమైన విద్యనందించాలనే లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల (వైఐఐఆర్ఎస్) ఏర్పాటుకు సీఎం శ్రీకారం చుట్టారు.*

విద్యార్థుల్లో సమైక్యత, సమగ్రత చిన్నతనం నుంచే పెంపొందించాలనే భిన్నమైన ఆలోచనతో, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు ఇతర వెనుకబడిన వర్గాల విద్యార్థులందరినీ ఒకే చోట కలిపి కులమతాలకతీతంగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించేలా వైఐఐఆర్ఎస్‌లకు రూపకల్పన చేశారు. ప్రతి శాసన సభ నియోజకవర్గంలో రెండు వైఐఐఆర్ఎస్‌లు నిర్మించనున్నారు. ఇందులో ఒకటి బాలికలకు, మరొకటి బాలురకు కేటాయిస్తారు. తొలి విడతలో 105 నియోజకవర్గాల్లో ఒక్కో వైఐఐఆర్ఎస్ నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో ఇప్పటికే 87 పాఠశాలలు నిర్మాణాలు వివిధ దశల్లో ఉండగా, మిగిలిన 18 పాఠశాలలకు పరిపాలన అనుమతుల ప్రక్రియ తుది దశకు చేరుకుంది. వీటి నిర్మాణాలకు ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 1,144.85 కోట్లు విడుదల చేసింది.

### ఆధునిక వసతులు

గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించేలా వైఐఐఆర్ఎస్‌లకు రూపకల్పన చేశారు. ఆధునిక తరగతి గదులు, డిజిటల్ బోధన-అభ్యసన సౌకర్యాలు, అత్యాధునిక ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, విశాలమైన డార్మిటరీలు, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రీడా మైదానా లు, డైనింగ్ బ్లాక్‌లు, బోధన, బోధనేతర సిబ్బందికి నివాస గృహాలతో ఈ పాఠశాలలను నిర్మిస్తున్నారు.



### తక్కువ వ్యయంతో ..

ఇంజినీరింగ్ డిజైన్లు, ప్రస్తుత షెడ్యూల్ ఆఫ్ రేట్స్ ను ఆధారంగా చేసుకుని వైఐఐఆర్ఎస్ నిర్మాణ వ్యయ అంచనాలను పారదర్శకంగా రూపొందించారు. గతంలో నిర్మించిన సమీకృత జిల్లా కార్యాలయాల కంటే తక్కువ నిర్మాణ వ్యయంతోనే అత్యాధునిక వసతులు కలిగిన ఈ విద్యాసంస్థలను నిర్మిస్తున్నారు. 20 నుంచి 25 ఎకరాల్లో నిర్మించే ఒక్కో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌లో సుమారు 2,650 మంది విద్యార్థులకు వసతి కల్పించనున్నారు. మొత్తం నిర్మాణ విస్తీర్ణం సుమారు 5.36 లక్షల చదరపు అడుగులు ఉండేలా ప్రణాళిక రూపొందించారు.

### శరవేగంగా నిర్మాణాలు..

ప్రభుత్వం తొలి దశల్లో 87 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. వీటిలో 79 పాఠశాలల నిర్మాణ పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. వీటిలో 70 నియోజకవర్గాల్లో కాంట్రాక్టర్లు పాఠశాలల నిర్మాణ పనులు మొదలు పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా పనులు వేగంగా జరుగుతున్నాయి. పాలకుర్తి, ఆసిఫాబాద్, గజ్వేల్, ముధోల్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లోని వైఐఐఆర్ఎస్‌లకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

బోథ్, నిర్మల్ నియోజకవర్గాల్లో టెండర్ల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది. శేరిలింగంపల్లి, సిర్పూర్, కామారెడ్డి, దుబ్బాక, సిరిసిల్ల, చంద్రాయణగుట్టలో పాఠశాలల నిర్మాణానికి అవసరమైన స్థలాలను ఇటీవలే కేటాయించారు. ప్రస్తుతం వాటికి సంబంధించిన డీపీఆర్‌ల తయారీలో యంత్రాంగం కసరత్తు చేస్తోంది. మహబూబ్ నగర్, మిర్యాలగూడ, వర్ధన్నపేట, నర్సంపేట నియోజకవర్గాల్లో అనువైన స్థలాల కోసం అన్వేషణ సాగుతోంది.

### కార్పొరేట్‌కు దీటుగా..

సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని స్థాయిలో విద్యా వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాన్ని అత్యంత ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళుతోంది. పరిపాలన అనుమతులు, టెండర్లు, నిధుల విడుదల, నిర్మాణాల పురోగతి అన్నీ సమాంతరంగా సాగుతుండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ ఆధునిక విద్యా ప్రాంగణాలు త్వరలోనే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

### 18 పాఠశాలల అనుమతులు త్వరలోనే

మొత్తం 105 నియోజకవర్గాల్లో ఇప్పటికే 87 పాఠశాలల నిర్మాణాలు వివిధ దశల్లో ఉండగా, మిగిలిన 18 నియోజకవర్గాలకు సంబంధించిన ప్రక్రియ కూడా వేగంగా ముందుకు సాగుతోంది. కోరుట్ల, జనగామ, హుజురాబాద్, కరీంనగర్, అలంపూర్, సిద్దిపేట, నర్సాపూర్, సంగారెడ్డి, జహీరాబాద్, ఎల్బీ నగర్, మహేశ్వరం, సూర్యాపేట, ఉప్పల్, బాల్కొండ, నిజామాబాద్, కూకట్‌పల్లి, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లకు సంబంధించి న అంచనాలు పూర్తయ్యాయి. ఈ పాఠశాలలకు త్వరలోనే పరి పాలనపరమైన అనుమతులను ప్రభుత్వం మంజూరు చేయనుంది. అనుమతులు లభించిన వెంటనే ఆ నియోజకవర్గాల్లోనూ టెండర్ల ప్రక్రియ ప్రారంభం కానుంది.

## ఇండియన్ మెడికల్ అసోసియేషన్
# నూతన కార్యవర్గ పదవీ ప్రమాణ స్వీకారోత్సవం

### ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షులు డా. పి.కిషన్



**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 07 (జనంసాక్షి) :** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కరీంనగర్ శాఖ 2026 - 27 కి గాను నూతన కార్యవర్గ పదవీ ప్రమాణ స్వీకారోత్సవం ఐఎంఏ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షులు డా. పి.కిషన్, కరీంనగర్ శాఖ నూతన అధ్యక్షులుగా డా.అరుణ్ కటారి, కార్యదర్శిగా డా.చల్లూరి విజయ్ కుమార్, కోశాధికారిని డా. ఆడెపు మానస ఇతర కార్యవర్గ సభ్యులచే పదవీ ప్రమాణ స్వీకారం చేపించారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డా. కిషన్ మాట్లాడుతూ... ఐఎంఏ ను బలోపేతం చేసేందుకు జేడీఎన్ (జూనియర్ డాక్టర్స్ నెట్వర్క్) ఎంఎస్ఎన్‌ను (మెడికల్ స్టూడెంట్స్ నెట్వర్క్) మరింత విస్తరించాలి అన్నారు. గౌరవ అతిథిగా హాజరైన నేషనల్ ఐఎంఏ యాక్షన్ కమిటీ చైర్మన్ డా.ఇ రవీంద్రా రెడ్డి కొత్త కార్యవర్గంలో దాదాపు అంతా యువకులే, ఉత్సాహంగా పని చెయ్యాలని తెలిపారు. ప్రెసిడెంట్ డా. అరుణ్ కటారి మాట్లాడుతూ...తమ కాలంలో, నేషనల్ ఐఎంఏ ప్రోగ్రాం ఆవో గావ్ చలే కింద సామాజిక ఆరోగ్య సేవలు, ఉచిత మల్టీ స్పెషాలిటీ ఆరోగ్య శిబిరాలు పల్లెల్లో విరివిగా చేపట్టనున్నట్టు చెప్పారు. కార్యదర్శి డా.చల్లూరి విజయ్ కుమార్ మాట్లాడుతూ... సామాజిక వైద్య ఆరోగ్య అవగాహనా కార్యక్రమాలు నిర్వహించ తలపెట్టామన్నారు. కోశాధికారిని డా ఆడెపు మానస అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా ఐఎంఏ రాష్ట పూర్వ అధ్యక్షులు డా ఎడవెల్లి విజయేంద్ర రెడ్డి, డా బిఎన్ రావు, రాష్ట్ర ఐఎంఏ కార్యదర్శి డా. అశోక్, రాష్ట్ర కోశాధికారి డా.దయాళ్ సింగ్ హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ సీనియర్ వైద్యులు డా. రఘురామన్, డా.విజయ్ మోహన్ రెడ్డి, డా భాగ్యరెడ్డి, డా. లక్ష్మణ్ కుమార్, డా పోలాడి శ్రీనివాస రావు, డా సూర్యనారాయణ రెడ్డి, డా ఎంఎల్ఎన్ రెడ్డి, డా జగన్ మోహన్ రావు, డా అలీం, డా పొలాస రామ్ కిరణ్, డా. వసంత్ రావు, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి అండర్ 14 బాలబాలికల
# టేబుల్ టెన్నిస్ పోటీలకు ఆల్ఫోర్స్ విద్యార్థుల ఎంపిక

### అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి.నరేందర్ రెడ్డి



**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 07 (జనంసాక్షి) :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని, క్రీడల్లోని విషయాలను విశ్లేషించి పట్టు సాధించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలకు చెందినటువంటి విద్యార్థులు ఎస్జిఎఫ్ రాష్ట్ర స్థాయి బాలబాలికల టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైన సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక అభినందన సభకు వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... టేబుల్ టెన్నిస్కు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉన్నదని అదే విధంగా ఈ క్రీడను రాయల్ గేమ్గా పరిగణించడం జరుగుతుందని వారు చెప్పారు. ఈ క్రీడను ఆడడం ద్వారా శారీరకంగా ధృడపడుతారని ప్రత్యేకంగా ఆలోచన విధానం సైతం మారుతుందని వారు అభిప్రాయపడ్డారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు నిపుణులైన వ్యాయామ ఉపాధ్యాయులు శిక్షణ ఇప్పిస్తూ వివిధ టోర్నమెంట్లకు ఎంపిక చేస్తున్నామని వారు చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్లోని ఒక ప్రైవేట్ అకాడమీలో నిర్వహించినటువంటి ఎస్ జి ఎఫ్ జోనల్ స్థాయి అండర్ 14 బాలబాలికల టేబుల్ టెన్నిస్ ఛాంపియన్షిప్లో పాఠశాలకు చెందిన కళ్యాణం సహర్ష్ సాయి, 8వ తరగతి, హమ్సికామణి, 8వ తరగతి, అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడమే కాకుండా త్వరలో నిర్వహించబోయే ఎస్ జి ఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్-14 బాల బాలికల టేబుల్ టెన్నిస్ పోటీలకు సైతం అర్హత సాధించారని హర్షం వ్యక్తం చేశారు. పుష్పగుచ్ఛాలను అందజేసి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, న్యాయమ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆశాలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి

- అక్టోబర్ 27న సమ్మె సన్నాహక రాష్ట్ర సదస్సు : రేవతి కళ్యాణి
- పెరుగుతున్న పనిభారానికి అనుగుణంగా వేతనాలు పెంచాలి



**కీసర, అక్టోబర్ 7 (జనంసాక్షి) :** ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) సహాయ కార్యదర్శి ఎం.రేవతి కళ్యాణి డిమాండ్ చేశారు. బుధవారం కీసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిర్వహించిన యూనియన్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆశా వర్కర్లపై రోజురోజుకూ పనిభారం పెరుగుతున్నా.. అందుకు అనుగుణంగా వేతనాలు పెంచడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని అన్నారు. నిత్యావసరాల ధరలు పెరిగిన నేపథ్యంలో తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ఆశా వర్కర్లలో అసంతృప్తి నెలకొందన్నారు.

ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనవసర పనిభారాన్ని తగ్గించాలని, అధికారుల వేధింపులను నిలిపివేయాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే పలు దశల్లో ఆందోళనలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో సమ్మెకు సన్నద్ధం కావాల్సిన పరిస్థితి ఏర్పడిందని రేవతి కళ్యాణి అన్నారు. ఇందులో భాగంగా అక్టోబర్ 27న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమ్మె సన్నాహక రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నుంచి ఆశా వర్కర్లు పెద్ద సంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

# సైబర్ జాగరూకతా దివస్ పోస్టర్ ఆవిష్కరణ

*డిజిటల్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి: సీపీ, సైబర్ క్రైమ్ విభాగం డీసీపీ*

- 200 మందికిపైగా సైబర్ వారియర్లు, వాలంటీర్ల పాల్గొనడం



**శేరిలింగంపల్లి, అక్టోబర్ 07 (జనంసాక్షి):** సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు సురక్షిత డిజిటల్ విధానాలను ప్రోత్సహించేందుకు సైబరాబాద్ పోలీస్, ఎస్సీఎస్సీ సంయుక్త ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్ ఆడిటోరియంలో బుధవారం 'సైబర్ జాగరూకతా దివస్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. సైబర్ క్రైమ్ విభాగం డీసీపీ కుమార్ కె.పుష్ప పోస్టర్‌ను ఆవిష్కరించగా, సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం.రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, ఆన్‌లైన్ సేవలను వినియోగించే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డిజిటల్ అరెస్ట్, యూపీఐ చెల్లింపులు, సెక్స్టార్షన్, ఆన్‌లైన్ పెట్టుబడులు, ఆర్థిక మోసాల్లో నేరగాళ్లు భయం, అత్యాశ, అత్యవసర పరిస్థితులను ఆసరాగా చేసుకుని ప్రజలను మోసం చేస్తున్నారని వివరించారు. పోలీసులు, ప్రభుత్వ అధికారులమంటూ వచ్చే అనుమానాస్పద కాల్స్‌ను నమ్మవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకింగ్ సమాచారం పంచుకోవద్దని సూచించారు. నకిలీ చెల్లింపు అభ్యర్థనలు, క్యూఆర్ కోడ్‌లు, సోషల్ ఇంజినీరింగ్ పద్ధతుల ద్వారా జరిగే యూపీఐ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు, లావాదేవీలకు దూరంగా ఉండాలని కోరారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఇరుగుపొరుగు వారికి సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలని సైబర్ వారియర్లు, వాలంటీర్లకు సూచించారు.

కార్యక్రమంలో 200 మందికిపైగా సైబర్ వారియర్లు, వాలంటీర్లు పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమం ద్వారా మోసాలను గుర్తించే విధానాలు, వాటి నుంచి రక్షించుకునే మార్గాలపై అవగాహన కల్పించారు. ఎస్సీఎస్సీ డైరెక్టర్ రశ్మి శ్రీవాస్తవ, అసోసియేట్ డైరెక్టర్ వై.భానుమూర్తి, పోలీసు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మోటకొండూరులో రెండు రోడ్డు ప్రమాదాలు

- బైకులు ఢీకొని నలుగురికి గాయాలు
- తీవ్రంగా నిరాశపరిచిన 108.. ఆలస్యంగా అంబులెన్స్
- వాహనాల సంఖ్య పెంచాలని స్థానికుల డిమాండ్



**మోటకొండూరు అక్టోబర్ 7 (జనం సాక్షి):** మోటకొండూరు మండలంలో బుధవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలయ్యాయి. ముత్తిరెడ్డిగూడెం లక్ష్మీ ఆవరణ వద్ద రెండు బైకులు ఎదురెదురుగా బలంగా ఢీకొనడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు 108కి సమాచారం ఇచ్చినా, అంబులెన్స్ ఘటనా స్థలానికి చేరుకోవడం తీవ్ర ఆలస్యమైంది. తీవ్ర రక్తస్రావంతో బాధపడుతూ క్షతగాత్రులు రోడ్డుపైనే నరకయాతన అనుభవించారు. గోల్డెన్ అవర్‌లో వైద్యం అందకపోతే ప్రాణాలు గాల్లో కలిసే ప్రమాదం ఉందని, అంబులెన్సుల కొరతతో అమాయకుల ప్రాణాలు పోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర సమయాల్లో ఆదుకోవాల్సిన 108 సేవలు ఇలా జాప్యం కావడం దారుణమని, ప్రభుత్వం తక్షణమే స్పందించి అంబులెన్సుల సంఖ్యను పెంచాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అనంతరం గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. మరోవైపు.. కాటేపల్లి వంతెన వద్ద కారు, బొలెరో వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో రెండు వాహనాలు ముందుభాగం ధ్వంసం కాగా, అదృష్టవశాత్తూ ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. కారును ఆత్మకూరుకు చెందిన మజ్జిగ నరేష్, బొలెరోను సంగారెడ్డి జిల్లాకు చెందిన ఎండీ సమద్ ఖురేషీ నడుపుతున్నట్లు గుర్తించారు. ఈ రెండు ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తట్టి అన్నారంలో మహిళ దారుణ హత్య

- 10 రోజులుగా మిస్సింగ్.. గుర్తుపట్టలేని స్థితిలో మృతదేహం
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఇన్‌చార్జి ఏసీపీ రవీందర్‌రెడ్డి



**అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 7 (జనంసాక్షి ):** తట్టి అన్నారం ప్రాంతంలో మహిళ దారుణ హత్యకు గురై మృతదేహం లభ్యమైన ఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగుచూసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉస్మానియా యూనివర్సిటీ మాణిక్యేశ్వర్‌నగర్‌కు చెందిన మంగమ్మ ఈ నెల 28న అదృశ్యమైనట్లు ఓయూ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది.అదృశ్యమైన పది రోజుల అనంతరం తట్టి అన్నారం పరిధిలోని నాగోల్-బండ్లగూడ బస్‌డిపో వెనుక గోల్డెన్ లీవ్స్ విల్లాస్‌కు వెళ్లే మార్గంలో మృతదేహం లభ్యమైంది. మార్నింగ్ వాక్‌కు వెళ్లిన స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడ మద్యం సీసాలు కూడా లభ్యమైనట్లు సమాచారం. ఎల్బీనగర్ ఇన్‌చార్జి ఏసీపీ రవీందర్‌రెడ్డి, క్లూస్ టీం సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలను సేకరించారు. మహిళపై అత్యాచారం జరిగి ఉండవచ్చన్న కోణంలో పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తూ అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని గుర్తించి పూర్తి వివరాలు నిర్ధారించాల్సి ఉంది. హత్యకు దారితీసిన కారణాలు, నిందితుల వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# ఘోర రోడ్డు ప్రమాదం.. ముగ్గురు మృతి

### తీవ్ర గాయాలతో బాలిక ఆసుపత్రికి తరలింపు

**చేవెళ్ల, అక్టోబర్ 07 (జనంసాక్షి) :** చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గొల్లపల్లి గ్రామ సమీపంలోని చేవెళ్ల-శంకర్‌పల్లి రోడ్డుపై గుర్తుతెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందగా, బాలిక తీవ్రంగా గాయపడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి మధు (34), తన భార్య సావిత్రి (32), కుమారుడు ధనుష్ (6), కుమార్తె అక్షయ (10)తో కలిసి మంగళవారం సాయంత్రం టిఎస్07ఈఎస్5913 నంబర్ గల గ్లామర్ ద్విచక్ర వాహనంపై కుటుంబ శుభకార్యానికి హాజరయ్యేందుకు చేవెళ్లకు వచ్చారు. శుభకార్యం అనంతరం రాత్రి మేడిపల్లి వైపు తిరిగి వెళ్తుండగా సుమారు 9 గంటల నుంచి 9.20 గంటల మధ్య గొల్లపల్లి గ్రామ సమీపంలో వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మధు, సావిత్రి, ధనుష్ తీవ్ర గాయాలతో సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. కుమార్తె అక్షయ తీవ్ర రక్తగాయాలకు గురికావడంతో వెంటనే చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనం అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న చేవెళ్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను సేకరించారు. మృతుడు మధు అన్న కుమ్మరి మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనం, డ్రైవర్‌ను గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టారు.

# మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- రూ,17.60 లక్షల విలువైన 35 కిలోల గంజాయి పట్టివేత,ఇద్దరు అరెస్ట్
- మహేశ్వరం జోన్ డీసీపీ కె.నారాయణరెడ్డి



**ఆమనగల్/కడ్తాల్ అక్టోబర్ 07(జనంసాక్షి):** మాదకద్రవ్యాలు గంజాయి,డ్రగ్స్,ను అక్రమంగా తరలించినా,వాటిని సేవించినా వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని మహేశ్వరం జోన్ డీసీపీ కె.నారాయణరెడ్డి స్పష్టం చేశారు.ఆమనగల్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో సుమారు 35 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు.దీనికి సంబంధించిన వివరాలను మహేశ్వరం జోన్ డీసీపీ నారాయణరెడ్డి,ఆమనగల్ పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ వెంకటేశ్వర్లు,ఎస్సై సంతోష్ కుమార్,తో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.పక్కా విశ్వసనీయ సమాచారం మేరకు అక్టోబర్ 6న మంగళవారం ఆమనగల్లు పోలీసులు ఎస్ఓటీ బృందం సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.ఆమనగల్ మార్కెట్ యార్డు సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తూ గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.విచారణలో వారు ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధికి చెందిన కుంజం చందు బాబు దొర (26), కొసు వెంకట సాయి బాబు దొర (23) గా గుర్తింపు పొందినట్లు డీసీపీ తెలిపారు.

### ప్రధాన నిందితుడు పరారీలో

రంపచోడవరం ప్రాంతానికి చెందిన అభి అనే వ్యక్తి గంజాయి రవాణా కోసం నిందితులతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు విచారణలో తేలిందని పోలీసులు వెల్లడించారు.సదరు గంజాయిని ఆమనగల్ కు సురక్షితంగా చేర్చితే ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున ఇస్తానని ఆశ చూపినట్లు తేలింది.రాజమండ్రి నుంచి హైదరాబాద్ మీదుగా ఆమనగల్ కు చేరుకున్న నిందితులు మార్కెట్ యార్డు వద్ద గుర్తు తెలియని వ్యక్తికి ఈ సరుకు అప్పగించేందుకు వేచి ఉండగా పోలీసులు పట్టుకున్నారు.రూ. 17.60 లక్షల విలువైన ఆస్తి నిందితుల వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు.17 ప్యాకెట్లలో ప్యాక్ చేసిన సుమారు 35 కిలోల గంజాయితో పాటు ఒక వివో మొబైల్ ఫోన్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న గంజాయి,ఇతర వస్తువుల మొత్తం విలువ సుమారు రూ. 17.60 లక్షలు ఉంటుందని డీసీపీ అంచనా వేశారు.ఈ కేసులో ప్రధాన గంజాయి సరఫరాదారు అభి పరారీలో ఉన్నాడని,అతడి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని తెలిపారు.ఆమనగల్ ఇన్ స్పెక్టర్ వెంకటేశ్వర్లు,ఎస్ఓటీ అధికారులు సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించిన ఈ ఆపరేషన్ ను ఉన్నతాధికారులు అభినందించారు.యువత జీవితాలను,భవిష్యత్తును నాశనం చేసే గంజాయి,మాదకద్రవ్యాల రవాణాపై నిరంతరం నిఘా ఉంచుతామని డీసీపీ స్పష్టం చేశారు.ఈ ఆపరేషన్ లో ప్రతిభ కనబరిచిన ఎస్ఓటి,ఆమనగల్ పోలీస్ సిబ్బందిని,డిసిపి అభినందించారు.సిబ్బందికి తగిన విధంగా రివార్డులను అందజేసినట్లు పేర్కొన్నారు.

## బోడుప్పల్, చెంగిచెర్లలో న్యాయ అవగాహన సదస్సులు

### సీనియర్ సిటిజన్లు, విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించిన న్యాయ సేవాధికార సంస్థ



**బోడుప్పల్-జనంసాక్షి :** తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాల భాస్కర్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లాలో న్యాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా బోడుప్పల్ మల్లికార్జున నగర్ కమ్యూనిటీ హాల్‌లో, చెంగిచెర్లలోని జెడ్‌పి ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించారు. ఇందులో భాగంగా మల్లికార్జున నగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన సదస్సుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జివిఎల్ ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ల హక్కులు, వారికి చట్ట పరంగా ఉన్న రక్షణలు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందుబాటులో ఉన్న న్యాయ సేవల గురించి వివరించారు. అవసరమైన వారు న్యాయ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం చెంగిచెర్ల జెడ్‌పి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులోనూ జివిఎల్ ప్రియాంక ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పలు చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోక్సో చట్టం, మంచి స్పర్శ-చెడు స్పర్శ, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ గేమ్స్, సైబర్ చట్టాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమాల్లో పారా లీగల్ వాలంటీర్లు సుజాత నాయుడు, వేణుగోపాల్, మల్లికార్జున నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, చెంగిచెర్ల జెడ్ పి ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వాయు కాలుష్య నియంత్రణకు
# సమగ్ర కార్యాచరణ

- కాలుష్య మూలాల నియంత్రణకు శాఖల సమన్వయంతో విస్తృత చర్యలు
- స్వచ్ఛ వాయు సర్వేక్షణలో నల్గొండకు జాతీయ స్థాయిలో రెండో ర్యాంకు



**హైదరాబాద్ (జనం సాక్షి) :** తెలంగాణలో వాయు నాణ్యత మెరుగుదలకు శాస్త్రీయ పర్యవేక్షణ, కాలుష్య మూలాల గుర్తింపు, నియంత్రణ చర్యలను మరింత బలోపేతం చేస్తున్న ట్లు అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ కమిటీ ఛైర్మన్ అహ్మద్ నదీమ్ తెలిపారు. సెక్రటేరియట్‌లో టీజీపీసీబీ మెంబర్ సెక్రటరీ, కమిటీ మెంబర్ కన్వీనర్ రవి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వాయు నాణ్యత నియంత్రణ చర్యలను సమీక్షించారు. 2019-20 నుంచి 2025-26 వరకు హైదరాబాద్‌లో వార్షిక సగటు పీఎం-10 స్థాయిలు 86 నుంచి 80, సంగారెడ్డిలో 87 నుంచి 78 మైక్రోగ్రాములు/క్యూబిక్ మీటర్‌కు తగ్గినట్లు అధికారులు తెలిపారు. నల్గొండలో 59 నుంచి 71కు పెరిగినట్లు పేర్కొన్నారు. వాయు నాణ్యతను నిరంతరం పర్యవేక్షించేందుకు 13 నిరంతర పరిసర వాయు నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నారు. ఎయిర్ క్వాలిటీ డ్యాష్‌బోర్డు, తక్కువ వ్యయ సెన్సార్ల ఏర్పాటును విస్తరిస్తున్నారు. రోడ్డు ధూళి నియంత్రణకు రోడ్ల మెరుగుదల, యాంత్రిక రోడ్డు శుభ్రత, పచ్చదనం, మియావాకీ వనాల పెంపు వంటి చర్యలు చేపడుతున్నారు. వాహన కాలుష్య నియంత్రణకు విద్యుత్ వాహనాల వినియోగం, ఛార్జింగ్ వసతులు, కాలుష్య పరీక్ష కేంద్రాల బలోపేతం చేపట్టారు. రాష్ట్రంలోని 516 కాలుష్య పరీక్ష కేంద్రాలను కేంద్ర సర్వర్‌తో అనుసంధానించగా, ఇప్పటివరకు 36,14,208 పరీక్షలు నిర్వహించారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం 310 విద్యుత్ బస్సులు నడుస్తున్నాయి. నల్గొండ, సంగారెడ్డిలో కాలుష్య మూలాల అధ్యయనం, రాష్ట్రస్థాయి ఉద్గారాల సమగ్ర లెక్కింపుపై చర్యలు కొనసాగుతున్నాయి. పరిశ్రమలు, డీజిల్ జనరేటర్ల ఉద్గారాల నియంత్రణ, వ్యవసాయ అవశేషాల బహిరంగ దహనంపై అవగాహన కార్యక్రమాలను విస్తరిస్తున్నారు. స్వచ్ఛ వాయు సర్వేక్షణలో నల్గొండ 16వ వార్డు జాతీయ స్థాయిలో రెండో ర్యాంకు సాధించి రూ.20 లక్షల పురస్కారం పొందడంపై కమిటీ హర్షం వ్యక్తం చేసింది. సమన్వయంతోనే దీర్ఘకాలికంగా వాయు కాలుష్యాన్ని నియంత్రించగలమని టీజీపీసీబీ మెంబర్ సెక్రటరీ రవి తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో మెరుగైన వాయు నాణ్యత సాధనకు కృషి కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## కొమురం భీం పోరాటస్ఫూర్తితో
# జర్నలిస్టులు ఉద్యమించాలి

- టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ







**కొమురంభీం ఆసిఫాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** జోడేఘాట్ సాక్షిగా, జల్ జంగల్ జమీన్ తమ హక్కుగా గర్జించి,అణచివేతకు ఎదురు నిలిచి, అన్యాయానికి తలవంచకుండా, ఆదివాసీ బిడ్డల ఆత్మగౌరవం కోసం ఎదురొడ్డి పోరాడిన వీరుడు కొమురం భీం పోరాట స్ఫూర్తితో జర్నలిస్టులు హక్కుల సాధనకు ఉద్యమించాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ పిలుపునిచ్చారు. టీయూడబ్ల్యూజే కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తృతీయ మహాసభ, ఆసిఫాబాద్ పట్టణంలోని రోజ్ గార్డెన్స్ ఫంక్షన్ హాలులో బుధవారం కొమురం భీం ప్రాంగణంలో జరిగింది. ఈ సభకు ఆయన విశిష్ట అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆసిఫాబాద్ అంటే అడవి మాత్రమే కాదని, ఆదివాసీ బిడ్డల ఆత్మగౌరవానికి అది చిరునామా అని విరాహత్ అభివర్ణించారు. ఆసిఫాబాద్ ఒక జిల్లా మాత్రమే కాదని, కొమురం భీం పోరాట వారసత్వాన్ని మోస్తున్న నేల అని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పోరాటాలు, త్యాగాలు, విజయాలతో కూడిన సుదీర్ఘ చరిత్ర కలిగి ఉన్న ఏకైక సంఘం టీయూడబ్ల్యూజే మాత్రమేనని ఆయన స్పష్టం చేసారు. జర్నలిస్టుల గొంతుకగా, 75ఏళ్ల నుండి మడమ తిప్పని పోరాటాలు చేస్తున్న గొప్ప చరిత్ర తమ సంఘానికి ఉందని, తెలుగు రాష్ట్రాల్లో జర్నలిస్టులు పొందుతున్న సౌకర్యాలు తమ సంఘం సాధించినవేనని ఆయన స్పష్టం చేసారు. నాటి నుండి నేటి వరకు తమ సంఘం ఏ రాజకీయ పార్టీకో, ప్రభుత్వానికో అనుబంధంగా పనిచేయలేదని, జర్నలిస్టుల, మీడియా పక్షపాతిగా నిలబడి రాజీలేని పోరాటాలు కొనసాగిస్తున్నట్లు విరాహత్ అలీ అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక విస్మరించడం సరైంది కాదని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు క్యాష్ లెస్ హెల్త్ స్కీమ్ అమలుకాక పోవడంతో అప్పులు చేసి చికిత్స పొందుతున్నారని, మరి కొందరు అప్పులు చేసే స్థోమత లేక అనారోగ్యాలతో తనువు చాలిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేసారు. అలాగే ఇండ్లు, ఇంటి స్థలాల హామీని ప్రభుత్వం నేటికీ అమలు చేయకపోవడంతో జర్నలిస్టుల్లో తీవ్ర నిరాశ నెలకొందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జర్నలిస్టుల ప్రధాన సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని విరాహత్ అలీ కోరారు. గౌరవ అతిథిగా హాజరైన టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ మాట్లాడుతూ, ట్రేడ్ యూనియన్ నియమావళికి అనుగుణంగా సంస్థాగత నిర్మాణంతో రాష్ట్రంలో కొనసాగుతున్న ఏకైక జర్నలిస్టుల సంఘం తమదేనని ఆయన పేర్కొన్నారు. 33జిల్లాల్లో వేలాది జర్నలిస్టుల సభ్యత్వాలతో తమ సంఘం శాఖలు బలోపేతంగా పనిచేస్తున్నట్లు రాంనారాయణ స్పష్టం చేసారు. జర్నలిస్టుల సంక్షేమం తప్పా, వేరే వ్యామోహాలు తమకు లేవని ఆయన అన్నారు. ఇంకా ఈ సభలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రకాష్ రెడ్డి, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ రహ్మాన్, సంపత్, యూనియన్ జిల్లా నాయకులు కృష్ణం రాజు, ప్రకాష్ గౌడ్, జమీల్, గిరిజా బాయి, సతీష్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుండి దాదాపు 250మంది జర్నలిస్టులు మహాసభకు హాజరవ్వడం విశేషం.

### కథనాల్లో వాస్తవాలు ఉండాలి

*- జిల్లా కలెక్టర్ హరిత*



ప్రజా సమస్యలపై జర్నలిస్టులు రాసే కథనాల్లో వాస్తవాలు ఉంటేనే అవి విశ్వాసం పొందగలుగుతాయని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత అన్నారు. టీయూడబ్ల్యూజే మహాసభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రజా క్షేత్రంలో అధికార యంత్రాంగంతో కలిసి జర్నలిస్టులు టీమ్ వర్క్ చేస్తే సత్ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని కలెక్టర్ సూచించారు. జిల్లాలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు.

## జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్‌కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శుభాకాంక్షలు



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన తెలంగాణ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్‌ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఢిల్లీ పర్యటనలో ఉన్న డిప్యూటీ సీఎం, జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్‌కు శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ హైకోర్టు సిజేగా ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం స్మరించుకుంటూ, సర్వోన్నత న్యాయస్థానంలో ఆయన బాధ్యతలు విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. న్యాయరంగంలో ఆయన అనుభవం దేశ అత్యున్నత న్యాయస్థానానికి మరిన్ని సేవలు అందించేందుకు దోహద పడుతుందని పేర్కొన్నారు.

## సిర్పూర్-కాగజ్‌నగర్ రైలులో మంటలు

**హైదరాబాద్, అక్టోబర్ 07 (జనంసాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ సమీపంలో బుధవారం ఉదయం సిర్పూర్-కాగజ్‌నగర్ వెళుతున్న రైలులో స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనతో ప్రయాణికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. అయితే, రైల్వే సిబ్బంది అప్రమత్తతతో వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే, రైలు బీబీనగర్ స్టేషన్ సమీపానికి చేరుకుంటున్న క్రమంలో, ఒక బోగీ చక్రానికి బ్రేక్ లైనర్‌లు పట్టేయడంతో ఏర్పడిన రాపిడి వల్ల పొగలు, మంటలు చెలరేగాయి. దీనిని వెంటనే గమనించిన కో-పైలట్, లోకో పైలట్‌ను అప్రమత్తంచేయడంతో రైలును బీబీనగర్ రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. సమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది, అగ్నిమాపక దళం హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ప్రయాణికులెవరికీ ఎటువంటి గాయాలు కాలేదని అధికారులు స్పష్టం చేశారు.

## వెంకటాపురంలో ఓపెన్‌కాస్ట్ బొగ్గు తవ్వకాలను నిలిపివేయాలి

- రామప్ప సరస్సు, రామప్ప దేవాలయానికి తీవ్ర ముప్పు
- కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్




**హనుమకొండ, అక్టోబర్ 7 (జనంసాక్షి) :** ములుగు జిల్లా వెంకటాపురం ప్రాంతంలో ప్రతిపాదిత ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనుల అభివృద్ధి, తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ డిమాండ్ చేసింది. ఈ అంశంపై ఈరోజు హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలువురు నిపుణులు, సామాజిక కార్యకర్తలు, పర్యావరణవేత్తలు తమ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఎం. పాండురంగారావు మాట్లాడుతూ, వెంకటాపురం ప్రాంతంలో ప్రతిపాదిత ఓపెన్‌కాస్ట్ మైనింగ్‌పై శాస్త్రీయ పరిశోధనలు, సాంకేతిక విశ్లేషణలను పరిశీలిస్తే పరిస్థితి అత్యంత తీవ్రమైనదిగా కనిపిస్తోందన్నారు. ఓపెన్‌కాస్ట్ తవ్వకాల వల్ల రామప్ప సరస్సు, రామప్ప దేవాలయం, పరిసర పర్యావరణ వ్యవస్థపై ప్రతికూల ప్రభావాలు పడే అవకాశం ఉందని తెలిపారు. ప్రపంచ వారసత్వ ప్రాధాన్యత కలిగిన రామప్ప ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. డాక్టర్ టి. రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ, సింగరేణి కాలరీస్ సంస్థ వెంకటాపురం ప్రాంతంలో ఓపెన్‌కాస్ట్ మైనింగ్‌ను మరింత ముందుకు తీసుకెళ్లకుండా తక్షణమే పునరాలోచించాలని కోరారు. బొగ్గు తవ్వకాలకు ప్రత్యామ్నాయ ప్రాంతాలను పరిశీలించి, పాలంపేట రామప్ప దేవాలయం, రామప్ప సరస్సు మరియు చారిత్రక వారసత్వ ప్రాంతానికి ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సామాజిక కార్యకర్త మండల పరశురాములు మాట్లాడుతూ, ప్రతిపాదిత ఓపెన్‌కాస్ట్ మైనింగ్ ప్రాంతాన్ని అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రత్యక్షంగా సందర్శించాలని కోరారు. కేవలం రాజకీయ అభిప్రాయాల ఆధారంగా కాకుండా భూగర్భ శాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు, ఇంజనీర్లు, వారసత్వ పరిరక్షణ నిపుణులతో కూడిన సాంకేతిక బృందం సమక్షంలో ప్రాంతాన్ని పరిశీలించాలని అన్నారు. ఇప్పటివరకు అందుబాటులో ఉన్న వివిధ నివేదికలు ఈ ప్రాంతంలో ఓపెన్‌కాస్ట్ మైనింగ్ పర్యావరణపరంగా, వారసత్వపరంగా అనుకూలం కాదని సూచిస్తున్నాయని తెలిపారు.

రిటైర్డ్ డీఎఫ్‌వో, ఖాజీపేట పురుషోత్తం మాట్లాడుతూ, ఓపెన్‌కాస్ట్ మైనింగ్ వల్ల ఈ ప్రాంతంలోని జీవవైవిధ్యం తీవ్రంగా దెబ్బతినడంతో పాటు గాలి, నీరు, నేల కాలుష్యానికి దారితీసే ప్రమాదం ఉందని అన్నారు. వెంకటాపురం గ్రామ ప్రజల జీవన విధానంపై కూడా దీని ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా మైనింగ్ కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్లడం సరికాదన్నారు. రామప్ప దేవాలయం, రామప్ప సరస్సు, పాలంపేట చారిత్రక వారసత్వం భవిష్యత్ తరాలకు అందించాల్సిన అమూల్యమైన సంపద అని, వాటి పరిరక్షణకు ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం, రాజకీయ పార్టీలు, ప్రజలు మరియు పర్యావరణ నిపుణులు కలిసి పనిచేయాలని సమావేశంలో కోరారు. వెంకటాపురం ప్రాంతంలో ప్రతిపాదిత ఓపెన్‌కాస్ట్ బొగ్గు తవ్వకాలను నిలిపివేసి, ప్రత్యామ్నాయ ప్రాంతాలను పరిశీలించాలని కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ డిమాండ్ చేసింది.

## గద్వాల జిల్లాలోనే తొలిసారి

*మాన్ దొడ్డి ఉప సర్పంచ్ 'చెక్ పవర్' తాత్కాలిక రద్దు*



**గద్వాల, అక్టోబర్7 (జనం సాక్షి) :** జిల్లాలోని రాజోలి మండలం మాన్ దొడ్డి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ భీమన్నకు తెలంగాణ ప్రభుత్వ నూతన నిబంధనల ప్రకారం గట్టి షాక్ తగిలింది. గ్రామ అభివృద్ధి పనుల బిల్లులపై ఉద్దేశపూర్వకంగా సంతకాలు చేయడం లేదన్న ఫిర్యాదుతో ఆయనకున్న జాయింట్ చెక్ పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు.ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నూతన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో ఒక ఉప సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేయడం ఇదే మొదటిసారి కావడంతో స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.సర్పంచ్ ఫిర్యాదుతో రంగంలోకి దిగినయంత్రాంగం,మాన్ దొడ్డి గ్రామ సర్పంచి సుజాత, ఉప సర్పంచ్ భీమన్నల మధ్య కొంతకాలంగా నిధుల విత్‌డ్రా విషయంలో వివాదం నడుస్తోంది. గ్రామ పరిధిలోని వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా బిల్లులపై ఉప సర్పంచ్ సంతకం చేయకుండా కాలయాపన చేస్తున్నారని సర్పంచ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనివల్ల గ్రామంలో అత్యవసర పనులకు ఆటంకం కలుగుతోందని నివేదించారు. ప్రభుత్వం తెచ్చిన నిబంధనల ప్రకారం.. ఎలాంటి సరైన కారణం లేకుండా ఏడు రోజుల కంటే ఎక్కువ కాలం చెక్కులపై సంతకం చేయకుండా జాప్యం చేయడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. రాజోలి ఎంపీడీవోకు బాధ్యతలు,ఉప సర్పంచ్ భీమన్న వైఖరి వల్ల అభివృద్ధి కుంటుపడుతోందని నిర్ధారించిన అనంతరం, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఆయన జాయింట్ చెక్ పవర్ బాధ్యతలను తాత్కాలికంగా రాజోలి మండల పరిషత్ అభివృద్ధి అధికారికి అప్పగిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. పంచాయతీ కార్యకలాపాలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఈ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు డీపీవో శ్రీకాంత్ స్పష్టం చేశారు. అభివృద్ధికి ఆటంకం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఈ చర్య ద్వారా అధికారులు స్పష్టమైన సంకేతాలు పంపారు.

# నీటి వినియోగంలో అప్రమత్తంగా ఉండాలి

- మంజీరా-సింగూరు నీటిని తాగునీటి అవసరాలకే జాగ్రత్తగా వినియోగించాలి
- సింగూరులో 29 టీఎంసీలకు గాను ప్రస్తుతం 3 టీఎంసీల నీరే ఉంది
- నీటి వృథాను అరికట్టేందుకు ఇంటింటా అవగాహన కల్పించాలి
- తాగునీరు, విద్యుత్ సమస్యలపై అధికారులతో జగ్గారెడ్డి సమీక్ష



**సంగారెడ్డి, అక్టోబర్ 7 (జనం సాక్షి):** సంగారెడ్డి నియోజకవర్గంలో రానున్న ఏడు నెలలు తాగునీటి విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఉందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. మళ్లీ వర్షాలు కురిసే వరకు మంజీరా, సింగూరు నీటిని తాగునీటి అవసరాల కోసం పొదుపుగా వినియోగించాలని ప్రజలకు సూచించారు. నియోజకవర్గంలోని తాగునీరు, విద్యుత్ సమస్యల పరిష్కారంపై విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, మున్సిపల్ శాఖల అధికారులతో జగ్గారెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల పరిధిలో తాగునీటి పరిస్థితి, నీటి లభ్యత, సరఫరా సమస్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో సింగూరు ప్రాజెక్టుపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సింగూరుకు వచ్చే నీరు కర్ణాటక, మహారాష్ట్రలో కురిసే వర్షాలపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. నీటి లభ్యతను బట్టి వినియోగాన్ని నియంత్రించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సింగూరు ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29 టీఎంసీలు కాగా, ప్రస్తుతం సుమారు 3 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని అధికారులు వివరించారు. ప్రస్తుతం ఉన్న నీటితో డిసెంబర్ వరకు తాగునీటి సరఫరా కొనసాగించగలమని భావిస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలో పాంప్లెట్లు, మైకుల ద్వారా ఇంటింటా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ఇళ్లలో నల్లా నీటిని వృథా చేయకుండా అవసరం లేని సమయంలో కుళాయిలను మూసివేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంజీరా, సింగూరు పరిధిలో మోటార్లతో యథేచ్ఛగా నీటిని తోడటాన్ని నియంత్రించాలని పలువురు కోరారు. మంజీరా బ్యారేజీ నుంచి హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ నీటి డ్రాయింగ్‌ను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నియంత్రించేలా విజ్ఞప్తి చేస్తే సంగారెడ్డి మున్సిపాలిటీకి మరికొంత కాలం తాగునీటి సరఫరా కొనసాగించే అవకాశం ఉంటుందని సమావేశంలో చర్చించారు. కంది పరిసర ప్రాంతాల్లోని చెరువుల్లో నీరు అందుబాటులో ఉన్నందున గ్రామంలోని 28 బోర్లకు అవసరమైన మోటార్లు ఏర్పాటు చేయాలని నాయకులు కోరారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో ప్రెషర్ పెంచితే ఇస్మాయిల్‌ఖాన్‌పేట, హనుమాన్‌నగర్, ఫసల్‌వాడి గ్రామాలకు నీటి సరఫరా మెరుగుపడుతుందని సమావేశంలో ప్రస్తావించారు. కంది మండలం తోపుగొండలో మిషన్ భగీరథ నీరు నెలకు నాలుగుసార్లు మాత్రమే వస్తోందని నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల్లో పశువులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా సర్పంచ్‌లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. సింగూరు ప్రాజెక్టు నుంచి ఇటీవల నీటిని విడుదల చేసిన అంశంపై జగ్గారెడ్డి మాట్లాడుతూ.. ఢిల్లీ నుంచి వచ్చిన డ్యామ్ సేఫ్టీ అధికారులు సింగూరు ప్రాజెక్టును పరిశీలించి కట్టలో కొంత భాగం దెబ్బతిన్నట్లు గుర్తించారని తెలిపారు. మరమ్మతుల కోసం కొంత నీటిని విడుదల చేయాలని నిపుణుల కమిటీ సూచించిన మేరకే నీటిని విడుదల చేసినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ పర్యవేక్షణలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో డ్యామ్‌ను కాపాడుకోవాలనే ఉద్దేశంతోనే నీటిని విడుదల చేశామని, సాంకేతిక నిపుణుల సూచనల మేరకు తీసుకున్న నిర్ణయాన్ని రాజకీయంగా విమర్శించడం సరికాదన్నారు. నియోజకవర్గంలో విద్యుత్ బ్రేక్‌డౌన్లు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటి కారణంగా మోటార్లు కాలిపోతున్నాయని నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370